

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 2

సోమవారం 25-3-2024



ముంబై మరో'సారీ'...

వరుసగా 12వ ఏడాది ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో పరాజయం. - 12లో



మీ పెట్టుబడులకు రక్షణ ఉందా?

స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు స్ట్రెస్ టెస్ట్.. ప్రతి నెలా విడుదల కానున్న డేటా - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లోక్‌సభ బరిలో వీరప్పన్ కుమార్తె

2004లో హతమైన గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి లోక్‌సభ బరిలో నిలిచారు.

- వివరాలు 6లో



ఉగ్ర లింకులతో ఐఐటీ విద్యార్థి అరెస్ట్

ఉగ్ర సంస్థ ఐసిస్‌తో సంబంధాల ఆరోపణలపై గువాహటి–ఐఐటీకి చెందిన ఓ విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


- వివరాలు 6లో



కంగనా, జిందాల్‌కు బీజేపీ టికెట్లు

బాలీవుడ్ నటి కంగనా రనౌత్, నవీన్ జిందాల్ సహా 111 మంది ఎంపీ అభ్యర్థులతో బీజేపీ ఐదో జాబితా విడుదల చేసింది.

- వివరాలు 6లో



టెట్ ఫీజుపై టెన్షన్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫీజును అమాంతం రెండింతలకుపైగా పెంచడంపై నిరుద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

- వివరాలు 5లో

న్యూస్‌రీల్

ఫిరాయింపులకు కాదు.. ప్రాజెక్టుల గేట్లు తెరవాలి



కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎమ్మెల్యేల ఫిరాయింపునకు గేట్లు తెరవకుండా, అన్నదాతల పంటల రక్షణకు ప్రాజెక్టుల గేట్లు తెరవాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి , సత్యవతి రాథోడ్, కడియం శ్రీహరి హితవు పలికారు.

- వివరాలు 2లో

కుల బంధంతోనే చంద్రబాబుకు జేపీ భజన



మేధావి ముసుగులో జయప్రకాశ్ నారాయణ్ కుల కుటిలతత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఏపీ చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి మండిపడ్డారు. ఐదేళ్లు అధికారం ఇస్తే చంద్రబాబు ఏపీని సర్వనాశనం చేశారన్నారు.

- వివరాలు 3లో

వేసవి ప్రయాణానికి ఎదురుచూపులే



హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వేసవి సెలవుల్లో పర్యాటక ప్రదేశాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకునే వారికి ఈసారి ఎదురుచూపులు తప్పేలా లేవు. అన్ని రెగ్యులర్ రైళ్లలోనే వెయిటింగ్ లిస్టు ఇప్పటికే వందల్లోకి చేరింది.

- వివరాలు 14లో

ఆర్టీసీ ఉద్యోగులకు కరువు భత్యం 43.2 శాతం



వేతన సవరణలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు 43.2 శాతం కరువు భత్యం ఖరారైంది. వేతన సవరణ అనంతరం ఉండే మూలవేతనంపై అంతమేర కరువు భత్యాన్ని లెక్కించి జీతంలో భాగంగా చెల్లించనున్నారు.

- వివరాలు 14లో

కాంగ్రెస్‌లో కంగాళీ!

రాష్ట్రంలో అధికారం దక్కాక జరుగుతున్న తొలి ఎన్నికల్లోనే గందరగోళం

లోక్‌సభ అభ్యర్థుల ప్రకటనలో బీఆర్‌ఎస్, బీజేపీల కంటే వెనుకంజ

ఇప్పటికే మెజార్టీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి.. ప్రచారం చేపట్టిన విపక్షాలు

- అధికార కాంగ్రెస్ టికెట్లు ఇచ్చిన తొమ్మిది మందిలో నలుగురు పారాచూట్ నేతలే!.. టికెట్ల కేటాయింపులోనూ నేతల కుటుంబాలకే ప్రాధాన్యం..
- సద్దుమణగని మాల, మాదిగ సామాజిక వర్గాల వివాదం
- ఇంకా ప్రకటించాల్సిన ఎనిమిది సీట్లపై కుదరని ఏకాభిప్రాయం.. ఈ పరిస్థితిపై పార్టీలో అంతర్గతంగా తీవ్ర చర్చలు



సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ రాజకీయ అనుభవం, దశాబ్దాల సీనియారిటీ ఉన్న నాయకులు.. రాష్ట్రంలో చేజిక్కిన అధికారం.. ఢిల్లీ నుంచి పర్యవేక్షణ.. స్క్రీనింగ్ కమిటీలు, ప్రదేశ్ ఎన్నికల కమిటీల వరుస సమావేశాలు.. చర్చలు.. ఇంత చేసీ లోక్‌సభ అభ్యర్థుల ఖరారుపై రాష్ట్ర కాంగ్రెస్ మల్లగుల్లాలు పడుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలను ఎదుర్కోవడంలో ఆ పార్టీ గందరగోళానికి గురవుతోందనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్రంలో ప్రతిపక్షాలైన బీఆర్‌ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను వడివడిగా ఖరారు చేస్తూ, ప్రచారంలో ప్రజాక్షేత్రంలో దూసుకెళ్లేందుకు వ్యూహాలు పన్నుతుంటే.. అధికార కాంగ్రెస్ మాత్రం ఇంకా అభ్యర్థుల ఖరారు స్థాయిలోనే తలమునకలైంది. లోక్‌సభ ఎన్నికల రేసులో అధికార కాంగ్రెస్ మిగతా పక్షాల కంటే వెనుకంజలో ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇప్పటివరకు 9 స్థానాలకే అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. ఎనిమిదింటిని పెండింగ్‌లో పెట్టింది. అయితే అటు ఖరారు చేసిన స్థానాల్లోనూ, ఇటు ఇంకా అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన స్థానాల్లోనూ అనేక సమస్యలు ఎదురవుతున్న పరిస్థితి. ముఖ్యంగా పారాచూట్ నేతలకు టికెట్లివ్వడం, దళిత సామాజిక వర్గాల మధ్య సర్దుబాటు చేయలేకపోవడం, పార్టీ సీనియర్ నేతల కుటుంబాలకే లోక్‌సభ టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం

మిగతా 5వ పేజీలో ▶

ఎనిమిది చోట్ల ఖరారుపై తకరారు!

ఆదిలాబాద్ ఈ లోక్‌సభ సీటులో స్థానిక నేతలు కాకుండా బయటి నుంచి తెచ్చిన వారిని పోటీలో పెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇక్కడ గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన రమేశ్ రాథోడ్ ఇప్పుడు పార్టీలో లేరు. అంతకంటే ముందు పోటీచేసిన డాక్టర్ నరేశ్ జాదవ్ పార్టీలోనే ఉన్నా వేరే అభ్యర్థి కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో రిమ్స్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ సుమలత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణలలో ఒకరిని బరిలోకి దింపాలని భావిస్తున్నారు. వీరిలో సుమలత పేరు ఖరారైందని తొలుత ప్రచారం జరిగినా.. ఇప్పుడు ఆత్రం సుగుణ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

వరంగల్ ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో కచ్చితంగా మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాల్సిన పరిస్థితి కాంగ్రెస్‌కు ఏర్పడింది. ఎందుకంటే ఇప్పటివరకు ప్రకటించిన రెండు ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లను మాల సామాజిక వర్గానికే ఇచ్చారు. దీంతో ఇక్కడ మాదిగ

మిగతా 5వ పేజీలో ▶

31న విపక్షాల మహా ర్యాలీ

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు 'ఇండియా' కూటమి సంఘీభావం



కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆదివారం ఢిల్లీలో ధర్నా చేస్తున్న ఆప్ కార్యకర్తలు

ఒక్కతాటిపైకి రానున్న విపక్ష నేతలు

ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ సభ

దేశంలో ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ ఆందోళన

6లో

ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ పరిపాలన



మద్యం పాలసీ స్కాంలో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్... ముఖ్యమంత్రి హోదాలో తాగునీటి సరఫరా సమస్యల పరిష్కరించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వు ప్రతిని మంత్రి ఆతిషిసింగ్ మీడియాకు చూపారు.

6లో

• తడారిన తండాలు



ఏజెన్సీ ప్రజల పాట్లు



ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలంలో వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ఖండాల గ్రామంలో మిషన్ భగీరథ నీరు వారం, పది రోజులకోసారి సరఫరా అవుతోంది. దీంతో గ్రామస్తులు సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వేకువనే కాలినడకన వెళ్లి తెచ్చుకోవలసిన దుస్థితి. పూనగూడ గ్రామస్తులు ఎడ్లబండిపై నాలుగైదు కి.మీ. దూరంలోని చెరువు, బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో ఆదివారం వేకువజామున కనిపించిన దృశ్యాలివి.

- ఆదిలాబాద్ రూరల్/సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఎంపీ సంతోష్‌పై కబ్జా కేసు

ఫోర్జరీ డాక్యుమెంట్లతో స్థలం కబ్జా చేశారని ఆరోపణలు



బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్‌ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్‌పై బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. తమ స్థలాన్ని ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఈ కేసు రిజిస్టర్ కాగా... విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం ... బంజారాహిల్స్ రోడ్డు నంబర్–14లోని సర్వే నెంబర్ 129/54, ప్లాట్ నంబర్–4లో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు (ఎన్‌ఈసీఎల్) 1350 గజాల స్థలం ఉంది. ఈ స్థలాన్ని 2010లో కరణ్ దూబె అనే వ్యక్తి నుంచి ఎన్‌ఈసీఎల్ కొనుగోలు చేసింది. 2023 నవంబర్ 2 వరకు ఈ స్థలం ఎన్‌ఈసీఎల్‌కు చెందినదిగానే రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డుల్లో ఉండటంతో పాటు ఈ మేరకు ఈసీ కూడా జారీ అయింది. 2023 వరకు ఈ స్థలం ఎన్‌ఈసీఎల్‌కు చెందినదే అని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఇతర పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఇటీవల ఈ స్థలంలో రెండు రూమ్‌లు నిర్మించినట్లుగా గుర్తించిన ఎన్‌ఈసీఎల్ ప్రతినిధి చింతా మాధవ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము జీహెచ్‌ఎంసీలో విచారించగా ఈ స్థలాన్ని బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ఫోర్జరీ డాక్యుమెంట్లతో కబ్జా చేసినట్లుగా తెలిసిందన్నారు. సంతోష్ కుమార్‌తో పాటు లింగారెడ్డి శ్రీధర్ అనే వ్యక్తి కూడా ఈ ఫోర్జరీ డాక్యుమెంట్ల తయారీ, బోగస్ ఇంటి నంబర్లను తీసుకోవడంలో కీలకపాత్ర పోషించాడని ఆరోపించారు. విషయం తెలిసిన వెంటనే తాము బంజారాహిల్స్

మిగతా 2వ పేజీలో ▶

రాజకీయ కక్షతో బురద చల్లుతున్నారు

వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు: ఎంపీ సంతోష్

- వివరాలు 2లో



తనకే పడని రంగులు పోశాడట!



ట్యాపింగ్ కేసులో ముగ్గురికి రిమాండ్

అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులతో కలిపి ప్రణీత్‌ను కోర్టులో హాజరుపర్చిన సిట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో శనివారం అరెస్టు చేసిన అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలతోపాటు కస్టడీ ముగిసిన మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావులను సిట్ అధికారులు ఆదివారం నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ప్రణీత్‌రావుకు బుధవారం వరకు, భుజంగరావు, తిరుపతన్నలకు ఏప్రిల్ 6 వరకు న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో.. వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. భుజంగరావు, తిరుపతన్నలను తమ కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరుతూ సిట్ అధికారులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు తొమ్మిది

మిగతా 10వ పేజీలో ▶



789 టీఎంసీలు మాకే కావాలి

కృష్ణాజలాల్లో ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,050 టీఎంసీలపై తెలంగాణ వాదన

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో ఉన్న 1,050 టీఎంసీల్లో 798 టీఎంసీలను తమకు కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కి తెలంగాణ విజ్ఞప్తి చేసింది. వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలోని ప్రాజెక్టులకు 238 టీఎంసీలు, భవిష్యత్‌లో కట్టబోయే ప్రాజెక్టులకు 216 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 36 టీఎంసీలు కలిపి మొత్తం 789 టీఎంసీలు కేటాయించాలని నివేదించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్(కృష్ణా ట్రిబ్యునల్–1) గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలతో పాటు ఇతర కేటాయింపులను.. ఏపీ, తెలంగాణల మధ్య పునః పంపిణీకి కృష్ణా ట్రిబ్యునల్–2కు అదనపు విధివిధానాలు (టీఓఆర్) జారీ చేస్తూ 2023 అక్టోబర్ 10న కేంద్రం గెజిట్

మిగతా 5వ పేజీలో ▶



అసత్యాలు ప్రసారం చేస్తే కేసులు పెడతాం

యూట్యూబ్ చానళ్లకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: వ్యక్తిగతంగా తనతోపాటు బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బతీయాలనే కుట్రతో కొన్ని యూట్యూబ్ చానళ్లు పనిచేస్తున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్యాలను ప్రచారం చేస్తున్న చానళ్లపై ఇప్పటికే యూట్యూబ్, గూగుల్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అసత్యాలను ప్రచారం చేస్తున్న యూట్యూబ్ చానళ్లపై పరువునష్టం దావా వేయడంతోపాటు క్రిమినల్ కేసులు పెడతామని చెప్పారు. ఈ తరహా చానళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కేటీఆర్ పలు వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన కొన్ని యూట్యూబ్ చానళ్లు ఎలాంటి ఆధారాలు లేకుండా అడ్డగోలుగా అసత్యాలను పదేపదే ప్రసారం చేస్తున్నాయని

మిగతా 2వ పేజీలో ▶



వరంగల్‌కు అరూరి.. ఖమ్మం తాండ్ర వినోద్

తెలంగాణలో అన్ని లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన పూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్, ఖమ్మం ఎంపీ అభ్యర్థుల ఎంపికతో తెలంగాణలో బీజేపీ 17 స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించినట్టు అయ్యింది. ఇప్పటికే 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ అధిష్టానం ఆదివారం రాత్రి మిగిలిన రెండు స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. ఇటీవల బీజేపీ కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను వరంగల్ నుంచి, తాండ్ర వినోద్‌రావును ఖమ్మం నుంచి బరిలో దించింది. ఖమ్మం నుంచి వినోద్‌రావు పేరు మొదట్లో పరిశీలనకు వచ్చినా, ఆ తర్వాత బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వరావులలో ఒకరికి బీజేపీ టికెట్ ఇస్తుందని ప్రచారం జరిగింది. ఆ దిశగా జరిగిన పలు పరిణామాలు ఆ ఊహాగానాలకు బలం చేకూర్చాయి. అయితే అనూహ్యంగా తాండ్ర వినోద్‌రావు

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఆస్తులు కాపాడుకునేందుకే బీజేపీలోకి ఈటల: చనగాని



సాక్షి, హైదరాబాద్: కేసుల నుంచి బయటపడి తన ఆస్తులను కాపాడుకునేందుకే మాజీ మంత్రి ఈటల రాజేందర్ బీజేపీలోకి వెళ్లారని, అలాంటి నాయకుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ తెలిపారు. మల్కాజ్‌గిరి నుంచి విజయం సాధించేందుకే ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అసలు ఆయన బీజేపీలోకి ఎందుకు వెళ్లారో మల్కాజ్‌గిరి ప్రజలకు చెప్పిన తర్వాతే ఓట్లు అడగాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, నిజంగా రాజేందర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన ప్రధాని మోదీని నిలదీయాలని కోరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని దయాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లోకి సతీశ్ మాదిగ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, గత ఎన్నిక ల్లో అచ్చంపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చే సిన దేవని సతీశ్ మా దిగ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని మల్లు రవి నివాసంలో జరిగిన చర్చల అనంతరం ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దళితులకు న్యాయం జరిగేది కాంగ్రెస్ పార్టీలోనేనని చెప్పారు. తెలంగాణ విషయంలో బీజేపీ మోసం చేసిందని, అదే తరహాలో ఇప్పుడు మాదిగలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

అసత్యాలు ప్రసారం చేస్తే కేసులు పెడతాం

▶ మొదటి పేజీ తరువాయి

కేటీఆర్ పేర్కొన్నారు. 'ప్రజలను తప్పుదోవ పట్టించేలా థంబ్ నెయిల్స్ పెడుతూ వార్తల పేరిట పచ్చి అబద్ధాలను చూపిస్తున్నాయి. మాపై గుడ్డి వ్యతిరేకత లేదా అధికార పార్టీ ఇచ్చే డబ్బులకు ఆశపడి ఇలాంటి నేరపూరితమైన చట్టవిరుద్ధమైన వీడియోలు, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేస్తున్నాయి. ఇది వ్యక్తిగతంగా నాతోపాటు, మా పార్టీని దెబ్బతీయాలన్న కుట్రలో భాగంగానే జరుగుతోంది. ప్రజలను అయోమయానికి గురిచేసి, తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న చర్యలుగా వీటిని భావిస్తున్నాం.' అని కేటీఆర్ పేర్కొన్నారు.

వారిపై చర్యలు తప్పవు

'గతంలో మాపై అసత్య ప్రచారాలు, అవాస్తవాలను ప్రసారం చేసిన, ప్రచురించిన మీడియా సంస్థలపైన కూడా న్యాయపరమైన చర్యలు ప్రారంభించాం. కొన్ని యూట్యూబ్ చానల్స్ ప్రస్తుతం చేస్తున్న ఈ దుర్మార్గపూరిత, కుట్రపూరిత చర్యలను చట్టబద్ధంగా ఎదుర్కొంటాం. ఇప్పటికైనా ఈ చానళ్ల తీరు మార్చుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కుట్ర పూరితంగా వ్యవహారం నడిపే యూట్యూబ్ చానళ్లు చట్ట ప్రకారం తగిన శిక్షకు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ హెచ్చరించారు.

మోసం.. దగా..నయవంచన

రుణాలు చెల్లించాలంటూ రైతులకు బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నా రేవంత్ ప్రభుత్వం స్పందించకపోవడం మోసం..దగా..నయవంచన అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు బ్యాంకు రుణాలున్న రైతులు రూపాయి కూడా చెల్లించొద్దు అంటూ రేవంత్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ ప్రకటించారన్నారు.

కూటమి కుదురుకునేనా?

- తెలంగాణలో 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య అంతుచిక్కని అంతరం
- అసెంబ్లీ ఎన్నికల నుంచే కొనసాగుతున్న గందరగోళం



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 'ఇండియాకూటమి' మధ్య పొత్తు చర్చలు జరుగుతున్నా, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, వామపక్షాల మధ్య ఇంకా అంతరం కొనసాగుతోంది. కూటమిలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ కీలకంగా ఉన్నా, రాష్ట్రంలో మాత్రం ఆ పార్టీల మధ్య సఖ్యత కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడినా..పొత్తులపై ఇప్పటికీ ఆ పార్టీల మధ్య అవగాహన కుదరలేదు. ఒకవైపు బీజేపీ ప్రమాదం ముంచుకొస్తుందని కాంగ్రెస్, వామపక్షాలు చెబుతున్నా, ఐక్యత మాత్రం ప్రదర్శించలేకపోతున్నాయి. రాష్ట్రంలో బీజేపీకి కూడా గణనీయమైన ఎంపీ స్థానాలు వస్తాయనే అంచనాలున్న నేపథ్యంలో ఎంతోకొంత ప్రభావం చూపగలిగే వామపక్షాలను కాంగ్రెస్ పార్టీ పరిగణనలోకి తీసుకోవడం లేదని, గత అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచీ కాంగ్రెస్ వైఖరి ఇలాగే ఉందని లెఫ్ట్ నేతలు వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల వరకు నానబెట్టి చివరకు సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. కాంగ్రెస్ సీపీఎం రెండూ రాజీకి రాలేకపోయాయి.

ఎన్నికల వేళ మాటల యుద్ధం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించింది. అభ్యర్థులను ప్రకటించుకుంటూపోతోంది. ఈ నేపథ్యంలో తమతో చర్చలు జరపకపోవడంపై వామపక్షాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాదు వివిధ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలవడానికి ప్రయత్నాలు చేస్తున్నా, సమయం ఇవ్వడం లేదని వామపక్ష నేతలు మండిపడుతున్నారు. ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళ వెళ్లి అక్కడి సీపీఎం సీఎం పినరయి విజయన్‌ను విమర్శించడాన్ని కూడా కామ్రేడ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బహిరంగంగానే విమర్శించారు. మరోవైపు సీపీఐ నేతలు కూడా కాంగ్రెస్ వైఖరిని తూర్పారబడుతున్నారు. పార్టీలు మారిన వారికి పెద్దపీట వేస్తూ, తమకు ఒక ఎంపీ సీటు ఇవ్వడానికి వెనుకాడుతున్నారని సీపీఐ విమర్శిస్తోంది. తమిళనాడు రాష్ట్రాన్ని చూసైనా నేర్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్‌కు సూచించారు.

అభ్యర్థిని ప్రకటించిన సీపీఎం

పొత్తులపై స్పష్టత రాకపోవడంతో సీపీఎం ఇటీవల భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్‌కు జహంగీర్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. ఇతర చోట్ల ఎవరికి మద్దతు ఇవ్వాలన్న దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల్లో కలిసి పనిచేసే విషయంలో బీఆర్‌ఎస్ నుంచి తమకు ప్రతిపాదన వస్తే ఏం చేయాలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య చెప్పడం గమనార్హం. ఇక సీపీఐ కూడా కాంగ్రెస్ తీరుపై గరంగరంగా ఉంది. గత ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని ఒక స్థానంలో గెలవడంతో దూకుడుగా వెళ్లడానికి సీపీఐ కాస్తంతా వెనుకాముందు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

నాలుగైదు రోజుల్లో చర్చలుంటాయా?

కాంగ్రెస్ పార్టీ నాలుగైదు రోజుల్లో తమతో చర్చలు జరుపుతుందని అంటున్నారని వామపక్ష నేత ఒకరు పేర్కొన్నారు. ఏదిఏమైనా ఈ చర్చల్లో చెరో సీటు అడగాలని ఆ పార్టీలు భావిస్తున్నాయి. ఒకవేళ ఎంపీ సీట్లు ఇవ్వకుండా మద్దతు కాంగ్రెస్ కోరితే కనీసం చెరో ఎమ్మెల్సీ అడిగే ఆలోచనలో వామపక్షాలు ఉన్నట్టు సమాచారం. మరోవైపు చెరో ఎంపీ స్థానంలో తమ అభ్యర్థిని స్నేహపూర్వకపోటీ పెట్టడం ద్వారా బరిలో నిలపాలని కూడా లెఫ్ట్ వర్గాలు భావిస్తున్నట్టు తెలిసింది.

పంటలెండుతున్నా పట్టింపేదీ?

- కాళేశ్వరంపై కుంగిన పిల్లర్ల పేరిట రాజకీయం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో కంచర్ల కృష్ణారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న కరువుతో రైతులు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నా, లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులు రుణం ఇవ్వకున్నా ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పు తెచ్చి మరీ సాగు చేసిన రైతులు నష్టపోతున్నా.. ప్రభుత్వానికి సోయి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ నేత మల్లికార్జున్ రెడ్డితో కలిసి జగదీశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వంద టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశమున్నా.. కుంగిన పిల్లర్ల పేరిట రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై వెంటనే సమీక్షించాలని, కర్నాటక నుంచి 10 టీఎంసీల నీరు తెచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలోనూ కేఆర్‌ఎంబీ ఉన్నా రైతుల కోసం సాగు నీరు ఇచ్చామని జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. నల్లగొండ జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి నాగార్జునసాగర్ ప్రాజెక్టుపైకి వెళ్లేందుకు లాగులు తడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు నీళ్ల మీద పరిజ్ఞానం లేదన్నారు. కాంగ్రెస్ మంత్రులు వసూళ్లు, ముడుపుల చెల్లింపులు మొదలు పెట్టారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒకరికొకరు బీ టీమ్‌లా పనిచేస్తున్నాయన్నారు. ఈడీ కేసుల పేరిట ఎన్నికల ముందు ప్రతిపక్షాల నోరు నొక్కడం బీజేపీ పనిగా పెట్టుకుందని.. కేజ్రీవాల్, కవిత అరెస్టులే నిదర్శనమని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఈ లింక్‌పై క్లిక్ చేయొద్దు

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలంటూ సైబర్ నేరగాళ్ల నకిలీ ప్రకటనలు

సాక్షి, హైదరాబాద్: భారత వాయుసేనలో చేరాలని యువతలో చాలా కలలు కంటుంటారు. ఇలాంటి కలల్నే తమకు అనుకూలంగా మార్చుకుని సైబర్ నేరగాళ్లు అనేక మోసాలకు తెరదీస్తున్నారు. ఇటువంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు యువతను హెచ్చరిస్తున్నారు. భారత వాయుసేనలో చేరాలంటే తాము ఇచ్చే ప్రకటనలోని లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలంటూ సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి వాటిల్లో సైబర్ నేరగాళ్లు నకిలీ ప్రకటనలు ఇస్తున్నారు. ఇలా అభ్యర్థుల నుంచి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఆ తర్వాత దరఖాస్తు కోసమని, వెరిఫికేషన్ చార్జీల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దని వారు సూచించారు.

ఆ స్థానాలు మాలలకు కేటాయించడంపై హర్షం

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన నేతలు

ఫిలింనగర్ (హైదరాబాద్): రాష్ట్రంలోని పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాలను మాలలకు కేటాయించడం పట్ల తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ నేతృత్వంలో సంఘం నేతలు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ అధిష్టానం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు కూడా ధన్యవాదాలు చెప్పారు.

సంతోష్‌పై కబ్జా కేసు

▶ మొదటి పేజీ తరువాయి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారించామని, ఈ నేపథ్యంలోనే జోగినపల్లి సంతోష్‌కుమార్, లింగారెడ్డి శ్రీధర్‌లు ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తేలిందని చింతా మాధవ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ స్థలాన్ని ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా అందులోకి అక్రమంగా ప్రవేశించి రెండు గదులు నిర్మించడం, జీహెచ్‌ఎంసీలో ఫోర్జరీ డాక్యుమెంట్లు దాఖలు చేసి బోగస్ ఇంటి నెంబర్లను తీసుకున్న జోగినపల్లి సంతోష్ కుమార్, లింగారెడ్డి శ్రీధర్‌లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని ఆధారంగా పోలీసులు వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సార్.. గిరాకీల్లేవ్!

అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

- ఇల్లు గడిచే పరిస్థితి లేదు
- బండి సంజయ్‌కి ఆటో డ్రైవర్ల మొర
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని బండి హామీ



బండి సంజయ్‌తో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

కరీంనగర్ టౌన్: 'సార్ మూడు నెలలుగా గిరాకీల్లేవు. ఫైనాన్స్ తెచ్చి ఆటో నడుపుతున్నాం. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం. గిరాకీ అంతంత మాత్రమే వస్తోంది. బడి పిల్లలను తీసుకెళ్తుండటంతో వాళ్లిచ్చే డబ్బులతో ఇల్లు గడుస్తోంది. ఎండాకాలం సెలవులొస్తున్నాయి. ఇక ఆ గిరాకీ కూడా ఉండదు. అప్పుల బాధ దేవుడెరుగు.. ఎట్లా బతకాలో అర్థం అయితలేదు'అంటూ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఎదుట కరీంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్లు మొర పెట్టుకున్నారు. బండి సంజయ్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆటో డ్రైవర్లను కలిశారు. వారితో కలసి చాయ్ తాగుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో తమకు గిరాకీ లేకుండా పోయిందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇన్సూరెన్స్ చెల్లించే పరిస్థితి లేదన్నారు. మరోవైపు ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. రాబోయే రెండు నెలలపాటు స్కూళ్లు కూడా ఉండవని, ఇల్లు గడవడం కష్టమయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. బండి మాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మంచిదే అయినా ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని వెల్లడించారు.

రాహుల్‌గాంధీ ఈ జన్మలో ప్రధాని కాడు

ఆరు గ్యారంటీల పేరుతో సీఎం రేవంత్ మోసం చేయాలని చూస్తున్నాడు

- కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసినా, డబ్బు ఖర్చు పెట్టినా డబుల్ డిజిట్ సీట్లు బీజేపీకే..
- రాష్ట్ర పదాధికారుల భేటీలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఈటల, కె.లక్ష్మణ్, బండి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో 17 ఎంపీ సీట్లలో కాంగ్రెస్ గెలిచి రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే ఆరు గ్యారంటీలు అమలు అవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నాడు. కానీ ఈ జన్మలో రాహుల్‌గాంధీ ప్రధాని కాడు'..అని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసినా, డబ్బులు ఖర్చు పెట్టినా, డబుల్ డిజిట్ సీట్లు బీజేపీకే వస్తాయన్నారు. రేవంత్‌రెడ్డి కొత్తగా సీఎం అయ్యారని విమర్శించకుండా విడిచిపెట్టాల్సిన అవసరం పార్టీ, నేతలకు లేదని చెప్పారు. మహిళలు స్వచ్ఛందంగా బీజేపీ కార్యక్రమాలకు వస్తున్నారు..మోదీ ప్రధాని కావాలని అంటున్నారన్నారు. 'కేంద్ర పథకాలతో ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణలో బీజేపీ సానుకూల వాతావరణం ఉంది.అద్భుతమైన ఫలితాలు సాధిస్తాం. ఇంటింటికి వెళ్లి ఓటరును కలవాలి' అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన్మోహన్‌సింగ్ పదేళ్ల పాలనతో మోదీ పాలనను సరిపోల్చి కాంగ్రెస్ చరిత్రనే అవినీతి అని ప్రజలకు వివరించాలని సూచించారు.

లోక్‌సభ అభ్యర్థులతో ముఖాముఖి

లోక్‌సభ ఎంపీ అభ్యర్థులతో కిషన్‌రెడ్డి, ఇతర ముఖ్యనేతలు ముఖాముఖి మాట్లాడారు. సెగ్మెంట్ పరిధిలో పరిస్థితి ఎలా ఉంది. ప్రచార సరళి, ఓటర్ల మనోగతం, వివిధ పార్టీల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

12 నుంచి 15 సీట్లు గెలుస్తాం : డీకే.అరుణ

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ 12 నుంచి 15 స్థానాలు గెలుస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. 'ఎక్కడికెళ్లినా అందరి నోట ఒకటే మాట. మోదీకే మా ఓటు. గ్రామాల్లో ముసలివారు సైతం మోదీకే ఓటు అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు ఏ పార్టీకి ఓటు వేసుకున్నా ఈ ఎన్నికల్లో మోదీకే వేస్తామంటున్నారు.' అని ఆమె చెప్పారు.

6న ప్రతి పోలింగ్ బూత్‌లో టిఫిన్ బైఠక్ : బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి

వచ్చే నెల 6న ప్రతి పోలింగ్‌బూత్‌లో టిఫిన్ బైఠక్‌లు నిర్వహించనున్నట్టు బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి వెళతాం. కార్నర్ మీటింగ్‌లకు ప్రాధాన్యం. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్యక్రమాలు చేపడతాం' అని ప్రకటించారు.

బీజేపీలోకి చేరికలు...

అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి బీజేపీ రెబెల్‌గా పోటీచేసిన విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరులు, కోదాడ నియోజకవర్గానికి చెందిన ఓయూ జేఏసీ నేత అంజియాదవ్, కార్యకర్తలు, మహబూబ్‌నగర్ లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. బీజేపీ కార్యాలయంలో జి.కిషన్‌రెడ్డి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీనేతలు డీకే.అరుణ, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలదళం.. కదనరంగం

30 రోజుల ఎన్నికల ప్రణాళిక ఖరారు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెలరోజులకు (మార్చి25 – ఏప్రిల్ 25)పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యాచరణను రాష్ట్ర బీజేపీ సిద్ధం చేసింది. పోలింగ్‌బూత్ స్థాయిల్లో మోదీ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందినవారు, మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)ను కలిసి వారిద్వారా వివిధవర్గాల మద్దతు కూడగట్టాలని నిర్ణయించింది. ఆదివారం పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యకుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర బీజేపీ పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ కన్వీనర్లు, ప్రభారీలు, మోర్చాల అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయకార్యదర్శి సునీల్ బన్సల్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్, జాతీయ కార్యవర్గసభ్యులు ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు.

నేతల తీరుపై సునీల్‌బన్సల్ అసంతృప్తి !

అన్ని పార్టీల కంటే ముందుగానే బీజేపీ అభ్యర్థులను ప్రకటించినా, ఆశించినస్థాయిలో జనాల్లోకి వెళ్లలేదని బీజేపీ నేతలపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. డిజిటల్ వ్యాన్స్ ఇచ్చాం. అయినా ఎక్కడా తిరగట్లేదు..ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించినట్టు సమాచారం. 'ప్రతి బూత్‌లో అధికంగా ఓట్లు వస్తేనే.. పార్లమెంట్ స్థానాలు గెలుస్తాం. మనకు ఇంకా టైం ఉంది. ఇప్పటికైనా స్పీడప్ చేయాలి. అలా అయితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పినట్టు తెలిసింది.

పదాధికారుల భేటీలో తీసుకున్న నిర్ణయాలు

- పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 6న పోలింగ్‌సెంటర్ వారీగా 'టిఫిన్ బైఠక్'ల నిర్వహణ
- నమో యాప్ ద్వారా చిన్నమొత్తం నిధులు (మైక్రో డొనేషన్స్) పొందేందుకు కృషి
- ప్రతి పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించడం
- ప్రతి పోలింగ్ బూత్‌లో 370 ఓట్లు (సుమారుగా పోలైన ఓట్లలో 50 శాతం) సాధించేందుకు కృషి
- ప్రతి బూత్‌ను పార్టీ బలాన్ని బట్టి ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించి బలోపేతానికి కృషి చేయాలి
- లోక్‌సభ అభ్యర్థి నేరుగా పాల్గొనేలా సమావేశాల నిర్వహణ
- లోక్‌సభ, అసెంబ్లీ స్థాయిల్లో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ భేటీలు తరచు నిర్వహించి, ప్రచార కార్యక్రమాల ముమ్మరం
- గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని స్థాయిల్లో కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానించడం
- వివిధ మోర్చాలు.. ముఖ్యంగా యువమోర్చా- మొదటిసారి ఓటేస్తున్న యువతను ఆకర్షించే విధంగా, కిసాన్‌మోర్చా- రైతులలో, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మోర్చాలు- ఆయా వర్గాలతో నిరంతర సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీకి అధిక ఓట్లు వచ్చే విధంగా కృషి చేయడం
- నామినేషన్ల దాఖలు పూర్తయ్యే దాకా ప్రతి లోక్‌సభ సెగ్మెంట్‌లో విస్తృతస్థాయి సమావేశాల ఏర్పాటు
- బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు ప్రతి నాయకుడు తన పోలింగ్ బూత్‌లో కోఆర్డినేటర్‌గా పనిచేయాలి
- నామినేషన్ల దాఖలులోపు బూత్ స్థాయిలో ఓటర్ల లిస్ట్‌పై అవగాహన కల్పించుకోవాలి
- ఎన్నికలలోపు ప్రతి ఓటరును కనీసం మూడుసార్లు కలిసేవిధంగా కార్యాచరణ రూపొందించాలి

ఫిరాయింపులకు కాదు.. ప్రాజెక్టుల గేట్లు తెరవాలి

ప్రభుత్వానికి హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతి, కడియం హితవు

- రైతాంగ సమస్యలపై సచివాలయాన్ని ముట్టడిస్తాం
- పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ. 25 వేలు పరిహారం ఇవ్వాలి



చింతబాయితండాలో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, ఎర్రబెల్లి తదితరులు

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎమ్మెల్యేల ఫిరాయింపునకు గేట్లు తెరవకుండా, అన్నదాతల పంటల రక్షణకు ప్రాజెక్టుల గేట్లు తెరవాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, కడియం శ్రీహరి హితవు పలికారు. ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబాయితండాలో బోర్లు ఎత్తిపోయి, సాగునీరు అందక ఎండిపోయిన వరి పొలాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు బృందం రైతులతో మాట్లాడింది. నీళ్లు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు శివశంకర్ అనే రైతు అప్పులు చేసి మూడు నెలల్లో 6 బోర్లు, సత్యమ్మ 4 బోర్లు, నర్సింహ 3 బోర్లు, జంకు 9 బోర్లు, లక్ష్మి 6 బోర్లు, విజయ 4 బోర్లు వేశారు. అయినా ఫలితం లేదని రైతులు వాపోయారు. హరీశ్‌రావు, ఎర్రబెల్లి, కడియం వీరి కష్టాలను ప్రస్తావిస్తూ, సీఎం, మంత్రులు హైదరాబాద్‌లో రాజకీయాలు మాని వ్యవసాయ క్షేత్రాలకు వచ్చి.. రైతులకు ఆత్మవిశ్వాసం కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా పలకరించిన పాపానపోలేదన్నారు. గోదావరి నదిలో నీళ్లున్నా ప్రభుత్వం రైతులకు అందించలేక చేతులెత్తేసిందని, రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని చెప్పి వంద రోజులు దాటినా నెరవేర్చలేదని, రైతుబంధు కింద రూ.15 వేలు ఇస్తామని మోసం చేశారని ధ్వజమెత్తారు. గతంలో తామిచ్చిన రూ.పది వేలు కూడా ఇవ్వడం లేదని, కౌలు రైతులను సైతం దగా చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో కాల్వలకు పుష్కలంగా నీళ్లు ఇవ్వగా రెండు పంటలు పండించుకుని రైతులు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ వచ్చాక నీళ్లు, కరెంటుకు కష్టాలు ప్రారంభమయ్యాయని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడమే కాకుండా.. వడగళ్ల వానలతో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అన్నారు. అయినా ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టడం లేదన్నారు. సత్వరమే దెబ్బతిన్న వరి పంటకు ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని, వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని, అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి వారి వెంట ఉన్నారు.

రాజకీయ కక్షతో బురద చల్లుతున్నారు

వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు: ఎంపీ సంతోష్



సాక్షి, హైదరాబాద్: తనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీపై రాజకీయ కక్షతో బురదజల్లాలని చూస్తే సహించేది లేదని రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ హెచ్చరించారు. తప్పుడు ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించాలని చూస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. భూ కబ్జాకు పాల్పడినట్లు తనపై నమోదైన పోలీసు కేసుపై సంతోష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన ఆస్తిపై అనవసర నిందలు వేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. నేను ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదు. న్యాయపరమైన విచారణకు సిద్ధంగా ఉన్నా. నాపై నమోదు అయిన కేసు రాజకీయ దురుద్దేశంతో జరిగింది' అని సంతోష్ పేర్కొన్నారు.

చట్టబద్ధంగానే భూమి కొనుగోలు..

'సర్వే నంబర్ 129/54లో ఉన్న 904 చదరపు గజాల ఇంటి స్థలాన్ని శ్యాంసుందర్ ఫుల్జాల్ అనే వ్యక్తి నుంచి 2016లో రూ.3.81 కోట్లు చెల్లించి కొనుగోలు చేశాను. ఫోర్జరీ అనేది అవాస్తవం. సుమారు 32 ఏళ్లుగా నేను కొనుగోలు చేసిన భూమిపై ఎలాంటి న్యాయవివాదాలు లేవు. నేను కొనుగోలు చేసిన తర్వాత అందులో ఎలాంటి నిర్మాణాలు కూడా చేపట్టలేదు. అయినా నాకు ఎలాంటి లీగల్ నోటీసు ఇవ్వకుండా పోలీస్ స్టేషన్లో ఫోర్జరీ చేశామని ఫిర్యాదు చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉంది' అని సంతోష్ కుమార్ పేర్కొన్నారు.

‘ఎల్లో’ కల్లోలం

30కి పైగా స్థానాల్లో భగ్గుమంటున్న అసమ్మతి

- సీట్లు రాక పలుచోట్ల రెబల్స్‌గా మారిన టీడీపీ నేతలు
- వారిని బుజ్జగించేందుకు శతవిధాలా యత్నిస్తున్న చంద్రబాబు
- ఎంత సర్ది చెప్పినా టికెట్ దక్కించుకున్నవారిని ఓడిస్తామంటున్న అసంతృప్తులు



సాక్షి, అమరావతి/రెడ్డిగూడెం/శ్రీకాకుళం/ద్వారకా తిరుమల/ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అసమ్మతితో అట్టుడుకుతోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మూడు విడతల్లో 138 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పటివరకూ 30కి పైగా నియోజకవర్గాల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఆయా నియోజకవర్గాల్లో సీట్లు దక్కని నేతలు అధినేతపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. వాళ్ల అనుచరులు ఆందోళనలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పలుచోట్ల అసమ్మతి నాయకులు స్వతంత్రంగా బరిలోకి దూకేందుకు వెనుకాడేది లేదని హెచ్చరిస్తున్నారు. వారిని బుజ్జగించేందుకు చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ... సీనియర్ నేతలను వారి వద్దకు పంపుతూ... కొందరితో రాయబారాలు నడుపుతూ... సర్దిచెప్పేందుకు శత విధాలుగా యత్నిస్తున్నారు. కొందరైతే అధినేతను కలిసేందుకు కూడా ఇష్టపడటంలేదు. కాదూకూడదని వెళ్లినవారు ఆయన ముందు పార్టీ కోసం పనిచేస్తామని చెబుతున్నా బయటకు వచ్చాక తమ అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఇవి గాకుండా జనసేన, బీజేపీకి కేటాయించిన 31 స్థానాల్లోనూ అనేక చోట్ల టీడీపీ నేతలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

అభ్యర్థులను ఓడిస్తాం... మా సత్తా చూపిస్తాం...

టికెట్లు దక్కించుకున్నవారిని ఓడించి తమ సత్తా చూపిస్తామని పలువురు నేతలు బాహాటంగానే సవాల్ విసురుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, ఏలూరు జిల్లా నూజివీడులో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్‌గా ప్రచారం ప్రారంభించగా... విజయనగరం జిల్లా గజపతినగరంలో కె.అప్పలనాయుడు, విజయనగరంలో మీసాల గీత, కురుపాంలో వైరిచర్ల వీరేశ్‌దేవ్, శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో కలమట వెంకటరమణ, తునిలో సీనియర్ నేత యనమల రామకృష్ణుడి సోదరుడు కృష్ణుడు తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. చింతలపూడి, తిరువూరు, పెడన, పామర్రు, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు పూర్తి స్థాయి మద్దతు దొరకడంలేదు. కొవ్వూరు సీటు తనకు కేటాయించకపోవడంతో మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వ్యతిరేకంగా పని చేసేందుకు సిద్ధమవుతున్నారు. గోపాలపురం సీటును మద్దిపాటి రాజుకు ఇవ్వడాన్ని అంగీకరించని అక్కడి పార్టీ సీనియర్ నేతలు ముళ్లపాటి బాపిరాజు తదితరులు తమను కాదని టీడీపీ ఎలా గెలుస్తుందో చూస్తామని హెచ్చరిస్తున్నారు. దెందులూరు సీటును చింతమనేని ప్రభాకర్‌కు ఇవ్వడం చలుమోలు అశోక్‌గౌడ్, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, మాగంటి రవళితోపాటు అక్కడి పార్టీ సీనియర్ నేతలకు సుతరామూ ఇష్టం లేదు. వారంతా చింతమనేనికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

దేవినేనిపైనా పెరుగుతున్న అనుమానాలు

ఉమ్మడి కృష్ణా జిల్లా మైలవరం సీటును ఫిరాయింపు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కి ఖరారు చేయడంతో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సహించలేకపోతున్నారు. పార్టీకి కట్టుబడి ఉన్నట్లు పైకి చెబుతున్నా వసంతను ఓడించడమే తన ధ్యేయమని ఆయన అంతర్గతంగా పార్టీ క్యాడర్‌కూ సంకేతాలు ఇస్తున్నారు. అంతేనా... ఆదివారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం గ్రామంలో బల ప్రదర్శన నిర్వహించారు. రెండు రోజుల క్రితం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోనూ బలప్రదర్శన చేపట్టారు. అంటే ఆయన ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం రాత్రి రెడ్డిగూడెం వచ్చిన దేవినేని ఉమా టీడీపీ మండల పార్టీ కార్యాలయం నుంచి రాఘవాపురంలోని పద్దమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో సుమారు 500 మంది పాల్గొన్నారు. టీడీపీ జెండాలు లేకుండానే సాగిన ర్యాలీలో దేవినేని ఉమా నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణకు టికెట్ ఇవ్వడాన్ని కోడెల శివప్రసాద్ తనయుడు శివరాం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నర్సరావుపేటలో కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము తదితరులు అరవింద్‌బాబు అభ్యర్థిత్వాన్ని ఒప్పుకోవడంలేదు. పెదకూరపాడు సీటును పారాచూట్ నేత భాష్యం ప్రవీణ్‌కు కేటాయించడంతో అక్కడి ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ అలకబూని పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తానని చెబుతున్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో బూదాల అజితారావు, మన్నె రవీంద్ర అసమ్మతి స్వరం వినిపిస్తున్నారు.

అభ్యర్థులకు గడ్డు పరిస్థితి

నెల్లూరు జిల్లా ఉదయగిరి స్థానాన్ని ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కి ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, ఆత్మకూరు సీటును ఫిరాయింపు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఇవ్వడాన్ని కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కావలి సీటును బడా కాంట్రాక్టర్ కావ్య కృష్ణారెడ్డికి దక్కడాన్ని మాలేపాటి సుబ్బానాయుడు, బీద రవిచంద్ర వ్యతిరేకిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులకు వ్యతిరేకంగా అసమ్మతి గట్టిగా పనిచేస్తోంది. శ్రీకాళహస్తిలో ఎస్.సి.వి.నాయుడు, సత్యవేడులో జె.డి.రాజశేఖర్ తమను చంద్రబాబు మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం సీటును అక్కడి పార్టీ సీనియర్ నాయకులు ఉమామహేశ్వరనాయుడు, ఉన్నం హనుమంతరాయచౌదరికి కాకుండా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబుకు ఇవ్వడంతో పార్టీ క్యాడర్ అంతా భగ్గుమంటోంది. కదిరిలో అత్తార్ చాంద్‌బాషా తనకు సీటు ఇవ్వలేదని తన అనుచరులతో చంద్రబాబు ఇంటి వద్దే ఆందోళన చేయించారు. చివరికి బాలకృష్ణకూ అసమ్మతి తప్పలేదు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో తిక్కారెడ్డి, నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి, డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి, వైఎస్సార్ జిల్లా రాయచోటిలో రమేష్‌కుమార్‌రెడ్డి అలుక వీడటం లేదు. తంబళ్లపల్లె, అమలాపురం, గుంటూరు వెస్ట్, కోవూరు, ప్రొద్దుటూరు, పుట్టపర్తి నియోజకవర్గాల్లోనూ అసమ్మతి బెడద ఎక్కువగానే ఉంది.

శ్రీకాకుళంలో ఆగని ఆందోళనలు

శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో టికెట్ రాని టీడీపీ నాయకులు అధిష్టానంపై దుమ్మెత్తిపోతున్నారు. శ్రీకాకుళంలో సమావేశం నిర్వహించిన గుండ లక్ష్మీదేవి, అప్పలసూర్యనారాయణ దంపతులు అచ్చెన్నకు తమపై ఎందుకంత కక్ష అని సూటిగా ప్రశ్నించారు. అధిష్టానం తీరు మారకుంటే స్వతంత్రంగా పోటీ చేస్తామని చెప్పారు. అలాగే కొత్తూరు మండలం నివగాం వద్ద అనుచరులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ రాష్ట్ర, జిల్లా పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌లపై పరోక్షంగా విమర్శలు చేశారు. సైట్లు ఇస్తామని చెప్పి కొన్ని వేలమంది నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఒక 420 అయిన మామిడి గోవిందరావుకు ఎమ్మెల్యేగా గెలిపించమంటే ఒప్పుకునేది లేదన్నారు.

మద్దిపాటిపై సీనియర్ల మండిపాటు

తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం స్థానాన్ని గ్రాఫ్ పడిపోయిన మద్దిపాటికి కేటాయించడంపై అక్కడి సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లజర్లలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నాలుగు రోజుల క్రితం నియోజకవర్గంలోని అసమ్మతి నాయకులు సమావేశమై మద్దిపాటి తప్ప వేరెవ్వరైనా తమకు ఓకే అని తేల్చిచెప్పారు. గ్రాఫ్ పడిపోయిన వ్యక్తిని గెలిపించమంటే తమ వల్ల కాదని వారు చేతులెత్తేశారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తానేటి వనితను ప్రకటించారనీ, ఆమెను ఢీకొనాలంటే గట్టి క్యాండిడేట్ అవసరమని తెలిపారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఇదే సందర్భంలో మద్దిపాటి వెంకట్రాజు నాలుగు రోజులుగా చేపట్టిన పాదయాత్రకు ఒక వర్గం నాయకులు, కార్యకర్తలు దూరంగానే ఉన్నారు.

ఏలూరు ఎంపీ సీటుపై వెనక్కి తగ్గని బీజేపీ

ఏలూరు పార్లమెంటు సీటు స్థానిక నేత గారపాటి చౌదరికే ఇవ్వాలని జిల్లా బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఆదివారం చేరుకుని ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కడప నాయకుడికి అక్కడ సీటు కేటాయించడం సరికాదని వారు పట్టుపడుతున్నారు. రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.నిర్మలా కిశోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, వివిధ అసెంబ్లీ కన్వీనర్లు శరణాల మాలతీరాణి, నడపన దాన భాస్కరరావు, నగరపాటి సత్యనారాయణ, గుమ్మడి చైతన్య, యేసు వరప్రసాద్, గాది రాంబాబు, రామకృష్ణ తదితరులున్నారు.

ఏపీలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు వీరే..

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో బీజేపీ పోటీచేసే లోక్‌సభ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం ఆదివారం రాత్రి ప్రకటించింది. తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా బీజేపీకి మొత్తం ఆరు లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ తరఫున లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థుల పేర్లను బీజేపీ వెల్లడించింది.

విజయవాడ ‘పశ్చిమ’కు సుజనాచౌదరి?

మరోవైపు.. అసెంబ్లీకి పోటీచేసే బీజేపీ అభ్యర్థుల పేర్లు కూడా ఖరారైనప్పటికీ వాటిని ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి అనూహ్యంగా కేంద్ర మాజీమంత్రి సుజనాచౌదరి పేరు ఖరారైనట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విశాఖ పశ్చిమ నుంచి విష్ణుకుమార్‌రాజు, ధర్మవరంలో సత్యకుమార్, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి పేర్లు కూడా దాదాపు ఖరారు అయినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పార్లమెంట్ నియోజకవర్గం	అభ్యర్థులు
అరకు	: కొత్తపల్లి గీత
అనకాపల్లి	: సీఎం రమేష్
రాజమహేంద్రవరం	: పురందేశ్వరి
నరసాపురం	: భూపతిరాజు శ్రీనివాసవర్మ
రాజంపేట	: కిరణ్‌కుమార్‌రెడ్డి
తిరుపతి	: వరప్రసాద్

18 స్థానాలకు జనసేన అభ్యర్థుల ఖరారు

అవనిగడ్డ, పాలకొండ, విశాఖ సౌత్ స్థానాలు పెండింగ్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ మరో 11 స్థానాలతో మూడో అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. తొలుత 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. రెండో జాబితాలో మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మూడో జాబితాతో కలిసి మొత్తంగా 18 స్థానాలకు అభ్యర్థులు ఖరారు చేస్తూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనసేన పోటీచేసే మొత్తం 21 స్థానాల్లో ఇంకా అవనిగడ్డ, పాలకొండ, విశాఖ దక్షిణ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఆ పార్టీ పోటీచేసే రెండు లోక్‌సభ స్థానాల్లో కాకినాడకు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని ఇటీవలే ఖరారు చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జనసేన అధికారికంగా ప్రకటించిన అభ్యర్థుల జాబితా..

పిఠాపురం: పవన్‌కల్యాణ్, నెల్లిమర్ల: లోకం మాధవి, అనకాపల్లి: కొణతాల రామకృష్ణ, కాకినాడ రూరల్: పంతం నానాజీ, రాజానగరం: బత్తుల బలరామకృష్ణ, తెనాలి: నాదెండ్ల మనోహర్, నిడదవోలు: కందుల దుర్గేష్, పెందుర్తి: పంచకర్ల రమేష్‌బాబు, యలమంచిలి: సుందరపు విజయ్‌కుమార్, పి.గన్నవరం: గిడ్డి సత్యనారాయణ, రాజోలు: దేవ వరప్రసాద్, తాడేపల్లిగూడెం: బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం: పులపర్తి ఆంజనేయులు, నరసాపురం: బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు: పత్సమట్ల ధర్మరాజు, పోలవరం: చిర్రి బాలరాజు, తిరుపతి: ఆరణి శ్రీనివాసులు, రైల్వేకోడూరు: డాక్టర్ యనమల భాస్కరరావు

‘పార్టీ’ లేదా పుష్పా?...

ఏపీలో బీజేపీకి అభ్యర్థులే కరువైన రీతిలో ఎంపీల లిస్టు
కండువా కప్పుకున్న రోజే వరప్రసాద్‌కు తిరుపతి సీటు
కడప నుంచి అనకాపల్లికి వచ్చి సీఎం రమేశ్ పోటీ
ఈ మధ్యే చేరిన కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజంపేట..
పురందేశ్వరికి రాజమహేంద్రవరం.. కొత్తపల్లి గీతకు అరకు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కుల బంధంతోనే బాబుకు జేపీ భజన

మేధావి ముసుగులో కుల కుటిలత్వం

- చంద్రబాబు కోసమే జేపీ అసత్య ప్రచారం
- కూటమికి ఆయన వంత పాడటం దారుణం
- రంగాను చంపించిన వ్యక్తులతో కాపులు వెళ్లొద్దు
- ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి: మేధావి ముసుగులో జయప్రకాశ్ నారాయణ్ కుల కుటిలతత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఏపీ చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మండిపడ్డారు. ఐదేళ్లు అధికారం ఇస్తే చంద్రబాబు ఏపీని సర్వనాశనం చేశారన్నారు. ఈ నిజం తెలిసినా.. అంగీకరించేందుకు జేపీకి కుల బంధం అడ్డొస్తోందని.. అందుకే ఆయన బాబుకు భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇదంతా ఎన్నికల ముందు జేపీతో చంద్రబాబు ఆడిస్తున్న డ్రామాగా అభివర్ణించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. మేధావి ముసుగు వేసుకున్న జేపీని ప్రజలు నమ్మొద్దు. తన కులానికి చెందిన వ్యక్తి కాబట్టి చంద్రబాబుకు జేపీ మద్దతిస్తున్నారు. అవినీతి చక్రవర్తి చంద్రబాబు పాలనలో టీడీపీ అందినకాడికి దోచుకుతింది. మళ్లీ చంద్రబాబుకు అధికారమిస్తే రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేస్తారు. బాబు మోసాలను గమనించే గత ఎన్నికల్లో ప్రజలు చావుదెబ్బ కొట్టారు. ఇప్పుడు సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ ఆంధ్రప్రదేశ్ ముందుకెళ్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా జేపీ వ్యాఖ్యానించడం సిగ్గుచేటు.

ఏది విజనరీ జేపీ?

చంద్రబాబు దొంగైనా, వెన్నుపోటుదారుడైనా అందులోనూ జేపీకి విజన్ కనిపించడం గొప్ప విషయం. 2014–19లో టీడీపీ, జనసేన, బీజేపీ మూడూ కలిసి పొత్తులతో అధికారంలోకి వచ్చాయి. చంద్రబాబు 600 హామీలు ఇచ్చి.. ఐదేళ్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్న విషయం జేపీకి తెలిసి కూడా మరోసారి కూటమికి వంతపాడటం దారుణం. ప్రజలంతా దీన్ని గమనించారు కాబట్టే 2019 ఎన్నికల్లో 151 సీట్లు జగన్‌కు ఇచ్చి.. 23 సీట్లకు టీడీపీని తొక్కేశారు. చంద్రబాబులో విజన్ ఉంటే ప్రజలెందుకు ఓడిస్తారు? ప్రధానిని నోటికొచ్చినట్లు మాట్లాడి.. ఇప్పుడు కీర్తించే వ్యక్తి మీ దృష్టిలో విజనరీ. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవటం.. సొంత మామను చెప్పుతో కొట్టి కుర్చీ నుంచి కిందకి నెట్టేయడం.. రామారావు చనిపోతుంటే చంద్రబాబు సీఎం సీటులో పైశాచికానందం పొందడం.. హరికృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరావును వాడుకుని వదిలేడం.. ఇవన్నీ విజనరీనే. మీరు చెప్పిన విజనరీ అధికారం వచ్చిన ప్రతిసారీ ప్రజలను పట్టి పీడించాడు. ఇవన్నీ తెలిసినా.. అనర్హుడైనప్పటికీ సొంత కులం వ్యక్తిని సీఎం సీటులో కూర్చోపెట్టడానికి దిగజారొద్దు జేపీ.



అందరినీ నీచంగా తిట్టిన వ్యక్తి బాబు..

2014–19 వరకు చంద్రబాబు అండ్ కో పందికొక్కులా ప్రజాధనాన్ని మింగేసిన పాపాలు ఇప్పట్లో పోవు. ఎస్సీ, ఎస్టీ, బీసీ.. ఇలా ఒకటేమిటి మనిషన్న ప్రతి ఒక్కరినీ నీచంగా తిట్టిన వ్యక్తి చంద్రబాబు. ఇక వంగవీటి రంగాను అన్యాయంగా చంపించిన వ్యక్తితో కాపులు వెళ్లొద్దు. సీఎం జగన్ బటన్‌నొక్కితే పేదల ఖాతాల్లో డబ్బులు పడతాయి.. అదే చంద్రబాబు బటన్ నొక్కితే సామాన్యుల ప్రాణాలు బలైపోతాయి. దేశంలోనే బెస్ట్ సీఎం అయిన జగన్ పేదల కోసం నిలబడ్డారు. ఏపీ ప్రజలు చంద్రబాబు వంటి దుర్మార్గుడికి ఓటు వేయొద్దు.

కాపులకు వైఎస్సార్‌సీపీ సీట్ల కేటాయింపు అద్భుతం

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని కాపు సామాజిక వర్గానికి సీట్ల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం చారిత్రక అంశంగా జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి పేర్కొన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ఇంత పెద్ద సంఖ్యలో కాపులకు సీట్లు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. అసెంబ్లీకి సంబంధించి 30 సీట్లు కేటాయించడం అపూర్వమని, లోక్‌సభకు ఐదు సీట్లు కేటాయించడం అద్భుతమన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో కాపులను గుర్తించి చట్టసభలకు పంపేందుకు సీఎం వైఎస్ జగన్ చొరవ చూపడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, నాయకులు మాటలకు మాత్రమే పరిమితమై కాపులను వాడుకుంటున్నారన్నారు. కానీ సీఎం జగన్ మాత్రం కాపులను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసే దిశగా చర్యలు చేపట్టడం కాపు జాతి తప్పనిసరిగా గుర్తుంచుకుని, వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సి బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

ఆ బాక్సుల నిండా ఫైళ్లు!

- అనుమానాస్పదంగా ‘సంధ్య’ బస్సు
- పోలీసుల తనిఖీ.. అట్టపెట్టెలుగా నిర్ధారణ
- సీబీఐ అధికారులకు నివేదిస్తామన్న పోలీసులు

పిఠాపురం: మూడు రోజులుగా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కొత్త మూలపేట ఎస్ఈజెడ్ కాలనీలో నిలిపి వేసిన సంధ్యా ఆక్వా కంపెనీకి చెందిన బస్సు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం పోలీసులు అక్కడకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు సంధ్యా ఆక్వా కంపెనీ ప్రతినిధులను విచారించగా బస్సు బ్రేక్ డౌన్ కావడంతో అక్కడ నిలిపి ఉంచినట్లు చెప్పారు. బస్సులోని అట్ట పెట్టెల్లో పలు ఫైళ్ల కట్టలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని, ఈ అంశాన్ని దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులకు తెలియచేస్తామని ఎస్సై తెలిపారు. తనిఖీల అనంతరం బస్సును ఆక్వా కంపెనీలోకి తరలించారు.



బస్సులో అట్ట పెట్టెల్లో ఉన్న ఫైళ్లు

వరంగల్‌కు అరూరి.. ఖమ్మం తాండ్ర వినోద్

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఖరారు చేసింది. 17 స్థానాల్లో మూడు ఎస్సీ, రెండు ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలను మినహాయిస్తే మిగతా 12 స్థానాల్లో ఐదు బీసీ, నాలుగు రెడ్డి, రెండు వెలమ, ఒక బ్రాహ్మణ అభ్యర్థులకు అవకాశం ఇచ్చింది. అయితే ఎస్సీలకు సంబంధించిన మూడు రిజర్వ్‌డ్ స్థానాలను మాదిగ సామాజికవర్గానికి కేటాయించడం ద్వారా మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణకు తాము కట్టుబడి ఉన్నామని బీజేపీ తెలిపింది.

అయా లోక్‌సభ సెగ్మెంట్‌లో పోటీ చేసే బీజేపీ అభ్యర్థులు వీరే....

ఆదిలాబాద్: గోడం నగేష్(ఎస్టీ గోండు), **పెద్దపల్లి:** గోమాస శ్రీనివాస్(ఎస్సీ మాదిగ), **కరీంనగర్:** బండి సంజయ్ కుమార్ (మున్నూరు కాపు), **నిజామాబాద్:** ధర్మపురి అర్వింద్(మున్నూరు కాపు), **జహీరాబాద్:** బీబీ పాటిల్(లింగాయత్), **మెదక్ :** రఘునందన్‌రావు(వెలమ), **మల్కాజ్‌గిరి:** ఈటల రాజేందర్(ముదిరాజ్), **సికింద్రాబాద్:** జి.కిషన్‌రెడ్డి(రెడ్డి), **హైదరాబాద్:** మాధవీలత(బ్రాహ్మణ), **చేవెళ్ల:** విశ్వేశ్వర్ రెడ్డి(రెడ్డి), **మహబూబ్‌నగర్:** డీకే అరుణ(రెడ్డి), **నాగర్‌కర్నూల్:** పి.భరత్(ఎస్సీ మాదిగ), **నల్గొండ:** సైదిరెడ్డి(రెడ్డి), **భువనగిరి:** బూర నర్సయ్యగౌడ్(గౌడ్), **వరంగల్:** అరూరి రమేశ్(ఎస్సీ మాదిగ), **మహబూబాబాద్:** సీతారాం నాయక్(ఎస్టీ లంబాడా), **ఖమ్మం:** తాండ్ర వినోద్ రావు(వెలమ)



అన్ని గొప్ప ఆలోచనలూ నడుస్తున్నప్పుడు పురుడు పోసుకుంటాయి.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 25 మార్చి 2024

సంగీతంలో అపశ్రుతి

సంగీతంలో సప్తస్వరాలు ఉన్నాయి. పశుపక్ష్యాదుల ధ్వనుల నుంచి ఇవి పుట్టినట్లు ప్రతీతి. శ్రుతి లయలు స్వరాల గమనానికి దిశానిర్దేశం చేసి, సంగీతాన్ని మనోరంజకం చేస్తాయి. సంగీతానికి ఆధారభూతమైన సప్తస్వరాలైనా, శ్రుతిలయాదులైనా– అన్నీ ప్రకృతి నుంచి పుట్టినవే!

ప్రకృతికి కులమతాలు లేవు. ప్రకృతి నుంచి పుట్టిన సంగీతానికి కూడా కులమతాలు లేవు, సరిహద్దులు లేవు. చక్కని సంగీతానికి శ్రావ్యతే గీటురాయి. సంగీత కళను శాస్త్రబద్ధం చేసిన తొలి రోజుల్లో సంగీతానికి సంబంధించిన శాస్త్రీయ సంప్రదాయాలు కొన్ని ఏర్పడ్డాయి. తర్వాతి తరాలలో కొందరు సంగీత విద్వాంసులు పూర్వసంప్రదాయాలను, చాదస్తాలను తోసిపుచ్చి, తమదైన సృజనతో కొత్త ఒరవడికి నాంది పలికారు.

తొలినాళ్లలో ఏకరీతిలో ఉన్న భారతీయ సంగీతంలో పద్నాలుగో శతాబ్దం నాటికి విభజన ఏర్పడింది. భారతీయ సంగీతంలో హిందుస్తానీ సంగీతం, కర్ణాటక సంగీతం ప్రధాన శాఖలుగా ఏర్పడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా సంగీతంలో ఎన్ని శాఖలు ఉన్నా, అవన్నీ శైలీభేదాల వల్ల ఏర్పడినవి మాత్రమే! కర్ణాటక సంగీతానికి పురందరదాసు పితామహుడిగా పేరుగాంచారు. ఆయన తర్వాతి కాలంలో త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి 'కర్ణాటక సంగీత త్రిమూర్తులు'గా పేరుపొందారు. వీరందరూ ఎవరి స్థాయిలో వారు ప్రయోగాలు చేసిన వారే గాని, పూర్వ శాస్త్రగ్రంథాల్లోని పాఠాలకు కట్టుబడి, వాటినే తు.చ. తప్పకుండా వల్లెవేసిన వారు కాదు. వారంతా మడిగట్టుకుని పూర్వగ్రంథాల్లోని పద్ధతులకే పరిమితమై ఉన్నట్లయితే, ఈనాడు కర్ణాటక సంగీతం ఇంతటి ఉత్కృష్ట స్థాయికి చేరుకునేదే కాదు.

ముత్తుస్వామి దీక్షితార్ సాహసోపేతమైన ప్రయోగాలే చేశారు. ఈస్టిండియా కంపెనీ అధికారి కర్నల్ జేమ్స్ బ్రౌన్ ప్రోత్సాహంతో ఇంగ్లిష్ సంగీత బాణీలకు సంస్కృత రచనలు చేశారు. ఈస్టిండియా కంపెనీ బ్యాండ్ ఆర్కెస్ట్రాలో ఉపయోగించే వయొలిన్‌ను చూసి ముచ్చటపడి కర్ణాటక సంగీత కచేరీల్లోకి తీసుకువచ్చారు. ముత్తుస్వామి సోదరుడు బాలుస్వామి తొలిసారిగా కర్ణాటక సంగీత కచేరీలో వయొలిన్ వాయించారు. పాశ్చాత్య శైలిలో 'నోటు స్వరాలు' కూర్చి సంప్రదాయ కచేరీల్లో వినిపించడం ప్రారంభించారు. ముత్తుస్వామి దీక్షితార్ చేసిన ప్రయోగాలు ఆనాటి సంప్రదాయవాదులకు మింగుడుపడనివే! చాదస్తపు విమర్శలకు భయపడి ముత్తుస్వామి తన ప్రయోగాలను విరమించుకున్నట్లయితే, ఆయన అనామకంగానే కాలగర్భంలో కలిసిపోయేవారు.

ముత్తుస్వామి దీక్షితార్ తర్వాతికాలంలో కూడా కొందరు విద్వాంసులు క్లారినెట్, శాక్సాఫోన్, మాండొలిన్, గిటార్, వయోలా, పియానో వంటి పాశ్చాత్య వాద్యపరికరాలను కర్ణాటక సంగీత కచేరీలకు పరిచయం చేశారు. త్యాగరాజు కాలం నాటికి అప్పటి తంజావూరు సంస్థానంలో పాశ్చాత్య సంగీతానికి కూడా సమాదరణ ఉండేది. త్యాగరాజు రాజాశ్రయానికి దూరంగా తన సంగీత సాధన కొనసాగించినా, ఆయనపైనా పాశ్చాత్య సంగీత ప్రభావం లేకపోలేదు. త్యాగరాజు ఏటా వేసవిలో ఎక్కువగా తిరువయ్యూరులో గడిపేవారు. అక్కడ ఉన్నప్పుడే ఆయన పాశ్చాత్య సంగీతాన్ని ఆస్వాదించారు. త్యాగరాజు ఆ తర్వాతి కాలంలో శంకరాభరణ రాగంలో కూర్చిన 'వరలీలా గానలోలా', 'సారస నేత్ర', సుపోషిణి రాగంలో కూర్చిన 'రమించు వారెవరురా' వంటి కొద్ది కీర్తనల్లో పాశ్చాత్య సంగీత ధోరణులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ప్రయోగాలు లేకుండా ఏ కళా, ఏ శాస్త్రమూ అభివృద్ధి చెందదు. మన కాలానికి చెందిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ కూడా కర్ణాటక సంగీతంలో ఎన్నో ప్రయోగాలు చేసి శ్రోతలను మెప్పించారు. సంగీత సంప్రదాయం ప్రకారం ఆరోహణ అవరోహణలలో ఒక రాగానికి కనీసం ఐదేసి స్వరాలు ఉండాలి. ఆరోహణ అవరోహణలలో ఐదు కంటే తక్కువ స్వరాలను ఉపయోగించి ఆయన కొత్త రాగాలను సృష్టించారు.

నేటితరంలో టి.ఎం.కృష్ణ తనదైన శైలిలో సంగీతంలో ప్రయోగాలను కొనసాగిస్తున్నారు. సంప్రదాయ కచేరీ నమూనాలోనే మార్పులను తీసుకొచ్చారు. వర్ణాలు, కృతులు, తిల్లానాలు వంటి వాటితోనే సాగే కర్ణాటక సంగీత కచేరీల్లో టి.ఎం.కృష్ణ క్రైస్తవ గీతాలను, ఇస్లాం గీతాలను, తమిళ కవుల గేయాలను కూడా పాడటం ద్వారా కొత్త ఒరవడికి నాంది పలికారు. కచేరీల్లో టి.ఎం. కృష్ణ ఈ మార్పులను తెచ్చినప్పటి నుంచి మతతత్త్వవాదులు ఆయనపై విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. టి.ఎం.కృష్ణ సంగీత రంగానికి మాత్రమే పరిమితం కాకుండా; దేశంలోని సామాజిక పరిణామాలపై ఎప్పటికప్పుడు స్పందించే తీరు, దళితవాడలకు వెళ్లి కచేరీలు చేస్తూ సంగీతాన్ని సామాన్యుల చెంతకు చేరుస్తున్న పద్ధతి కూడా వారికి కంటగింపుగా మారింది. ఇదివరకు టి.ఎం. కృష్ణకు రామన్ మెగసెసె అవార్డు వచ్చినప్పుడు రుసరుసలు వినిపించాయి. ఇటీవల ఆయనకు మ్యూజిక్ అకాడమీ 'సంగీత కళానిధి' అవార్డును ప్రకటించింది. దీనికి నిరసనగా గాయనీమణులు రంజని, గాయత్రి మ్యూజిక్ అకాడమీలో ఈసారి కచేరీ చేయబోమంటూ, అకాడమీ అధ్యక్షుడికి లేఖ రాశారు. మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు ఎన్. మురళి ఆ లేఖకు ఇచ్చిన సమాధానంలో వారి తీరును తప్పుపట్టారు. టి.ఎం.కృష్ణపై అక్కసు వెళ్లగక్కుతున్న వారంతా ఆయన సంగీత సామర్థ్యాన్ని గురించి మాట్లాడకుండా, ఆయన సంప్రదాయాన్ని మంటగలిపేస్తున్నాడంటూ గగ్గోలు పెడుతుండటం గమనార్హం. రంజని, గాయత్రి వంటి వారి తీరు సంగీత ప్రపంచంలో ఒక అపశ్రుతి. అయితే, సంగీతం ఒక స్వరవాహిని. ఇలాంటి అపశ్రుతులను సవరించుకుంటూ తన ప్రవాహాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది.

ఇప్పుడు అవసరం ఏముంది?

కామెంట్



కరణ్ థాపర్

ఒడిశాలో ఎన్నికల స్నేహానికి బీజేపీ, బీజేడీ సిద్ధమవుతున్నాయా? పొత్తు కుదరలేదని తాజా వార్త. కాదు... కుదరవచ్చని ఊహాగానం. ఇప్పటికింకా పూర్తి స్పష్టత లేదు. దోస్తీ మాట నిజమే అయితే, ఒక ప్రశ్న ఉదయిస్తుంది! "అసలు ఈ రెండు పార్టీలూ కలవాల్సిన అవసరం ఏముంది?" రాష్ట్రంలో సర్కార్ ఏర్పాటుకై బీజేడీకి బీజేపీ అవసరం లేదు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపీకి బీజేడీ అవసరం లేదు. మరి ఏ ప్రయోజనాలు ఆశించి మోదీ, పట్నాయక్‌లు స్నేహహస్తాలు చాస్తున్నారు. 2008 నాటి క్రైస్తవుల హత్యోదంతాల అనంతరం 2009లో బీజేపీతో తెగతెంపులు చేసుకున్న పట్నాయక్... పదిహేనేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఎందుకు ఆ పార్టీతో నెయ్యానికి చర్చలు జరిపారు? అడగవలసిన ప్రశ్నలెన్నో ఉన్నాయి!

గతాన్ని గుర్తు చేయటం రాజకీయ నాయకులకు ఇష్టం ఉండదు. అది వారికి "ఒక పరదేశం". ఎల్.పి.హార్ట్‌లీ చెప్పిన విధంగా, "వారు అక్కడ పనులను భిన్నంగా చేస్తారు". సరిగ్గా అలానే చేసే ఉద్దేశంతో నేనివాళ ఉన్నాను. భారతీయ జనతా పార్టీతో నవీన్ పట్నాయక్ కొత్తగా పొత్తు కుదుర్చుకోవాలని చూస్తున్నట్టు వినగానే పదిహేను సంవత్సరాల క్రితం ఆయన చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకోవాలని నాకు అనిపించింది. వాటిని మీకు గుర్తు చేసి, మీ సొంతంగా ఒక అభిప్రాయానికి వచ్చేందుకు మిమ్మల్ని వదిలేస్తాను.

2008లో కొంధమాల్‌లో జరిగిన క్రైస్తవుల దారుణ హత్యోదంతాల అనంతరం నేను నవీన్ పట్నాయక్‌ను ఇంటర్వ్యూ చేశాను. ఆ హత్యలు దేశాన్ని కుదిపి వేయటమే కాకుండా, పట్నాయక్ ప్రతిష్ఠను పదేపదే దెబ్బతీశాయి. తేరుకోవటానికి ఆయన తలకిందులుగా తపస్సు చేయవలసి వచ్చింది. "నా దేహంలోని ప్రతి అస్థికా మతంతో సంబంధం లేనిది. ఆ అస్థికల్లో ఏవైనా దెబ్బతిని ఉంటాయని నేను అనుకోను" – అని, లౌకికవాదిగా తనకై తను ఆయన ఒక ఉనికిని ఇచ్చుకున్నారు.

ఆరు నెలల తర్వాత, 2009 సార్వత్రిక ఎన్నికలకు ముందు, బీజేపీతో తనకున్న తొమ్మిదేళ్ల పొత్తును విచ్ఛిన్నం చేసుకున్నారు. అప్పుడు మళ్లీ నేను ఆయన్ని ఇంటర్వ్యూ చేశాను.

పట్నాయక్: "బీజేపీతో తెగతెంపులు చేసుకోవటం తప్పనిసరి అయింది. ఎందుకంటే, నా రాష్ట్రానికి వారినిక ఏమాత్రంగానైనా ఆరోగ్యకరమని నేను పరిగణించటం లేదు. కొంధమాల్ తర్వాత అది ప్రతి ఒక్కరికీ స్పష్టమై ఉంటుందని అనుకుంటున్నాను."

థాపర్: "కొంధమాల్ తర్వాత ఎలాంటి పరిస్థితుల్లోనూ బీజేపీతో కొనసాగలేమని మీరు చెబుతున్నారా?"

పట్నాయక్ : "కొనసాగటం చాలా చాలా కష్టంగా మారింది."

థాపర్: "అంటే కొంధమాల్ ఒక విధంగా మీ పొత్తు విచ్ఛిత్తికి కారణం అయిందనేనా?"

పట్నాయక్ : "నిజానికి, అంతే."

(ఈ సంభాషణ మరింతగా ముందుకు సాగింది. చెప్పాలంటే, అలా జరగాలన్న ఆసక్తి ఆయనలో కనిపించింది.)

థాపర్: కొంధమాల్ ఘటనలతో పట్టణ ప్రాంత మధ్య తరగతి ప్రజలు మిమ్మల్ని నరేంద్ర మోదీతో పోల్చడం ప్రారంభించారు. కొంతమంది మిమ్మల్ని రెండవ నరేంద్ర మోదీ అని కూడా అన్నారు. అది మిమ్మల్ని కలవరపరిచిందా? నొప్పించింది కూడానా?"



ప్రధాని నరేంద్ర మోదీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ (ఫైల్ ఫొటో)

పట్నాయక్: "నన్ను నేను ఎప్పుడూ కూడా వ్యక్తిగతంగా అలా చూసుకోలేదు. నేను ఎల్లవేళలా లౌకికవాద ధోరణిలోనే ఆలోచిస్తాను. నాది పూర్తిగా లౌకికవాద నేపథ్యం. కనుక నేను దానిని నాపై వచ్చిన సరైన ఆరోపణగా ఏనాడూ పరిగణించలేదు."

థాపర్: "దానర్థం... నరేంద్ర మోదీతో పోల్చడం మిమ్మల్ని బాగా గాయపరచేదిగా ఉండి ఉండాలి."

పట్నాయక్: "నా మీద అలాంటి ఆరోపణ వస్తుందని నేను అస్సలు నమ్మలేకపోయాను."

(కొంధమాల్ తర్వాత పట్నాయక్ బీజేపీని ఎలా చూశారన్నది స్పష్టం అయింది. అయితే ఆయన చెప్పాలనుకున్నది ఇంకా ఉండింది. అక్కడితో ముగించలేదు.)

థాపర్: "కొంధమాల్ తర్వాత నేను మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసినప్పుడు మీ శరీరంలోని ప్రతి అస్థికా మత రహితమైనదేనని మీరు చెప్పారు. అది నిజమేనని... మీరిప్పుడు బీజేపీతో తెగతెంపులు చేసుకోవటమన్నది రుజువు చేస్తోందని మీరు చెప్పగలరా?"

పట్నాయక్: "మీరేమనుకుంటున్నారు కరణ్? నేనేమిటో మీకు ఎప్పటి నుండో తెలుసు."

థాపర్: "అది నిజమేనని రుజువు చేస్తోందని నేను చెప్పగలను."

పట్నాయక్: "థ్యాంక్యూ."

(మరొక ప్రశ్న అడగవలసిన అవసరం ఉందని నా ప్రవృత్తి చెప్పింది. అది ఆయనపై ముష్టిఘాతాన్ని విసిరింది.)

థాపర్: "ఆ పని (బీజేపీతో తెగతెంపులు) మీరు మనస్ఫూర్తిగా చేసినదే కదా?"

పట్నాయక్: "చివరికొచ్చేటప్పటికి ఎవరి నమ్మకాలపై వారు నిలబడతారు. కాదా చెప్పండి? ఎవరి నమ్మకాలపై వారు నిలబడి తీరాలి కూడా."

(అయిపోయింది – స్పష్టంగా, క్లుప్తంగా, నిశ్చయంగా పట్నాయక్ తనేమిటో చెప్పేశారు. ఆయన నమ్మకాలు తమను తాము పునరుద్ఘాటించుకున్నాయి. పాత పట్నాయక్ ప్రత్యక్షమయ్యారు. బీజేపీతో జతపడి ఉండటం అన్నదిక చరిత్రే.)

థాపర్: "తను నమ్మిన సిద్ధాంతాలపై నిలబడేందుకు నవీన్ పట్నాయక్‌కు తొమ్మిదేళ్లు పట్టిందని చాలామంది అంటారు. మిమ్మల్ని బాగా ఎరిగిన వారికి మీరు లౌకికవాదులు, ఉదారవాదులు, నవీనులు. నిజంగా మీరు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారంటే, ఆ పొత్తు దీర్ఘకాలం సాగిందంటే వారికి ఆశ్చర్యంగా ఉంటుంది. మీ నమ్మికలు ఏమిటో మీరు కనుగొనడానికి ఎందుకు మీకంత ఎక్కువ సమయం పట్టింది?"

పట్నాయక్: "గత పన్నెండేళ్లలో బీజేపీకి అనేక లౌకికవాద పక్షాల పొత్తు ఉండటం మీరు చూసే ఉంటారు. మమతా బెనర్జీ లేదా హెగ్డే లేదా ఫరూఖ్ అబ్దుల్లా, చివరికి జార్జిఫెర్నాండెజ్, నితీశ్‌కుమార్. అనేక మిత్ర పక్షాలూ ఉండేవి. అంతేకాదు, ఒడిశాలో మన అదృష్టవశాత్తూ మొదటి ఎనిమిదేళ్లలో ఎలాంటి మతపరమైన సంఘటనలూ జరగలేదు. కొంధమాల్ జరగనంత వరకు మొత్తంగా పరిస్థితే మారలేదు."

ప్రస్తుతం ఒకే ఒక ప్రశ్న మిగిలింది. పరిస్థితి ఏం మారింది? బీజేపీతో తెగతెంపులు చేసుకుని, ఆ తర్వాత బాగా పని చేసిన పట్నాయక్ తిరిగి ఇప్పుడు వారి ఆలింగనం కోసం ఎందుకు వెనక్కు నడవాలని తపిస్తున్నారు? వారి అవసరం లేకుండానే ఆయన మళ్లీ గెలుస్తారు కదా!

అయితే విషయం అది కాదు. ఆయన తెగతెంపులు చేసుకున్న బీజేపీ ఎల్.కె. అద్వానీ నేతృత్వం లోనిది. ఆయనిప్పుడు తిరిగి వెళ్లాలని చూస్తున్నది నరేంద్ర మోదీ సారథ్యం లోనిది. నేను మరింతగా చెప్పాల్సిన అవసరం ఉందంటారా?

పట్నాయక్ మళ్లీ బీజేపీతో ఎందుకు పొత్తు కుదుర్చుకోవాలని అనుకున్నారో నాకెప్పటికైనా తెలుస్తుందా అని నా సందేహం. కానీ తను యూ–టర్న్ తీసుకోవటాన్ని ఆయన ఎలా సమర్థించుకుంటారో తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు ఉంది. ఈలోగా మీదైన అభిప్రాయాలకు మీరు వచ్చేందుకు మిమ్మల్ని వదిలేస్తాను. బహుశా మీలో కొందరు... మీరూ నాలాగే ఊహించారని భావించే అవకాశం ఉంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సరైన విధానం



మాస్కో మీద తీవ్రవాద దాడికి పాల్పడిన వాళ్లనే కాదు, ఆ దాడికి నిధులు సమకూర్చినవాళ్లను కూడా శిక్షిస్తామని రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ఇది నూటికి నూరు శాతం సరైన విధానం.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

మరీ ఇక్కడుంటామా?



ప్రజాస్వామిక సూచీలో ఇండియా ర్యాంక్ 104. సైనిక పాలన ఉండి, అధ్యక్షుడిని హౌజ్ అరెస్ట్ చేసిన నైజర్ కంటే ఇది తక్కువ ర్యాంకు. సంతోష సూచీలో ఇండియా ర్యాంక్ 126. ఆర్థికంగా దివాళా తీసిన పాకిస్తాన్, సైనిక తిరుగుబాటు జరిగిన మయన్మార్ కంటే తక్కువ. పత్రికా స్వేచ్ఛలో ఇండియా ర్యాంకు 161. తాలిబన్ల అఫ్గానిస్తాన్‌ది 152. అందుకే మనకు సొంత రేటింగ్ వ్యవస్థలు కావాలి.

– పాల్కీ శర్మ, జర్నలిస్ట్

మళ్లీ వెనక్కి...



ముస్తఫా కెమాల్ (టర్కీ మొదటి అధ్యక్షుడు), నెహ్రూ(భారత తొలి ప్రధాని) తమ కాలానికంటే ముందున్నారు. మార్చడం సాధ్యంకాని జనాలను కూడా తమ మధ్యయుగం నాటి మైండ్‌సెట్ల నుంచి బయటపడేలా చేశారు. కానీ వారి తర్వాత వచ్చిన పాలకులు దాన్ని తిరగదిప్పారు. ఎంత విషాదం!

– డానిష్ ఖాన్, బయోకెమిస్ట్

మంచి అడుగు



అన్ని మదరసాలనూ మూసేసి, ప్రస్తుత విద్యార్థులను అధికారిక విద్యా వ్యవస్థలో కలపాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రయాగరాజ్ హైకోర్టు ఆదేశించింది. ఇది స్వాగతించాల్సిన అడుగు. ముస్లిం సమాజం ఇప్పుడు శాస్త్రీయ విద్య ద్వారా పురోగతి సాధిస్తుంది.

– ఒమర్ ఘాజీ, రచయిత

అందుకే విమర్శ



హమాస్ కంటే ఎక్కువగా నేను (ఇజ్రాయెల్ ప్రధాని) నెతన్యాహూ, ఆయన ప్రభుత్వాన్ని ఎందుకు ఎక్కువగా విమర్శిస్తాను? ఎందుకంటే ఆయన ఒక రకంగా 'నా వాడు'! వాళ్లు కాదు!! మనది అనుకున్నది ఎక్కువగా బాధిస్తుంది. కోపం తెప్పిస్తుంది. దాని పట్ల మనకు ఎక్కువ బాధ్యత ఉంటుంది.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

రెండు నిజాలు



ఒక స్నేహితుడి నుంచి ఫోనొచ్చింది. గత దశాబ్దంలో ఇండియా నిజంగానే అభివృద్ధి చెందిందని అతడి నమ్మకం. అదే సమయంలో ఇక్కడ భవిష్యత్తు లేదు కాబట్టి తన పిల్లల్ని విదేశాలకు పంపాలనుకుంటున్నాడు.

– ఎ. సిద్ధు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

క్షయ వ్యాధిని అంతం చేద్దాం!

క్షయ వేలాది సంవత్సరాలుగా మానవాళికి పెద్ద బెడదగా వుంది. ఈ పీడ మానవ చరిత్ర మొత్తంలో దాదాపు 100 కోట్ల మంది ప్రాణాలను తీసిందని ఒక అంచనా. క్షయ జబ్బు ఒక్కటే, మిగిలిన అన్ని రకాల అంటువ్యాధులూ కలిసి తీసుకునే మొత్తం ప్రాణాల కంటే ఎక్కువ ప్రాణాలను హరించింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 1 కోటీ ఆరు లక్షల మంది ఈ జబ్బుతో బాధపడ్డారు. ప్రపంచంలోని నాలుగింట ఒక వంతు అంటే, 200 కోట్ల మందికి ఈ వ్యాధిని కలుగచేసే మైకోబ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ క్రిమి సోకినట్లు అంచనా. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయే పోషకాహార లోపం, డయాబెటిస్, హెచ్‌ఐవీ, వృద్ధాప్యం, డయాలసిస్, స్మోకింగ్, దీర్ఘవ్యాధులు, అవయవాల ట్రాన్స్ ప్లాంటేషన్, కొన్ని జబ్బుల చికిత్సకు వాడే స్టెరాయిడ్స్, కేన్సర్ తదితర కారణాల వల్ల క్షయ జబ్బు బారిన పడతారు. క్షయకు మందులు అందుబాటులోకి రాకముందే, 19వ శతాబ్దం నుండి పారిశ్రామికీకరణ జరుగుతూ ఉన్న అమెరికా, యూరప్ దేశాల్లో ఈ వ్యాధి తగ్గుముఖం పట్టింది. దీంతో మందుల కన్నా జీవన ప్రమాణాల మెరుగుదలతో ఈ వ్యాధిని అదుపు చేయగల మని గుర్తించారు. పేదరికం వల్ల సరైన గాలి, వెలుతురు లేని గదుల్లో ఎక్కువమంది నివసించాల్సి రావడం వంటి కారణాలతో క్షయ వ్యాధిగ్రస్థుల నుండి ఈ క్రిమి వేరొకరికి తేలికగా సోకుతుంది.

ఈ వ్యాధి శరీరంలోని ఏ భాగానికైనా సోకవచ్చు. ఊపిరితిత్తుల పొర (ప్లూరా), లింఫ్ నోడ్స్, ప్రేవులు, స్వర పేటిక (లారింక్స్), ఎముకలు, వెన్నెముక, మెదడు, చర్మం, ప్రత్యుత్పత్తి వ్యవస్థ మొదలైన వాటిలో దేనికైనా ఇది సోకే అవకాశముంది. దాదాపు 80 శాతం మేరకు రోగులలో ఈ వ్యాధి ఊపిరితిత్తులలో తలెత్తుతుంది. క్షయ వ్యాధిలోని అనేక రకాలలో ఊపిరితిత్తుల క్షయ, లారింజియల్ క్షయ మాత్రమే గాలి ద్వారా వ్యాప్తి చెందగలవు. ఊపిరితిత్తులలో కాకుండా వేరే చోట తలెత్తే క్షయ వ్యాధిని 'ఎక్స్‌ట్రా పల్మనరీ టీబీ'గా పిలుస్తారు. టీబీ వైద్యం ప్రారంభించిన ఒకటి రెండు వారాలలోనే ఈ క్రిమి ఇతరులకు సంక్రమించే అవకాశం తగ్గుతుంది. అనగా పేషెంట్స్ నాన్ ఇన్ఫెక్షస్‌గా మారతారు. లేటెంట్ టీబీ ఉన్న వారి నుండి ఈ క్రిమి ఇతరులకు సంక్రమించదు. కేవలం జబ్బుతో బాధపడుతున్న వారి నుండి మాత్రమే ఇతరులకు సంక్రమించ గలదు. హెచ్‌ఐవీ మూలంగా ప్రపంచ వ్యాప్తంగా క్షయ పరిస్థితులు విషమిస్తున్నాయి. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో 27 శాతం మంది క్షయ జబ్బుతోనే మరణిస్తున్నారు.

చాలా సందర్భాలలో టీబీ వ్యాధి నిర్ధారణ ఆలస్యం అవుతుంది. పేషెంట్స్‌లో సరైన అవగాహన లేక జ్వరం, దగ్గులకు దీర్ఘకాలం పాటు రకరకాల యాంటీబయాటిక్స్ వాడతారు. ఇంకా ఫార్మసీలలో దొరికే జ్వరం మాత్రలు, దగ్గు సిరప్‌లను వాడుతూ వైద్యులను కలవడానికి జాగు చేస్తారు. దాంతో క్షయ జబ్బుకు సకాలంలో వైద్యం అందక ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ఎక్స్‌ట్రా పల్మనరీ క్షయలో జబ్బు నిర్ధారణ మరింత క్లిష్టతరం అవుతుంది. క్షయ కారక క్రిమి ప్రత్యేక లక్షణాల రీత్యా 6 నెలల నుండి ఒకటిన్నర సంవత్సరాల వరకు మందులు వాడాల్సి ఉంటుంది. ప్రతి ఏటా ఈ జబ్బును గురించి ప్రపంచ ప్రజలను జాగృత పరచడానికి మార్చి 24న 'ప్రపంచ టీబీ డే'గా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 'అవును... మనం క్షయను అంతం చేయగలం' నినాదంతో ఈ జబ్బు లక్షణాలు ఉన్నవారు తగిన వైద్య సహాయానికి ముందుకు వచ్చి ఆరోగ్యం పొందాలని నినదిస్తున్నారు.

– డా॥ యనమదల మురళీకృష్ణ, ఎమ్.డి, సాంక్రమిక వ్యాధుల నిపుణులు, కాకినాడ

రంగస్థల నాటకానికి రక్షాకంకణం

సందర్భం



సుధామ

సినీ'మాయే' – విస్తృతమై, 'నాటు నాటు' అంటూ నాటుకుంటున్న ఈ కాలాన నీటుగా, ఉదాత్త విలువల దీటుగా – నాటకం పట్ల సమాజంలో కళాభిరుచులకు ఆస్కారంగా, ఆదరాభిమానాలు పాదుకునేలా రంగస్థల నాటకానికి ప్రాపుగా ఒక కాపు కాస్తూ, కృషి చేస్తున్న సంస్థల్లో ఒకటి 'రసరంజని'. జీవధార కళగా రంగస్థల నాటకాన్ని పరివ్యాప్తం చేస్తూ, సొంత రిపర్టరీ నిర్వహణతో బాటు – ఎన్నో నాటక సమాజాలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహిస్తూ, మూడు దశాబ్దాలుగా నాటక రంగాభిమానుల మన్ననలు అందుకుంటున్న సంస్థ రసరంజని. 'వరల్డ్ థియేటర్ డే'ను మార్చి 27న జరుపుకొంటున్న సందర్భంగా రసరంజని 3 రోజులపాటు నాటకోత్సవాలు నిర్వహిస్తోంది.

పౌరాణిక నాటకాలు, చారిత్రకాలు, సాంఘిక నాటకాలు ఎన్నో సమాజాభివృద్ధిలో, సామాజిక చైతన్యంలో గణనీయమైన పాత్ర పోషించాయి. నాటక ప్రదర్శన అనగానే జనం ఒకప్పుడు తండోపతండాలుగా బండ్లు కట్టుకుని మరీ తరలి వెళ్లేవారు. ఆ రోజుల్లో సురభి వంటి నాటక సమాజాల కీర్తి సురభిళాలు పరివ్యాపితమై విరాజిల్లేవి. పాండవోద్యోగ విజయాలు, శ్రీకృష్ణరాయబారం వంటి పద్యనాటకాల లగాయితు కన్యాశుల్కం, వరవిక్రయం, చిల్లర దేవుళ్ళు ఇలా చెప్పుకుంటూపోతే అంతులేని పట్టికగా... జనాదరణ పొంది సమాజంపై ప్రభావం చూపిన రంగస్థల నాటకాలు ఎన్నో. ఈ తరానికి వాటిని (ప్ర)దర్శింపచేయడంలో 'రసరంజని' పాత్ర అవిస్మరణీయం.

నాటక రంగ అభివృద్ధి కోసం, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ నాటకం విస్తృతంగా ప్రదర్శింపబడాలనీ, నాటకం ప్రజల మధ్యకి వెళ్లాలనీ, నాటకం ద్వారా సమాజ చైతన్యం జరగాలనీ ముఖ్యంగా ఎన్ని ఇక్కట్లున్నా టిక్కెట్టు కొని నాటకం చూడడం అనే ఉత్తమాభిరుచిని జనం విడనాడకూడదనే సంకల్పంతో నేటికీ రంగస్థల నాటక ప్రదర్శనలకే కట్టుబడి 31 ఏళ్లుగా నెలనెలా రసరంజని నిర్వహిస్తున్న కార్యక్రమాలు నాటక రంగానికే తలమానికాలు.



'రసరంజని' 1993 మార్చి 8న నెలకొల్పబడింది. ఈ మూడు దశాబ్దాల ప్రయాణంలో దాదాపు 700 నాటకాలు, మూడు వేల అయిదువందల ప్రదర్శనలు – సంస్థ కళాకారులతోనే కాక అనేక నాటక సమాజాల వారితో ప్రదర్శించడమైంది.

సొంత రిపర్టరీ నెలకొల్పడం ద్వారా ఎందరో నటీనటులకు, రచయితలకు, దర్శకులకు, రంగస్థల సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇచ్చి, తద్వారా వారు నాటకరంగంలో స్థిరపడి వన్నెవాసికెక్కడానికి రసరంజని దోహదపడింది. రంగస్థలంపై రసరంజని కథానాటక సప్తాహాలు, కథానాటక శరన్నవరాత్రులు, తెలుగు హాస్య నాటకోత్సవాలు, జాతీయ నాటక ప్రదర్శనలు, జాతీయ హిందీ నాటకోత్సవాలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రదర్శనలు అందించి తనదైన ప్రత్యేకతను చాటుకుంది.

'ప్రపంచమే ఒక నాటక రంగం. ప్రతి ఒక్కరం పాత్ర ధారులమే!' దర్శకుడు వేరయినా, మనమే అయినా, జీవితం అనే తెర పడే వరకూ అంకాలు మారుతూ బ్రతుకు దృశ్యాలు ఘటనలూ, సంభాషణలూ వెలుగు నీడలతో వివిధ రసాలతో సాగుతూనే ఉంటాయి అనే మాట మనం వింటూ వస్తున్నదే !

అటువంటప్పుడు నాటకమే ప్రపంచంగా, సమాజహిత చింతనతో కృషి చేస్తున్న నాటకరంగ సంస్థలను సమాదరించడం జనకర్తవ్యం. వారు కోరుతున్నది నాటకం చూడమని! నాటకాన్ని సమాదరించడం అంటే జీవితాన్ని సమాదరించడమే! మనిషినీ, మానవతనూ సమాదరించడమే!

వ్యాసకర్త ఆకాశవాణి విశ్రాంత అధికారి

భక్తుడి ధర్మం

'అడగనిదే అమ్మయినా పెట్టదు!' అని తెలుగులో ఒక నానుడి ఉంది. నోరు తెరిచి చెప్పనిదే కన్న తల్లికైనా తన సంతానం ఆకలి బాధ తెలియదు అని ఆ నానుడి చెబుతుంది. నానుడ్లు లోకానుభవ ప్రతిబింబాలు! బాధ కలిగినపుడు నిశ్శబ్దంగా కుమిలిపోవడం వలన ఏమీ ప్రయోజనం ఉండదు అనే విషయాన్ని అందరికీ అర్థమయేలా చెప్పడానికే నిత్య జీవితంలో జరిగే సంఘటనల నుండి సార్వజనీనమైన ఒక అనుభవాన్ని ఉదాహరణగా తీసుకుని పై నానుడిని చెప్పారు పెద్దలు. మనిషి బాధలలో కొన్ని తీరడానికి



జ్యోతిర్మయం

తోటి మనిషి సహాయం మాత్రమే కాక, భగవంతుడి సహాయం తప్పక అవసరమయ్యే సందర్భాలు అప్పుడప్పుడూ కలుగుతుంటాయి. అటువంటి సందర్భాలలో తనకు కావలసినదేమిటో వినమ్రంగా విన్నవించుకోకుండా, భగవంతుడి నుండైనా సహాయాన్ని పొందడం సాధ్యపడేది కాదని 'కుచేలోపాఖ్యానం' కావ్యం ప్రథమాశ్వాసంలో, ఆ కావ్యకర్తయైన గట్టు ప్రభువు, రెండు చక్కని ఉదాహరణలతో ఒక మత్తేభ వృత్తంలోని పద్యంలో చెప్పాడు.

ఇరవొన క్రముచే మహాసురునిచే నేనుంగు ప్రహ్లాదుడుం
బరితాపించుచు వేడగా గద పరబ్రహ్మంబు వేంచేసె ని
ట్లురు సంపూర్ణ దరిద్రులన్మనలగుయ్యో యన్న రక్షించు శ్రీ
హరి నిష్కాముల కేల యిచ్చు బహుళంబైనట్టి యైశ్వర్యముల్.

కుచేలుడు, శ్రీకృష్ణుడు బాల్యస్నేహితులు. పెరిగి పెద్దయ్యాక, విధి వశాన భరించలేని దారిద్ర్యంలో పడిన కుచేలుడు, భార్యా పిల్లలను పోషించుకోలేని స్థితిలో ఉంటాడు. అట్టి కుచేలుడికి దారిద్ర్యాన్నుండి బయటపడడానికి తరుణోపాయాన్ని అతడి భార్య ఉపదేశించే సన్నివేశంలోనిది పై పద్యం. 'మొసలి పట్టులో గజేంద్రుడు, హిరణ్యకశిపుని చేతిలో ప్రహ్లాదుడు ఎన్నో బాధలు పడుతూ, ఆ బాధలను తట్టుకోగలిగే స్థాయి దాటిపోవడంతో నిస్సహాయ స్థితికి చేరుకుని 'దేవుడా! నన్ను రక్షించు!' అని చేతులెత్తి నమస్కరించి వేడుకున్నప్పుడు మాత్రమే కదా శ్రీ మహావిష్ణువు వారిని ఆదుకోవడానికి అన్నీ వదిలి పరుగున వచ్చి కాపాడాడు. అలాగే ఘోరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న మనలను 'స్వామీ! కాపాడు!' అని ఆర్తితో వేడుకొంటే తప్పక రక్షిస్తాడు. అంతేగాని, ఏమీ అడగకుండా నిశ్శబ్దంగా కూర్చునే వారికి ఐశ్వర్యాన్ని, సౌఖ్యాన్ని శ్రీహరి ఎలా ప్రసాదిస్తాడు?' అని వివరించడం పై పద్యం భావం. కనుక, భగవంతుడి కరుణకు పాత్రులం కావాలంటే వినమ్రంగా వేడుకోవడం తప్పనిసరి!

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.11.34 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.9.58 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.7.15 నుండి 8.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** తె.5.51 నుండి 7.38 వరకు (తెల్లవారితే మంగళవారం); **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

సీఎంను కలిసిన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీతలు



అందెశ్రీ దంపతులను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

సాక్షి, హైదరాబాద్: ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీతలైన డప్పు వాయిద్య కళాకారులు అందె భాస్కర్, పేరిణి నృత్యకారుడు రాజ్‌కుమార్ నాయక్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఇరువురికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీ దంపతులను రేవంత్‌రెడ్డి దంపతులు ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తమ నివాసంలో సన్మానించారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కూడా సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంటర్ స్పాట్‌కు నేడు సెలవు

సాక్షి, హైదరాబాద్: హోలీ పండుగ నేపథ్యంలో సోమవారం ఇంటర్మీడియెట్ మూల్యాంకన ప్రక్రియకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. ఈమేరకు బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా మూల్యాంకన కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జరిగిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం జవాబు పత్రాల మూల్యాంకనం రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో చేపట్టారు. హోలీ రోజు సెలవు ఇవ్వాలని వివిధ సంఘాలు కోరిన నేపథ్యంలో బోర్డు సానుకూలంగా స్పందించింది. బోర్డు నిర్ణయాన్ని టీజీజేఎల్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేశ్, టీఐజీఎల్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ స్వాగతించారు.

31న జెన్‌కో ఏఈ, కెమిస్ట్ పరీక్షపై సందిగ్ధం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్లు, కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 31న జరగాల్సిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సంస్థ యాజమాన్యం అనుమతి కోరింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం జారీ చేసే ఆదేశాల ఆధారంగా షెడ్యూల్ ప్రకారం 31న పరీక్ష నిర్వహణపై తమ నిర్ణయాన్ని సంస్థ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులకు తెలియజేస్తామని జెన్‌కో తెలిపింది. ఈనెల 23 నుంచి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, ఈసీ అనుమతి కోసం జెన్‌కో ఎదురుచూస్తోంది.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోడి తూమ్నార్ – గొండపల్లి గ్రామాల అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఆదివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు గాలిస్తుండగా తారసపడిన మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరిపారు. పోలీసులు సైతం ఎదురుకాల్పులు ప్రారంభించారు. అనంతరం ఘటనా స్థలంలో ఓ మావోయిస్టు మృతదేహంతో పాటు తుపాకీ, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని బీజాపూర్ జిల్లా గంగలూర్ ఏరియా కమిటీ సభ్యుడు అవలం పొడియగా పోలీసులు గుర్తించారు.

యువ న్యాయమూర్తి ఆత్మహత్య



అంబర్‌పేట (హైదరాబాద్): కుటుంబ కలహాలతో ఓ న్యాయమూర్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోల్నాకకు చెందిన అందె శ్రీశైలం కుమారుడు మణికంఠ (36)కు ఏడేళ్ల కిందట మహబూబ్‌నగర్‌కు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల బాబు ఉన్నాడు. మణికంఠ రెండేళ్లుగా నాంపల్లిలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. 6 నెలల నుంచి భార్య ఇతనితో తరచూ గొడవకు దిగడం.. పోలీసులకు ఫిర్యాదు చేయడం వంటి చర్యలతో ఆయన మానసికంగా తీవ్ర ఇబ్బంది పడ్డారు. 5 రోజుల కిందట మణికంఠ తల్లి అనారోగ్యానికి గురికావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లావణ్య కూడా మణికంఠతో గొడవపడి అదే రోజు పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మణికంఠ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం లావణ్య ఎదురుగా ఉంటున్న ఫ్లాట్ వారికి ఫోన్ చేసి తన భర్తను పిలవాలని కోరగా.. వారు తలుపువేసి ఉందని చెప్పారు. బలవంతంగా అయినా తలుపులు తీయాలని లావణ్య కోరడంతో వారు తలుపులు విరగ్గొట్టి లోపలికెళ్లి చూడగా మణికంఠ ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

టెట్ ఫీజుపై టెన్షన్

- ఒకేసారి రూ. వెయ్యికి పెంపుపై నిరుద్యోగుల నిరసనలు
- ఎన్నికల వేళ ఎందుకీ రగడ అని ప్రభుత్వం పునరాలోచన
- ఫీజు పెంపునకు గల కారణాలపై సీఎంవో ఆరా
- ఆన్‌లైన్ పరీక్షల కారణంగా పెంచాల్సి వచ్చిందంటున్న విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్‌టెట్) ఫీజును అమాంతం రెండింతలకు పైగా పెంచడంపై నిరుద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఫీజును తగ్గించాల్సిందేనని విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఎన్నికల సమయం కావడంతో విపక్షాలూ తమ వంతు పాత్ర పోషించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి పెట్టింది. ఎన్నికల సమయంలో ఇలా చేయడం సరికాదని ప్రభుత్వ వర్గాల్లోనే తర్జన భర్జన జరుగుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా దీనిపై ఆరా తీసినట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అతి తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు చెప్పింది. అయితే దీనికి విరుద్ధంగా టెట్ ఫీజును భారీగా పెంచిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 2017 వరకూ టెట్‌కు ఒక్కో పేపర్‌కు రూ.200 ఉండేది. ఆ తర్వాత ఇది రూ.300 అయింది. 2023లో కూడా టెట్ ఫీజును రెండు పేపర్లకు కలిపి రూ. 400 చేసినా పెద్దగా విమర్శలు రాలేదు. కానీ ఇప్పుడు ఏకంగా ఒక పేపర్‌కు రూ. వెయ్యి, రెండు పేపర్లయితే రూ. 2 వేలు ఫీజు నిర్ణయించారు. ఈ ఏడాది దాదాపు 3 లక్షల మంది బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు టెట్ రాసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఫీజు తగ్గించలేమా?

ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు టెట్ ఫీజు పెంపుపై వస్తున్న విమర్శలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారులను కూడా సంప్రదించినట్టు తెలిసింది. ఫీజు పెంపు అంశం తమ ముందు అసలు చర్చకే రాలేదని, అధికారుల స్థాయిలోనే ఇది జరిగిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ నిరుద్యోగుల ఆగ్రహాన్ని ప్రభుత్వం భరించాల్సి వస్తోందని ముఖ్యమంత్రి సన్నిహిత వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఫీజును భారీగా పెంచే ముందు అధికారులు ప్రస్తుత పరిస్థితిని గమనంలోకి తీసుకుని ఉండాలని సీఎంవో భావిస్తున్నట్టు తెలిసింది. సమస్య మరింత జటిలం కాకముందే ఫీజు తగ్గింపు అంశాన్ని పరిశీలించాలని సీఎంవో భావిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను కోరిందని సమాచారం. అయితే ఫీజు పెంపు సమంజసమేనని అధికారులు సమర్థించుకుంటున్నారు. ఉపాధ్యాయ నియామక పరీక్షకు నిర్ణయించిన ఫీజు విషయంలోనూ తొలుత కొంత వ్యతిరేకత వచ్చినా, తర్వాత సద్దుమణిగిందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఆన్‌లైన్‌లో టెట్ నిర్వహించడం వల్ల వ్యయం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. సర్వర్ల నిర్వహణకు ఎక్కువ మొత్తం ఖర్చు చేయాలని అంటున్నారు. ఈ కారణంగానే టెట్ ఫీజు పెంచాల్సి వచ్చిందనేది అధికారుల వాదన. కాగా, దీనిపై పునరాలోచన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ఇది అన్యాయం

లక్షల మంది పేద విద్యార్థులు అప్పులు చేసి, టెట్ కోచింగ్ తీసుకున్నారు. టీచర్ కొలువులు వస్తాయని గంపెడాశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో టెట్ ఫీజులను రూ. 400 నుంచి రూ. వెయ్యికి పెంచడం అన్యాయం. ఆన్‌లైన్ ఫీజు పేరుతో పేదలపై భారం మోపడాన్ని ఎంతమాత్రం ఊరుకోం. ఫీజు తగ్గించకపోతే ఆందోళన చేపడతాం.
–ఆర్‌ఎల్ మూర్తి, టి.నాగరాజు (ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు)

ఏం చెప్పారు? ఏం చేస్తున్నారు?

పోటీ పరీక్షల ఫీజులు తగ్గిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పింది. అందుకు విరుద్ధంగా టెట్ ఫీజును రెండింతల నుంచి నాలుగింతలకుపైగా పెంచింది. ఇది పేద విద్యార్థులకు మోయలేని భారం. నిరుద్యోగుల పట్ల కనీస కనికరం కూడా చూపకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దారుణం. ప్రభుత్వం చెప్పిందేంటో? చేస్తున్నదేంటో? ప్రజలు అర్థం చేసుకోవాలి.
–రావుల మనోహర్‌రెడ్డి (బీఈడీ, డీఎడ్ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు)

కాంగ్రెస్‌లో కంగాళీ!



▶ మొదటి పేజీ తరువాయి

ఇస్తుండటంపై పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది.

మున్షీ టీమ్ ఏం చేస్తున్నట్టు?

లోక్‌సభ టికెట్ల ఖరారు విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఏం చేస్తున్నారన్న దానిపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గాంధీభవన్‌తోపాటు ఫిల్మ్‌నగర్‌లోని తన కార్యాలయం వేదికగా ఆమె లోక్‌సభ అభ్యర్థిత్వాల కోసం తరచూ ఆయా నియోజకవర్గాల నేతలతో భేటీ అవుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలందరి అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సభ్యులు కూడా తమ సిఫారసులను సీల్డ్ కవర్‌లో ఆమెకు అందజేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుల అభిప్రాయాలను కూడా ఆమె సేకరించారు. పలుమార్లు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతోనూ సమావేశమయ్యారు. ఆమెకు సహాయకారులుగా ఉన్న ఏఐసీసీ కార్యదర్శులు కూడా మంతనాలు జరుపుతున్నారు. అయితే వీరంతా అధిష్టానానికి ఏం చెబుతున్నారన్నది అంతు పట్టడం లేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అభ్యర్థుల ఖరారులో ఇతర పార్టీల కంటే వెనుకబడినా పరిస్థితిని అధిష్టానానికి వివరించడంలో మున్షీ టీమ్ పాత్ర ఏమిటన్నది కూడా అర్థం కావడం లేదని పేర్కొంటున్నాయి. ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకోవడంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న మున్షీ టీమ్.. లోక్‌సభ అభ్యర్థుల ఖరారు విషయంలో సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోతుందనే చర్చ జరుగుతోందని వివరిస్తున్నాయి.

ఖరారైన చోట కూడా ‘కంగారే’..

ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ 9 మంది లోక్‌సభ అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో ఐదుచోట్ల మాత్రమే మొదటి నుంచీ స్పష్టత కనిపించింది. సురేశ్ షెట్కార్ (జహీరాబాద్), బలరాం నాయక్ (మహబూబాబాద్), వంశీచంద్‌రెడ్డి (మహబూబ్‌నగర్), మల్లురవి (నాగర్‌కర్నూల్), కుందూరు రఘువీర్‌రెడ్డి (నల్లగొండ)ల విషయంలో మాత్రమే నిర్ణయాలు త్వరితగతిన జరిగిపోయాయి.

- చేవెళ్ల స్థానానికి తొలుత మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి సునీత పేరు దాదాపు ఖరారైంది. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆమోదం కోసం పంపిన జాబితాలోనూ ఆమె పేరు కనిపించింది. కానీ అనూహ్యంగా బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి తెరపైకి వచ్చారు. కాంగ్రెస్‌లో చేరిన వెంటనే చేవెళ్ల టికెట్ అందిపుచ్చుకున్నారు. దీనితో సునీతను మల్కాజిగిరికి మార్చాల్సి వచ్చింది.
- సికింద్రాబాద్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇవ్వాలనుకున్నారు. కానీ అనూహ్యంగా ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెరపైకి వచ్చారు. అటు ఎమ్మెల్యే పదవికి, ఇటు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయకుండానే సికింద్రాబాద్ టికెట్‌ను దానం నాగేందర్‌కు ఇవ్వడం గమనార్హం.
- పెద్దపల్లికి సంబంధించి ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలా? ఆయన కుమారుడు వంశీకి లోక్‌సభ టికెట్ ఇవ్వాలా అన్న దానిపై సమాలోచనలు జరిగాయి. చివరికి లోక్‌సభ టికెట్ ఇచ్చారు.
- మరోవైపు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలైన నాగర్‌కర్నూల్, పెద్దపల్లి టికెట్లను మాల సామాజిక వర్గానికే ఇవ్వడంపై మాదిగ సామాజికవర్గ నేతల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ కూడా ఈ విషయంలో కాంగ్రెస్‌ను విమర్శించారు. ఆయనకు కౌంటర్‌గా కాంగ్రెస్‌లోని మాదిగ సామాజిక వర్గ నేతలు మాట్లాడుతున్నా.. అంతర్గతంగా మాత్రం మాల, మాదిగ సామాజిక వర్గాల సమన్వయ లోపం రాష్ట్ర కాంగ్రెస్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.
- మరోవైపు ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతలకు లోక్‌సభ టికెట్లు ఎందుకు ఇవ్వాలన్న చర్చ కూడా కాంగ్రెస్ వర్గాల్లో సీరియస్‌గా జరుగుతుండటం గమనార్హం. అటు వలస నేతలు, ఇటు నేతల కుటుంబ సభ్యులకే టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తుండటం ఏమిటనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.

బర్రెకు మేత.. రైతుకు వెత!



స్టేషన్‌ఘన్‌పూర్: సాగునీరందక వరి పంట ఎండిపోతోంది. ఏం చేయాలో దిక్కు తోచనిస్థితిలో ఓ రైతు తన పొలంలో గేదెల్ని మేపుతున్నాడు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన తోట రవి ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. ఇప్పటి వరకు పెట్టుబడులకు దాదాపు రూ.60 వేలు ఖర్చు చేశాడు. చెరువులో నీరు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. రెండు బోర్లున్నా.. చుక్క నీరు రాక పోవడంతో రవి తన పొలంలో గేదెలు మేపుతున్నాడు.

భర్తీ ఎన్ని? మిగిలినవి ఎన్ని?

గురుకుల కొలువుల భర్తీపై ఇప్పట్లో స్పష్టత కష్టమే

- ఇప్పటివరకు 7 వేల మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో చాలా మందికి నిలుపుదల
- అభ్యర్థులకు పోస్టింగ్, ఆ తర్వాత జాయినింగ్ తర్వాతే ఖాళీలపై స్పష్టత
- అప్పటివరకు వేచి చూడాల్సిందే అంటున్న బోర్డు అధికారులు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ గణాంకాలపై ఇప్పట్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదు. వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా సిద్ధం కావడంతో పాటు ఇప్పటికే మెజార్టీ కేటగిరీల్లో అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లను సైతం పంపిణీ చేశారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మాత్రం పలువురు అభ్యర్థులు ఇంకా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకోలేదు. ఇంతలోనే పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడటం.. దానికితోడు జూన్ మొదటి వారం వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పెండింగ్‌లో ఉన్న అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేయడానికి అప్పటివరకు వేచి చూడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఎంతమంది అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్నారనే గణాంకాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదని అధికారులు చెపుతున్నారు.

9,231 కొలువులకు నోటిఫికేషన్లు..

రాష్ట్రంలో ఐదు ప్రభుత్వ గురుకుల సొసైటీలున్నాయి. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్‌ఈఐఎస్)లతో పాటు విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఆర్‌ఈఐఎస్)ల పరిధిలో వివిధ కేటగిరీల్లో 9,231 ఉద్యోగ ఖాళీలకు గురుకుల బోర్డు గతేడాది ఏప్రిల్ 5వ తేదీన ఏక కాలంలో నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ కేటగిరీల్లోని 350 ఉద్యోగాల భర్తీ పెండింగ్‌లో ఉండగా.. మిగతా 8,881 ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తయింది. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సైతం సిద్ధం చేసిన అధికారులు.. కొన్ని జిల్లాల్లో ఇంకా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలుండటంతో అభ్యర్థులు ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకుని పరీక్ష రాశారు. దీంతో దాదాపు రెండు వేల మంది అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు సాధించారు. కొందరైతే మూడు, నాలుగు ఉద్యోగాలు కూడా సాధించడం గమనార్హం. అయితే ఎన్ని ఉద్యోగాలు వచ్చినా అందులో ఉత్తమమైన కేటగిరీని ఎంపిక చేసుకోవడంతో పాటు పోస్టింగ్ వచ్చిన ప్రాంతం ఆధారంగా విధుల్లో చేరేందుకు అభ్యర్థి సిద్ధమవుతారు. ప్రస్తుతం చాలావరకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినప్పటికీ.. ఇంకా ఒక్క కేటగిరీలోనూ పోస్టింగులు ఇవ్వలేదు.

ఎన్నికల కోడ్ ముగిశాకే..

అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడం పూర్తయిన తర్వాత అందరికీ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇవ్వాలని గురుకుల సొసైటీలు నిర్ణయించాయి. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఈప్రక్రియ మొదలు కానుంది. దీంతో కౌన్సెలింగ్ ముగిసి విధుల్లో చేరే గడువు పూర్తయిన తర్వాతే ఎంతమంది అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరతారన్న అంశంపై స్పష్టత వస్తుంది. అప్పటివరకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఉద్యోగాల్లో భర్తీ అయిన కొలువులు ఎన్ని, మిగిలిన పోస్టులు ఎన్ని.. అనే దానిపై స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు మరో రెండు నెలల సమయం పట్టవచ్చని గురుకుల అధికారులు చెపుతున్నారు.

789 టీఎంసీలు మాకే కావాలి



▶ మొదటి పేజీ తరువాయి

నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కృష్ణా జలాల పంపిణీపై తమ వాదనలతో స్టేట్ ఆఫ్ కేసు (ఎస్‌ఓసీ) దాఖలు చేయాలని రెండు రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నెల 20తో గడువు ముగియగా, అదేరోజు తమకు 798 టీఎంసీలను కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఎస్‌ఓసీ దాఖలు చేసింది. నది పరీవాహక ప్రాంతం (బేసిన్)ను ప్రామాణికంగా తీసుకుంటే 68 శాతం క్యాచ్‌మెంట్ ఏరియా తమ రాష్ట్రం పరిధిలో ఉందని తెలంగాణ స్పష్టం చేసింది. బేసిన్ పరిధిలో 2 కోట్ల జనాభాతో పాటు అత్యధిక శాతం కరువు పీడిత ప్రాంతాలున్న అంశాన్ని పరిగణనలోకి తీసుకొని న్యాయమైన వాటాగా 789 టీఎంసీలు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. కనీస మొత్తంగా 75 శాతం లభ్యత(డిపెండబిలిటీ) ఆధారంగా 555 టీఎంసీలు, 65 శాతం లభ్యత ఆధారంగా 575 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని నివేదించింది.

భవిష్యత్‌లో కట్టే ప్రాజెక్టులకు 216 టీఎంసీలు

భవిష్యత్‌లో కోయిల్‌కొండ, గండీడ్, జూరాల ఫ్లడ్ ఫ్లో కెనాల్ వంటి ప్రాజెక్టుల నిర్మాణం జరగాల్సి ఉందని, వీటికి 216 టీఎంసీల నీటిని కేటాయించాలని ట్రిబ్యునల్‌ను తెలంగాణ కోరింది.

1050 టీఎంసీల్లో సగానికి పైగా...

ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ గంపగుత్తగా 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అదనంగా 194 టీఎంసీలు కేటాయించడంతో ఉమ్మడి ఏపీకి 1050 టీఎంసీల కేటాయింపులున్నాయి. ఇవికాక పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టా సిస్టమ్ (కేడీఎస్)కు తరలించే 80 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా, నాగార్జునసాగర్ ఎగువన ఉండే రాష్ట్రాలకు 80 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకునే వెసులుబాటు గతంలోనే బచావత్ ట్రిబ్యునల్ కల్పించింది. అందులో ఉమ్మడి ఏపీకి దక్కిన 45 టీఎంసీలు కలుపుకొని మొత్తం 1050 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉంది.

ట్రిబ్యునల్ నివేదికకు 15 నెలల గడువు

అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం–1956లోని సెక్షన్–3 కింద విచారణ జరిపి, నివేదిక ఇచ్చేందుకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గడువును ఇటీవల కేంద్రం మరో 15 నెలలు పొడిగించింది. 2025 జూలై 31లోపు ట్రిబ్యునల్ నివేదిక అందించాలి. ఏపీ సైతం తమ స్టేట్ ఆఫ్ కేసును దాఖలు చేస్తే ట్రిబ్యునల్ విచారణ ముందుకు సాగనుంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్–89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై ట్రిబ్యునల్ విచారణ చేసినందున, తీర్పు కూడా 15 నెలల్లోపే వస్తుందనే ఆశతో తెలంగాణ ఉంది.

పాత ప్రాజెక్టులకు తెలంగాణ కేటాయించాలని కోరింది ఇలా...

ప్రాజెక్టు	టీఎంసీలు
మైనర్ ఇరిగేషన్	89.15
నాగార్జునసాగర్ ఎడమకాల్వ	105.70
బీమా ఎత్తిపోతల	20
జూరాల	17.80
తాగునీటి సరఫరా	5.70
పాకాల చెరువు	2.60
వైరా చెరువు	3.70
పాలేరు ప్రాజెక్టు	4
డిండి ప్రాజెక్టు	3.50
కోయిల్‌సాగర్	3.90
ఆర్డీఎస్	15.90
మూసీ	9.40
లంకసాగర్	1
కోటిపల్లి వాగు	2
ఒకచెట్టివాగు	1.90
ఇతర ప్రాజెక్టులకు కలిపి మొత్తం	299

నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు ఇలా కేటాయించాలి

ప్రాజెక్టు	టీఎంసీలు
శ్రీశైలం ఎడమగట్టు కాల్వ(ఎస్‌ఎల్‌బీసీ)	40
కల్వకుర్తి ఎత్తిపోతల	53
నెట్టెంపాడు	25.4
పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల	90
డిండి ఎత్తిపోతల	30
మొత్తం	238

ఎనిమిది చోట్ల ఖరారుపై తకరారు!



▶ మొదటి పేజీ తరువాయి

సామాజికవర్గ నేతకే చాన్స్ ఇవ్వనున్నారు. తొలుత దొమ్మాట సాంబయ్య పేరు ప్రముఖంగా వినిపించింది. తర్వాత బీఆర్‌ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ పార్టీలోకి రావడంతో ఆయన వైపు మొగ్గు కనిపిస్తోందని అంటున్నారు. ఈ ఇద్దరితోపాటు గతంలో లోక్‌సభకు పోటీచేసిన డాక్టర్ రాగమళ్ల పరమేశ్వర్ కూడా టికెట్ అడుగుతున్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థిని తేల్చడంలో గందరగోళం కనిపిస్తోంది.

కరీంనగర్

ఇక్కడ మాజీ ఎమ్మెల్యే అలిగి ప్రవీణ్‌రెడ్డి పేరు ప్రచారంలో ఉంది. వెలిచాల రాజేందర్‌రావు పేరు కూడా వినిపిస్తోంది. ఇక్కడ ప్రవీణ్‌రెడ్డి అభ్యర్థిత్వం దాదాపు ఖరారైందని అంటున్నా అధికారిక ప్రకటన మాత్రం రావడం లేదు.

నిజామాబాద్

నిజామాబాద్ స్థానం నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీ చేస్తారని చాలా కాలం నుంచి ప్రచారం జరుగుతోంది. బాల్కొండ నుంచి అసెంబ్లీకి పోటీచేసిన ముత్యాల సునీల్‌రెడ్డి కూడా ఎంపీ టికెట్ అడుగుతున్నారు. ఇక్కడ జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారైందని చెప్తున్నా అధికారికంగా ప్రకటించలేదు.

ఖమ్మం

ఈ ఎంపీ సీటు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులలో ఎవరికి అవకాశం అన్నదానిపై ఇంకా చర్చ జరుగుతూనే ఉంది. మల్లు నందిని, పొంగులేటి ప్రసాదరెడ్డి, తుమ్మల యుగంధర్‌లతోపాటు పారిశ్రామికవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు కూడా ఖమ్మం టికెట్ అడుగుతున్నారు. మంత్రుల కుటుంబ సభ్యులకు అవకాశమిస్తారా? కమ్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యమిస్తారా? బీసీ వర్గాలకు టికెట్ ఇస్తారా అన్నదానిపై స్పష్టత లేకుండా పోయింది.

భువనగిరి

ఇక్కడ కూడా ఖమ్మం లోక్‌సభ స్థాయిలో పోటీ నెలకొంది. ఈ సీటుకు సంబంధించి తొలినుంచీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి అనుచరుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. తర్వాత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి పేరును సీరియస్‌గా పరిశీలించారు. అయితే రాజగోపాల్‌రెడ్డి మాత్రం తాము టికెట్ అడగడం లేదని, లోక్‌సభ ఎన్నికల తర్వాత తాను మంత్రిని అవుతానని అంటున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీలోకి వస్తారని, ఆయనకే టికెట్ ఇస్తారనే ప్రచారం జరిగినా అది ఆచరణలోకి రాలేదు. కోమటిరెడ్డి కుటుంబానికి చెందిన మరో నాయకుడు పవన్‌రెడ్డి కూడా పోటీలో ఉన్నారు. తాజాగా బీసీ నేతకు భువనగిరి టికెట్ వస్తుందనే చర్చ జరుగుతోంది. దీనితో గందరగోళంగా మారింది.

మెదక్

ఈ లోక్‌సభ సీటును బీసీలకు ఇస్తారని మొదట్నుంచీ ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి, పటాన్‌చెరు టికెట్ ఇవ్వకపోవడంతో బీఎస్పీ తరఫున పోటీచేసి, అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చిన నీలం మధు ముదిరాజ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష కూడా పోటీలో ఉన్నారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మల తనకు మెదక్ ఎంపీ టికెట్ కావాలని అడిగినా.. ఆమెను టీజీఐఐసీ చైర్మన్‌గా నియమించడంతో రేసు నుంచి వైదొలగినట్టు తెలుస్తోంది. మెదక్‌లో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది.

హైదరాబాద్

హైదరాబాద్ టికెట్ విషయంలోనూ ఏమీ తేలలేదు. ఇక్కడ ఎంఐఎంకు ప్రతిగా ఎంబీటీని ప్రోత్సహించాలని తొలుత భావించారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థిని బరిలో దింపాలని తర్వాత నిర్ణయించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌తోపాటు అలీ మస్కతిల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా న్యాయవాది షహనాజ్ తబసుమ్ అభ్యర్థిత్వాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఎలాంటి స్పష్టతా లేదు.

పేట్ బషీరాబాద్ భూమిని అక్రమంగా విక్రయిస్తున్నారు

- అలాంటి ప్రయత్నాలను అడ్డుకోవాలి
- అధికారులకు జేఎన్‌జేహెచ్‌ఎస్ వినతి

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ గ్రామంలోని సర్వే నంబర్ 25/2లో ఉన్న 38 ఎకరాల భూమిని అక్రమంగా విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేహెచ్‌ఎస్) ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఈ భూమిని జీఓఎంఎస్ 424 ద్వారా 2008 మార్చిలో అప్పటి ప్రభుత్వం జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు కేటాయించిందని వివరించింది. ఈ భూమి 2005 నుంచి హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉందని తెలిపింది. పాఠశాల, పోలీస్ స్టేషన్ కూడా సర్వే నంబర్ 25/2 పరిధిలోకే వస్తుందని హౌసింగ్ సొసైటీ వివరించింది. ఈ 38 ఎకరాల భూమిని జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు అప్పగించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఈ ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపింది. ఈ భూమిపై ఎలాంటి హక్కులు లేకపోయినప్పటికీ కొందరు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంది. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులను జేఎన్‌జేహెచ్‌ఎస్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవికాంత్, కార్యదర్శి వంశీ శ్రీనివాస్, డైరెక్టర్లు రమణారావు, అశోక్‌రెడ్డి కోరారు.

తగ్గిన 'జాతీయ' ప్రభ

సార్వత్రిక సమరంలో సత్తా చాటలేకపోతున్న జాతీయ పార్టీలు

70 ఏళ్లలో 14 నుంచి ఆరుకు తగ్గిన జాతీయ పార్టీల సంఖ్య

ఎన్నికల కుంభమేళాలో దేశవ్యాప్తంగా వేలాది రాజకీయ పార్టీలు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 2,500కు పైగా రాజకీయ పార్టీలున్నాయి. కానీ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు బరిలో నిలిచాయి. అందులో 14 మాత్రమే జాతీయ పార్టీలు. మిగతావి రాష్ట్ర పార్టీలు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓటర్లను ఆకర్షించి అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీలుగా ఖ్యాతికెక్కిన జాతీయ పార్టీలు నెమ్మదిగా ప్రభ కోల్పోతున్నాయి. సత్తా చాటలేక చతికిల పడుతూ తమ 'జాతీయ' హోదాను కోల్పోతున్నాయి. అలా ఈ ఏడు దశాబ్దాల కాలంలో ఎనిమిది పార్టీలు 'జాతీయ' హోదా కోల్పోయాయి. డెబ్బై ఏళ్లలో కొన్ని జాతీయ పార్టీలు విలీనం కాగా కొత్తవి ఉద్భవించాయి. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు పరిమితమైంది.

దేశంలో ఎన్నికల పర్వాన్ని అక్షరబద్ధం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించిన 'లీప్ టు ఫెయిత్' పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలున్నాయి. జాతీయ పార్టీ ట్యాగ్‌లైన్ తమకూ కావాలని 1951 లోక్‌సభ ఎన్నికలకు ముందు 29 రాజకీయ పార్టీలు పట్టుబట్టాయి. అయితే వాటిలో 14 పార్టీలకే ఆ హోదా దక్కింది. అయితే మెజారిటీ పార్టీలు దాన్ని నిలబెట్టుకోలేకపోయాయి. కేవలం నాలుగు పార్టీలు.. కాంగ్రెస్, ప్రజా సోషలిస్ట్ పార్టీ, సీపీఐ, జనసంఘ్ ఆ హోదాను నిలుపుకున్నాయి. అఖిల భారతీయ హిందూ మహాసభ, ఆలిండియా భారతీయ జనసంఘ్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్(మార్కిస్ట్), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్(రూకర్), కృషికార్ లోక్‌పార్టీ, బోల్షివిక్ పార్టీ ఆఫ్ ఇండియా, రెవల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ హోదా కోల్పోయాయి. దీంతో 1957 ఎన్నికలనాటికి పార్టీల సంఖ్య 15కు పడిపోయింది. వాటిలో నాలుగింటికే జాతీయ హోదా కొనసాగింది. అయితే 1962 ఎన్నికలనాటికి జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు, అన్ని పార్టీల సంఖ్య 29కి పెరిగింది. సోషలిస్ట్ (ఎస్‌ఓసీ), స్వతంత్ర (ఎస్‌డబ్ల్యూఏ) పార్టీలు జాతీయ హోదా పొందాయి. 1951 ఎన్నికల తర్వాత సీపీఐ ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగి పుష్కర కాలం ఆ హోదాలో కొనసాగింది. కానీ 1964లో పార్టీలోని సోవియట్, చైనా కమ్యూనిస్ట్ వర్గాలు వేరు కుంపటి పెట్టాయి. దీంతో సీపీఐ (మార్కిస్ట్) పురుడుపోసుకుంది.

జేపీ.. జనతా ప్రయోగం

జయప్రకాశ్ నారాయణ్ (జేపీ), రామ్ మనోహర్ లోహియా, ఆచార్య నరేంద్ర దేవ్ ఏర్పాటుచేసిన సోషలిస్ట్ పార్టీ మూలాలు కాంగ్రెస్ వామపక్ష విభాగమైన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (సీఎస్‌పీ)లో ఉన్నాయి. జేపీ సోషలిస్ట్ పార్టీని జేబీ కృపలానీ సారథ్యంలోని కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీలో విలీనం చేసి ప్రజా సోషలిస్ట్ పార్టీ (పీఎస్‌పీ)ని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత పీఎస్‌పీ నుంచి జేపీ బయటికొచ్చారు.

- 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో జేపీ మళ్లీ జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. జేపీతో పాటు విపక్షాలు నేతలందరూ జైలు పాలయ్యారు.
- జేపీ విడుదలయ్యాక కొందరు పీఎస్‌పీ నేతలతో కలిసి భారతీయ లోక్‌దళ్‌ను స్థాపించారు.
- ఎమర్జెన్సీకారణంగా దేశంలోని విపక్ష పార్టీలపై నిషేధం కత్తి వేలాడటంతో ఇందిరను ఢీకొట్టేందుకు అంతా కలిసి జనతా పార్టీకి ప్రాణం పోశారు. 1977లో ఇందిరను ఓడించి జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది.

1992లో 7 జాతీయ పార్టీలు

1992 లోక్‌సభ ఎన్నికల్లో ఏడు నేషనల్ పార్టీలు.. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, జనతాదళ్, జనతా పార్టీ, లోక్‌దళ్ పోటీలో ఉన్నాయి. 1996 సాధారణ ఎన్నికల్లో మొత్తం 209 పార్టీలు అధికారం కోసం పోటీపడ్డాయి. కాంగ్రెస్, ఆలిండియా కాంగ్రెస్ (తివారీ), బీజేపీ, సీపీఐ, సీపీఎం, జనతా పార్టీ, సమతా పార్టీ, జనతాదళ్ రూపంలో ఎనిమిది పార్టీలకు జాతీయ హోదా దక్కింది. 1998 ఎన్నికలకొచ్చేసరికి పార్టీల సంఖ్య 176కు పడిపోయింది. ఈ దఫా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, జనతాదళ్, సీపీఐ, సీపీఎం, సమతా పార్టీ జాతీయ హోదాతో పోటీపడ్డాయి. 1999లో పార్టీల సంఖ్య 160కి పడిపోయింది. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, జేడీ(ఎస్), జేడీ(యూ) జాతీయ పార్టీలుగా అదృష్టం పరీక్షించుకున్నాయి.

2014లో 464 పార్టీలు

2014 ఎన్నికల్లో ఏకంగా 464 పార్టీలు రంగంలోకి దూకాయి. జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు తగ్గింది. ఆనాడు బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, బీఎస్పీలకు మాత్రమే జాతీయ హోదా ఉంది. 2016లో మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా జాతీయ హోదా సాధించి ఎన్నికల్లో పోటీ చేసింది. 2019లోనూ ఎక్కువ సీట్లు సాధించేందుకు శ్రమించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 674 పార్టీలు పోటీ చేయగా వాటిలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, తృణమూల్ రూపంలో ఏడు జాతీయ పార్టీలుగా నిలిచాయి. తర్వాత తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ జాతీయ హోదా కోల్పోయాయి.

జాతీయ హోదా ఇలా...

నిబంధనావళి ప్రకారం కనీసం మూడు రాష్ట్రాల నుంచి కనీసం రెండు శాతం ఎంపీ సీట్లను గెలిచిన పార్టీకే జాతీయ పార్టీ హోదా దక్కుతుంది. లేదంటే నాలుగు రాష్ట్రాల్లో పోలై చెల్లిన ఓట్లలో ఆరు శాతం ఓట్లు ఆ పార్టీకి పడాలి. కనీసం నాలుగు రాష్ట్రాల్లో అప్పటికే రాష్ట్ర పార్టీ హోదా ఉండాలి.

- జాతీయ పార్టీ దేశవ్యాప్తంగా పోటీ చేస్తే ఆ పార్టీ అభ్యర్థులకు ఒకే ఎన్నికల గుర్తును కేటాయిస్తారు.
- దేశ రాజధానిలో పార్టీ కార్యాలయం ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తారు.

జాతీయ పార్టీగా ఆప్

తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ జాతీయ పార్టీ హోదాను కోల్పోయాక గతేడాది కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ హోదా సాధించడం విశేషం. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఆప్ మాత్రమే జాతీయహోదాలో తలపడుతున్నాయి. 543 లోక్‌సభ స్థానాలకు మొత్తం ఏడు దశల్లో పోలింగ్ జరగనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ బీట్

లోక్‌సభ ఎన్నికల బరిలో వీరప్పన్ కుమార్తె


విద్యారాణి

చెన్నై: గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి నియోజకవర్గం నుంచి నామ్ తమిళర్ కట్చి టికెట్‌పై పోటీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాలను ఎంచుకున్నట్లు తెలిపారు. విద్యారాణి న్యాయవాదిగా గిరిజనులు, దళితుల హక్కుల కోసం పోరాడుతున్నారు. తమిళనాడులో ఉద్యమకారిణిగా గుర్తింపు పొందారు. విద్యారాణి 2020లో బీజేపీలో చేరారు. తమిళనాడు బీజేపీ యువజన విభాగం ఉపాధ్యక్షురాలిగా పని చేశారు. కొంతకాలం తర్వాత ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. తమిళ సినీ నటుడు, దర్శకుడు సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చిలో ఆమె చేరబోతున్నారు. ప్రజలకు సేవ చేయాలని తన తండ్రి వీరప్పన్ తపించారని, కానీ ఆయన ఎంచుకున్న మార్గం సరైంది కాదని విద్యారాణి చెప్పారు. 2004 అక్టోబర్ 18న తమిళనాడు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కాల్పుల్లో వీరప్పన్ హతమైన సంగతి తెలిసిందే.

ఇండియా కూటమి చెదరలేదు: జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి చెక్కుచెదరలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దూరంగా ఉంటున్నప్పటికీ తమ కూటమికి స్థిరంగా, బలంగా ఉందని అన్నారు. అవినీతిని వ్యతిరేకిస్తున్నాం అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రకటనలన్నీ ఉత్తడొల్లేనని కొట్టిపారేశారు. జైరామ్ రమేశ్ ఆదివారం ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని తేల్చిచెప్పారు. విపక్షాలు 272కి పైగా సీట్లు సాధిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కాంట్రాక్టులు పొందినవారు పెద్ద ఎత్తున ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి, బీజేపీకి సమర్పించుకున్నారని తెలిపారు. రూ.4,000 కోట్ల విలువైన బాండ్లకు రూ.4 లక్షల కోట్ల విలువైన కాంట్రాక్టులతో ప్రత్యక్షంగా సంబంధం ఉందన్నారు. ఐటీ, ఈడీ, సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నవారు కూడా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీజేపీకి అందజేశారని వెల్లడించారు. ఇది ముమ్మాటికీ క్విడ్ ప్రో కో అని తేల్చిచెప్పారు. మౌలిక సదుపాయాలకు సంబంధించిన కాంట్రాక్టులను దక్కించుకున్న ఓ బీజేపీ ఎంపీ కూడా ఎలక్టోరల్ బాండ్లు కొన్నాడని వెల్లడించారు అవినీతిపై పోరాటం అంటూ ప్రధాని మోదీ చెబుతున్న మాటల్లో ఏమాత్రం పస లేదని జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు.

పోటీ నుంచి తప్పుకున్న కేంద్ర మంత్రి వీకే సింగ్

ఘజియాబాద్: కేంద్ర మంత్రి, ఘజియాబాద్ బీజేపీ ఎంపీ రిటైర్డు జనరల్ వీకే సింగ్ అస్త్రసన్యాసం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. ఆయన కేంద్ర మంత్రివర్గంలో పౌరవిమానయాన శాఖ, రోడ్డు రవాణా హైవేల శాఖలకు సహాయ మంత్రిగా ఉన్నారు. దేశానికి మరో రూపంలో సేవలందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వీకే సింగ్ తెలిపారు.

బాండ్లు కాదు.. బీజేపీ బలవంతపు వసూళ్లు: అఖిలేశ్

కనౌజ్(యూపీ): ఎలక్టోరల్ బాండ్ల విషయంలో కేంద్రంలోని అధికార బీజేపీపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ బాండ్ల రూపంలో బలవంతంగా డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు. చందాల ముసుగులో వసూళ్ల దందాకు తెరతీసిందని ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. బలవంతపు వసూళ్ల కోసం సీబీఐ, ఈడీ ఐటీ వంటి సంస్థలను బీజేపీ విచ్చలవిడిగా వాడుకుందని మండిపడ్డారు. కొందరు కాంట్రాక్టర్లపై సీబీఐ, ఈడీ, ఐటీ శాఖ నుంచి ఒత్తిళ్లు పెరిగినప్పుడల్లా బీజేపీ ఖాతాలోకి పెద్ద ఎత్తున డబ్బులు వచ్చాయని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లతో ఇప్పుడు బీజేపీ ప్రతిష్ట మసకబారిందని పేర్కొన్నారు. భిన్నమైన పార్టీ అని చెప్పుకొనే బీజేపీపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని వెల్లడించారు. ఈ ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని అఖిలేశ్ ఆక్షేపించారు.

31న విపక్షాల మహా ర్యాలీ

- ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ సభ
- సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు 'ఇండియా' కూటమి సంఘీభావం
- ఒక్కతాటిపైకి రానున్న విపక్ష నేతలు
- దేశంలో ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ ఆందోళన

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతుగా విపక్ష 'ఇండియా' కూటమి నాయకులు చేతులు కలుపుతున్నారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ, ఆయనకు సంఘీభావంగా ఈ నెల 31న తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో మహా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. కూటమి భాగస్వామ్య పక్షాల అగ్రనేతలు ఈ ర్యాలీలో పాల్గొనబోతున్నారు. ఇండియా కూటమిలో ఆమ్ ఆద్మీ పార్టీ కీలక భాగస్వామి అన్న సంగతి తెలిసిందే. దేశ ప్రయోజనాలతోపాటు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతో మహా ర్యాలీ చేపట్టాలని నిర్ణయించామని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ చెప్పారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. దేశంలో తాజా పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించేవారంతా కేజ్రీవాల్ అరెస్టు పట్ల ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ''ఇది కేవలం అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించిన సమస్య కాదు. ప్రతిపక్షాలన్నీ బెదిరింపులను ఎదుర్కొంటున్నాయి. అధికారంలో ఉన్న వ్యక్తులు మొదట విపక్షాలను డబ్బుతో కొనేయాలని చూస్తున్నారు. మాట వినకపోతే ఈడీ, ఐటీ, సీబీఐని ప్రయోగిస్తున్నారు. అయినా లొంగకపోతే తప్పుడు కేసుల్లో ఇరికించి అరెస్టు చేస్తున్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇలాగే అరెస్టు చేశారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పైనా గురిపెట్టారు'' అని గోపాల్ రాయ్ ఆరోపించారు. కేజ్రీవాల్ కుటుంబ సభ్యులను గృహ నిర్బంధంలో ఉంచారని, ఆప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని ధ్వజమెత్తారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి విపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయని చెప్పారు.

కేవలం రాజకీయ సభ కాదు

ఢిల్లీలో ఈనెల 31న జరిగే మహా ర్యాలీ కేవలం రాజకీయ సభ కాదని, కేంద్రంలోని నిరంకుశ బీజేపీకి వ్యతిరేకంగా వినిపించే గొంతుక అని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ పేర్కొన్నారు. దేశంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ ఖాతాలను స్తంభింపజేశారని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారని చెప్పారు. ఇండియా కూటమి పక్షాలకు అండగా నిలుస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ పోరాడుతాయని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై దాడులను సహించబోమని సీపీఎం నేత రాజీవ్ కున్వార్ స్పష్టం చేశారు.

ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ పరిపాలన

ఢిల్లీలో తాగునీటి సమస్యపై తొలి ఉత్తర్వు జారీ



న్యూఢిల్లీ: జైలులో ఉన్నా, బయట ఉన్నా ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తానని చెప్పిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆ దిశగా తొలి ఉత్తర్వు జారీ చేశారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి నుంచి శనివారం రాత్రి ఆదేశాలు అందాయని ఢిల్లీ నీటి మంత్రి అతీషి చెప్పారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్ పంపించిన నోట్‌ను చూసిన తర్వాత తనకు కన్నీళ్లు వచ్చాయంటూ భావోద్వేగానికి గురయ్యారు. అరెస్టై ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజల బాగు కోసం ఆయన ఆలోచిస్తున్నారని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తగినన్ని వాటర్ ట్యాంకర్లు పంపించాలంటూ కేజ్రీవాల్ ఆదేశించారని పేర్కొన్నారు. వేసవి ఎండలు ముదురుతుండడంతో నీటి సరఫరాను మెరుగుపర్చాలని చెప్పారని అన్నారు. ఈ విషయంలో చీఫ్ సెక్రటరీతోపాటు సంబంధిత అధికారులకు సీఎం ఈడీ కస్టడీ నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సాయం తీసుకోవాలని సూచించారని మంత్రి అతీషి చెప్పారు. కస్టడీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ జారీ చేసిన ఉత్తర్వుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్పందించింది. ఈ ఉత్తర్వు కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అనుమతిస్తూ పీఎంఎల్‌ఏ కోర్టు జారీ చేసిన ఆర్డర్‌కు అనుగుణంగా ఉందా? లేదా? అనేది పరిశీలించనున్నట్లు ఈడీ అధికార వర్గాలు ఆదివారం తెలియజేశాయి.

మళ్లీ బీజేపీలోకి గాలి జనార్దనరెడ్డి

సాక్షి, బెంగళూరు: మైనింగ్ వ్యాపారి, కర్ణాటక రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి మళ్లీ కాషాయ పార్టీలోకి చేరబోతున్నారు. కేఆర్‌పీపీని బీజేపీలో విలీనం చేయనున్నారు. ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నట్లు ఆదివారం మీడియాకు తెలిపారు. నరేంద్ర మోదీని మూడో సారి ప్రధానమంత్రిగా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. బళ్లారిలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బి.శ్రీరాములుకు మద్దతు తెలిపారు. బీఎస్ యడియూరప్ప ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జనార్దనరెడ్డి, ఆ తర్వాత మైనింగ్ కుంభకోణం కేసులో జైలు పాలయ్యారు. కేఆర్‌పీపీని సొంతంగా ఏర్పాటు చేసి, 2023 ఎన్నికల్లో పోటీ చేశారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. భారతీయ విద్యార్థిని మృతి

న్యూయార్క్: అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్షియా జోషి (24) అనే భారతీయ విద్యార్థిని మృతి చెందారు. ఆర్షియా ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైందని భారత కాన్సులేట్ కార్యాలయం తెలిపింది.

ఐసిస్‌తో లింకులు.. గువాహటి ఐఐటీ విద్యార్థి అరెస్ట్

గువాహటి: అంతర్జాతీయ ఉగ్ర సంస్థ ఐసిస్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై గువాహటి–ఐఐటీకి చెందిన తౌసిఫ్ అలీ ఫరూకీ అనే విద్యార్థిని అస్సాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీటెక్ బయోసైన్స్ నాలుగో సంవత్సరం చదువుకుంటున్న ఇతడిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ)చట్టం ఉపా కింద కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన అనంతరం ఐసిస్‌తో సంబంధాలున్నట్లు పక్కా ఆధారాలు దొరకడంతో శనివారం అరెస్ట్ చేసినట్లు అస్సాం పోలీస్ టాస్క్‌ఫోర్స్ ఐజీ పార్థసారథి మహంతా చెప్పారు. కోర్టు అతడిని 10 రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చిందన్నారు. ఢిల్లీలోని బాట్లా ప్రాంతానికి చెందిన అతడు ఐసిస్‌లో చేరేందుకు వెళ్తుండగా కామ్‌రూప్ జిల్లా హజో వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. మూడు రోజుల క్రితం బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఐసిస్ భారత్ చీఫ్ హారిస్ ఫరూకీ, అతడి అనుచరుడు అనురాగ్ సింగ్ అలియాస్ రేహాన్‌లను ధుబ్రి జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఐజీ వివరించారు. అయితే, గువాహటి ఐఐటీకి చెందిన ఇద్దరు విద్యార్థులకు ఐసిస్‌తో సంబంధాలున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తనకు సమాచారం ఇచ్చినట్లు హోం శాఖ బాధ్యతలు కూడా చూసుకుంటున్న సీఎం హిమాంత బిశ్వ శర్మ చెప్పారు. ఇద్దరిలో ఒక్కరు మాత్రమే దొరికారని, తప్పించుకుపోయిన మరో విద్యార్థిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఉగ్రవాదం వైపు ప్రేరేపితులైన వీరి గురించి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు సీఎం చెప్పారు.

ముంబైలో రూ.3 కోట్ల డ్రగ్స్ సీజ్

ముంబై: గత నెల రోజుల వ్యవధిలో రూ.3.25 కోట్ల విలువైన 16 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, 12 మంది పెడ్లర్లను అరెస్ట్ చేసినట్లు ముంబై పోలీస్ శాఖ యాంటీ నార్కోటిక్స్ సెల్(ఏఎన్‌సీ) ఆదివారం తెలిపింది. సహర్ గ్రామం, నల్లసొపార, శాంటాక్రుజ్, కుర్లా, బైకుల్లా తదితర ప్రాంతాలకు చెందిన పెడ్లర్ల నుంచి హెరాయిన్, గంజాయి, ఎండీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. 2023లో 106 కేసుల్లో 229 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసి, రూ.53.23 కోట్ల డ్రగ్స్‌ను పట్టుకున్నట్లు ఏఎన్‌సీ వివరించింది.

సునీత.. మరో రబ్డీ అయ్యేనా...?!

- కేజ్రీవాల్ అరెస్టుతో ఆప్‌లో నాయకత్వ లేమి
- ఆయన స్థానాన్ని భార్య భర్తీ చేస్తారని ఊహాగానాలు
- బీజేపీ ముందస్తు విమర్శలు, ఆప్ మౌనం



అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కసారిగా భారీ కుదుపుకు లోనైంది. చాన్నాళ్లుగా ఊహిస్తున్నదే అయినా, ఆప్‌లో నాయకత్వ లేమిని ఈ పరిణామం బట్టబయలు చేసింది. మద్యం కేసులోని ఇతర నిందితుల్లా కేజ్రీవాల్ కూడా దీర్ఘకాలం పాటు జైలుకే పరిమితమైతే ఆప్ పరిస్థితేమిటన్న ప్రశ్నకు బదులుగా ఆయన భార్య సునీత పేరు తెరపైకి వస్తోంది. భర్త స్థానంలో ఆప్ పగ్గాలతో పాటు ఢిల్లీ సీఎం బాధ్యతలనూ ఆమె చేపట్టవచ్చంటూ ఊహాగానాలు విన్పిస్తున్నాయి. సోషల్ మీడియాలో అందుకు అనుకూల, వ్యతిరేక వాదనలు జోరుగా సాగుతున్నాయి...

1997లో నాటి బిహార్ సీఎం లాలూప్రసాద్ యాదవ్ దాణా కుంభకోణంలో జైలుపాలు కావడంతో భార్య రబ్డీదేవిని ముఖ్యమంత్రిని చేసిన వైనం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అచ్చం అలాగే సునీత కూడా రాజకీయ అరంగేట్రం చేయవచ్చంటూ ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ శనివారం ప్రజలనుద్దేశించి పంపిన వీడియో సందేశాన్ని పార్టీ నేతలకు బదులు సునీత చదివి విన్పించడం ఇందుకు సంకేతమంటూ జోరుగా విశ్లేషణలు సాగుతున్నాయి. ఆ సందర్భంగా ఆమె కేజ్రీవాల్ కుర్చీలో కూర్చోవడం యాదృచ్ఛికమేమీ కాదని కూడా అంటున్నారు. అరవింద్, సునీత ఇద్దరూ ఐఆర్‌ఎస్ అధికారులే. శిక్షణ సందర్భంగా ఏర్పడ్డ సాన్నిహిత్యం పెళ్లికి దారితీసింది. ముందుగా కేజ్రీవాల్ పదవికి రాజీనామా చేసి హక్కుల కార్యకర్తగా మారారు. రాజకీయాల్లోకి వచ్చి పార్టీ పెట్టారు. ఆయన సీఎం అయ్యాక సునీత కూడా ఐఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. అప్పుడప్పుడు భర్తతో పాటు పార్టీ ప్రచారంలో పాల్గొనడం, ఆప్ ఎన్నికల విజయాలపై స్పందించడం తప్ప రాజకీయంగా చురుగ్గా ఉన్నది లేదు. పార్టీలో కూడా ఆమె ఎలాంటి పదవిలోనూ లేరు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ సందేశాన్ని ఆప్ నేతలు కాకుండా సునీత చదివి విన్పించడం ఒక్కసారిగా ఊహాగానాలకు తావిచ్చింది. వాటిపై మిశ్రమ స్పందనలూ వస్తున్నాయి. ''సునీతకు పగ్గాలప్పగిస్తే సానుభూతి కూడా ఆప్‌కు కలిసొస్తుంది. కష్టకాలం నుంచి పార్టీని ఆమె బయట పడేస్తారు. కీలకమైన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ లోటును కూడా భర్తీ చేస్తారు'' అని కొందరంటున్నారు. భర్త తరఫున ఆయన సందేశాన్ని విన్పించినంత మాత్రాన రాజకీయాల్లోకి వస్తారని అనుకోలేమని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ''ఆమె కూర్చున్నది సీఎం కుర్చీ ఏమీ కాదు. తమ నివాసంలో కేజ్రీవాల్ మీడియాతో భేటీ అయ్యే కుర్చీలో కూర్చున్నారంతే. దాన్ని అధికార మార్పిడికి సంకేతంగా చూడటం సరికాదు'' అన్నది వారి వాదన. సునీత రాజకీయ ఎంట్రీ వార్తలపై ఆప్ మౌనం వహిస్తోంది. ఆప్ నేతల్లో పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మాత్రమే దీనిపై పెదవి విప్పారు. ఆయన కూడా ఈ విషయమై తనకెలాంటి సమాచారమూ లేదని చెప్పడంతోనే సరిపెట్టారు. బీజేపీ మాత్రం అప్పుడే ముందస్తు విమర్శలతో హోరెత్తిస్తోంది. ఆప్ నాయకత్వ రేసులో చివరికి కేజ్రీవాల్ భార్య కూడా చేరారంటూ కేంద్ర మంత్రి, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు. కేజ్రీవాల్ గతంలో చేసిన వాగ్దానాలను వరుసబెట్టి తుంగలో తొక్కుతుంటే సునీత ఎక్కడున్నారని బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కంగనా రనౌత్, నవీన్ జిందాల్‌కు

బీజేపీ టికెట్లు

- వరుణ్ గాంధీకి మొండిచెయ్యి
- మరో 111 మంది అభ్యర్థులతో బీజేపీ ఐదో జాబితా విడుదల


కంగన


వరుణ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మరో 111 మంది అభ్యర్థులతో అధికార బీజేపీ ఆదివారం ఐదో జాబితా విడుదల చేసింది. కేంద్ర మంత్రి అశ్వినీకుమార్ చౌబే, ఎంపీ వరుణ్ గాంధీకి ఈసారి టికెట్లు నిరాకరించింది. బాలీవుడ్ నటి కంగనా రనౌత్, ప్రఖ్యాత టీవీ నటుడు అరుణ్ గోవిల్ అభ్యర్థిత్వం ఖరారయ్యింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒడిశాలోని సంబాల్‌పూర్ నుంచి, బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా పూరీ నుంచి పోటీ చేయబోతున్నారు. సీనియర్ నేత మేనకా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ నుంచి, పిలిభిత్ నియోజకవర్గంలో వరుణ్ గాంధీ స్థానంలో ఉత్తరప్రదేశ్ మంత్రి జితిన్ ప్రసాద, ఇటీవల బీజేపీలో చేసిన సీతా సోరెన్ జార్ఖండ్‌లోని దుమ్కా స్థానం నుంచి పోటీకి దిగబోతున్నారు. టీవీ సీరియల్ రామాయణంలో రాముడి పాత్ర ధరించిన అరుణ్ గోవిల్ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నుంచి పోటీ చేయనున్నారు. ఆదివారమే బీజేపీలో చేరిన కాంగ్రెస్ మాజీ ఎంపీ నవీన్ జిందాల్ హరియాణాలోని కురుక్షేత్ర నుంచి, కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ బందోపాధ్యాయ పశ్చిమ బెంగాల్‌లోని తమ్లూక్ నుంచి పోటీ చేయబోతున్నారు. కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేరళ బీజేపీ అధ్యక్షుడు కె.సురేంద్రన్ పోటీకి దిగబోతున్నారు. కేంద్ర మాజీ మంత్రి అనంతకుమార్ హెగ్డేకు ఈసారి అవకాశం కల్పించలేదు. తన అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఖరారు చేయడం పట్ల బాలీవుడ్ నటి, జాతీయ అవార్డు గ్రహీత కంగనా రనౌత్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కోసం ఎదురు చూస్తున్నానని ఆదివారం చెప్పారు. ఆమె తన స్వస్థలమైన హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి బీజేపీ టికెట్‌పై పోటీచేయబోతున్నారు. బీజేపీలో చేరడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కంగనా రనౌత్ పేర్కొన్నారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం : 25 : మార్చి : 2024

ఇఫ్తార్ సోమవారం సాయంత్రం 6:34
సహర్ మంగళవారం ఉదయం 4:54
రంజాన్ వేళలు

బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో..










పీపుల్స్‌ప్లాజాలో..



రంగ్ విత్ రాగా...

- సిటీలో హోలీ వేడుకల సందడి షురూ..
- నేడు పలు చోట్ల గ్రాండ్‌గా ఈవెంట్స్

విభిన్న సంస్కృతుల సిటీలో హోలీ పండుగ వచ్చిందంటే చాలు..నగర వీధులన్నీ ఇంద్రధనస్సును తలపిస్తాయి. నగరమంతా ఏకమై తీరొక్క రంగుతో యువత చేసుకునే వేడుకలు అంబరాన్నంటుతాయి. అటు సంప్రదాయ పండుగగానూ... ఇటు యువతను ఆకర్షించే సందడి–సంతోషాలకు నెలవైన హోలీని ఘనంగా జరుపుతారు. ఈసారి ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా పదుల సంఖ్యలో గ్రాండ్ హోలీ ఈవెంట్స్‌కు రంగుల వేదికలను సిద్ధం చేశారు నిర్వాహకులు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నెక్లెస్‌రోడ్డు, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ఆదివారం హోలీ ఈవెంట్స్ అదరగొట్టాయి. కంట్రీక్లబ్‌లో జరిగిన వేడుకల్లో వేలాది మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక సోమవారం పలుచోట్ల హోలీ ఈవెంట్స్ ఏర్పాటు చేయగా..ఇప్పటికే టిక్కెట్లు అమ్ముడుపోయాయి. ఈవెంట్స్‌లో భాగంగా రంగుల కోలాహలమే కాకుండా రాక్ మ్యూజిక్‌కు ఔత్సాహికుల స్టెప్పులతో అదిరిపోనున్నాయి. ఈ సంబరాల్లో కొందరు యువత సేంద్రియ రంగులకే ప్రాధాన్యతనివ్వడం విశేషం. నగరంలోని హైటెక్స్, పీపుల్స్ ప్లాజా, బేగంపేట్ హాకీ స్టేడియం తదితర ప్రాంతాల్లో హోలీ కే రంగ్, కలర్ అండ్ హోలీ ఫెస్టివల్, హోలీ రంగీస్ ఉత్సవ్, హోలీ మహల్లా, రంగ్ బసంత్, హోలీ ఫ్యూజన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కొన్ని ఈవెంట్లలో మ్యూజిక్ బ్యాండ్స్‌తో పాటు సెలబ్రిటీలు సందడి చేయనున్నారు. కాగా గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్ బస్తీలో హోలీ వేడుకలు, కాముని దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులతో కలిసి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

–సాక్షి, సిటీబ్యూరో/ బంజారాహిల్స్





బంజారాహిల్స్‌లో.. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

అయ్యో 'పాప'ం

ఉప్పల్ భగాయత్‌లో 3 నెలల చిన్నారిని వదిలివెళ్లిన వైనం..



ఉప్పల్ భగాయత్‌లో లభ్యమైన బాలిక

ఉప్పల్: ఏమైందో ఏమో తెలియదు కానీ..ముక్కుపచ్చలారని మూడు నెలల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదల్లో వదిలి వెళ్లారు. ఈ ఘటన ఉప్పల్ భగాయత్‌లో చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం భగాయత్‌లో కొందరు మార్నింగ్ వాక్ చేస్తుండగా..రహదారి వెంట చెట్ల పొదల్లో నుంచి పసిపాప ఏడుపు విన్పించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని బాలికను చేరదీసి శిశుమందిర్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. ఆ చిన్నారిని చూసిన స్థానికులు 'ఏ తల్లి కన్న బిడ్డో..ఇలా రోడ్డు పాలైందని' ఆవేదన చెందారు.

కిడ్స్ విత్ మామ్స్



బంజారాహిల్స్: ఒక వైపు పిల్లలు.. మరో వైపు తల్లులు ర్యాంప్‌పై అదరగొట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 25లోని మై స్కూల్ ఇటలీ ది న్యూరో సైంటిఫిక్ యూరోపియన్ ప్రీ స్కూల్‌లో ఆదివారం జరిగిన మహిళా దినోత్సవంలో ఈ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. పాఠశాల ఆవరణలో 'కిడ్స్ విత్ మామ్స్' కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోగొట్టడం, నలుగురిలో ధైర్యంగా మెలగడంలో గురువుతో పాటు తల్లి పాత్ర కూడా కీలకం అనే కాన్సెప్ట్‌తో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ఫౌండర్ చైర్మన్ ప్రసాద్ గారపాటి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 60 మంది చిన్నారులు విభిన్న రకాల దుస్తులు ధరించి ర్యాంప్‌పై హొయలు పోయారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీ అపర్ణ వల్లూరి, నవాబ్ రౌనక్ యార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సాలార్జంగ్ మ్యూజియానికి సెలవు

చార్మినార్: హోలీ వేడుకలు పురస్కరించుకొని నేడు(సోమవారం) సాలార్జంగ్ మ్యూజియానికి సెలవు ఉంటుందని, ప్రజలు సందర్శనకు రావొద్దని అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ మూడింటిపై
సీఎం నజర్

మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాలపై ప్రత్యేక దృష్టి

- గ్రేటర్‌లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన
- నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో భేటీ
- 'అసెంబ్లీ' ఫలితాలను తిరగరాయాలని పట్టు

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేజిక్కినప్పటికీ.. హైదరాబాద్ మహానగర పరిధిలో కనీస ప్రాధాన్యం దక్కకపోవడంతో పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ సీరియస్‌గా పరిగణిస్తోంది. నాలుగింటిలో మూడింటిపై సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.



పార్లమెంట్ స్థాయి నాయకులతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ కూడా మల్కాజిగిరికి పట్నం సునీతారెడ్డి, చేవెళ్లకు సిట్టింగ్ రంజిత్ రెడ్డి, సికింద్రాబాద్‌కు ఎమ్మెల్యే దానం నాగేందర్ అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. అంతే కాదు ఇప్పటికే మాల్కాజిగిరి స్థాయి బాధ్యులతో సమావేశాలు, సమీక్షలు ప్రారంభించగా.. చేవెళ్ల, సికింద్రాబాద్ లోక్‌సభ స్థాయి సమావేశాలు నిర్వహించేందుకు కీలక నేతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



రంగంలోకి దీపాదాస్ మున్షీ..

మహానగరంలో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కూడా రంగంలో దిగారు. ఇప్పటికే మాజీ మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు ప్రస్తుత డిప్యూటీ మేయర్ దంపతులు తదితరులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా, మేయర్ విజయలక్ష్మిని ఇంటికెళ్లి మరీ పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె కూడా కొందరు కార్పొరేటర్లతో కలిసి రెండుమూడు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మరోవైపు నగరానికి చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన విషయం తెలిసిందే. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం పార్టీలో చేరి.. సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దిగుతుండగా, మిగిలిన వారు సైతం వలస కట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారికంగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ముందే ఈ ప్రక్రియ పూర్తి చేసేలా కాంగ్రెస్ అధిష్టానం పావులు కదుపుతోంది.

మల్కాజిగిరిపై ఫోకస్

మల్కాజిగిరి లోక్‌సభ స్థానం సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది. మూడు రోజుల క్రితం పార్లమెంట్ స్థాయి ముఖ్య నేతలో సమావేశమైన ఆయన ఆతర్వాత మేడ్చల్, మల్కాజిగిరి అసెంబ్లీ స్థాయి నేతలతో భేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నిక అభ్యర్థిది కాదు... ముఖ్యమంత్రిది అని ప్రచారానికి దిగే విధంగా దిశదశ నిర్దేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ వేసుకోవాలని,పోలింగ్ బూత్ ల వారీగా పని విభజన చేసుకుని ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీ బాట పట్టాలని, పనిచేసే వారికి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. అభివృద్ధి మంత్రం జపించి నగరంలో అభివృద్ధి కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని ఆదేశించారు.

డీజిల్ దొంగలు!

- కర్నాటక నుంచి తెలంగాణకు అక్రమ రవాణా
- రాష్ట్ర సరిహద్దులో చిన్న ట్యాంకర్లలోకి మార్పు
- హైదరాబాద్‌కు తీసుకొచ్చి తక్కువ ధరకు విక్రయం
- రోజుకు దాదాపు 50 వేల లీటర్ల స్మగ్లింగ్
- ఆరుగురిని పట్టుకున్న సైబరాబాద్ ఎస్‌ఓటీ

సాక్షి, సిటీబ్యూరో: కర్నాటకలో లీటరు డీజిల్ ధర రూ.85.75.. అదే తెలంగాణలో అయితే రూ.97.75. ఇక్కడితో పోల్చితే లీటరుకు రూ.12 వ్యత్యాసం. ఇదే అక్రమ దందాకు ప్రధాన కారణమైంది. దళారులు కర్నాటకలో ఇంధన సంస్థల నుంచి డీజిల్ కొనుగోలు చేసి.. అక్రమంగా తెలంగాణకు తరలించి.. విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా, కర్నాటకలోని చించోలి నుంచి హైదరాబాద్‌కు 15 వేల లీటర్ల డీజిల్‌ను అక్రమంగా తరలిస్తుండగా శంషాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్‌ఓటీ) పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, సోమవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

దాడులు చేసిన పోలీసులు

ఇంధన వాహన యజమానులు సయ్యద్‌గౌస్, రాధాకృష్ణ, రామకృష్ణ, నరేశ్‌గౌడ్ ముఠాగా ఏర్పడ్డారు. కమీషన్ లెక్కన డ్రైవర్లను నియమించుకొని.. కర్నాటక నుంచి తెలంగాణ సరిహద్దు జిల్లాల వరకు డీజిల్ తీసుకొస్తుంటారు. ఆపై చిన్న చిన్న ట్యాంకర్లలోకి మార్చి.. హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈక్రమంలో కర్నాటకలోని చించోలికి చెందిన డ్రైవర్ సద్దాం, సంగారెడ్డిలోని జోగిపేటకు చెందిన మీర్జా ఇస్మాయిల్ బేగ్ అశోక్ లేల్యాండ్ ట్యాంకర్(టీఎస్ 12యూఏ 4491)లో డీజిల్ తీసుకొచ్చారు. గచ్చిబౌలిలోని శంకర్‌హిల్స్‌లో చిన్న ట్యాంకర్ల(టీఎస్ 07 యూపీ 1958, టీఎస్ 09 యూడీ 6877, టీఎస్ 07 యూఎం 7858)లోకి ఇంధనం మార్చుతుండగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు.

రూ.14 లక్షల విలువ గల ఇంధనం స్వాధీనం

సద్దాం, శంకర్(బీదర్), మెదక్ జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్, పాకిరి ఇస్మాయిల్, ఇస్మాయిల్ బేగ్(జోగిపేట), జహీరాబాద్‌వాసి బొబ్బిలి సిద్దప్పను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.14.36 లక్షలు విలువ చేసే 15 వేల లీటర్ల డీజిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ట్యాంకర్ యజమానులు సయ్యద్ గౌస్, రాధాకృష్ణ, నరేశ్ గౌడ్, రామకృష్ణ పరారీలో ఉన్నారు. ఈ కేసును తెలంగాణ సివిల్ సప్లయిస్ విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేస్తోంది.

రోజుకు 50 వేల లీటర్ల రవాణా..

హైదరాబాద్‌కు అక్రమంగా తీసుకొచ్చిన డీజిల్‌ను ఎలాంటి బిల్లులు లేకుండా ఇక్కడి క్రషింగ్ యూనిట్లకు, టిప్పర్ యజమానులకు, పెట్రోల్ బంక్‌లకు సైతం విక్రయిస్తున్నారు. లీటరు డీజిల్ రూ.92–94కు అమ్ముకుంటున్నారు. కల్తీ ఇంధనం కాకపోవడం, రూ.5లు తక్కువకు వస్తుండటంతో వాహన యజమానులు కూడా వీరి వద్దే కొనుగోలు చేస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా ఈ ముఠా అక్రమంగా డీజిల్ దందా నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న డీజిల్ ట్యాంకర్

హ్యాపీ జర్నీ

సిటీలో అందుబాటులోకి కొత్త క్యాబ్ సర్వీసులు

- ఉబర్, ఓలా, ర్యాపిడోలకు పోటీగా మరిన్ని యాప్‌లు
- సర్ చార్జీలు లేకపోవడంతో యూజర్లకు తగ్గుతున్న భారం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో క్యాబ్ సర్వీస్ చార్జీలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా వేసవికాలం వచ్చిందంటే సర్ చార్జీలతో క్యాబ్ ఆధారిత ఆటోలు, కార్లు ప్రయాణికులను హడలెత్తిస్తాయి. ఉదయం, సాయంత్రం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో చార్జీలు రెట్టింపు చేస్తాయి. అయితే, నగరంలో క్యాబ్ సేవలు విస్తరించడంతో ప్రయాణికులపై అదనపు చార్జీల భారం తగ్గింది. మరోవైపు మరిన్ని యాప్ ఆధారిత అంతర్జాతీయ క్యాబ్ సర్వీస్‌లు అందుబాటులోకి రానున్నాయి.

యూజర్లతో పాటు డ్రైవర్లకూ బెనిఫిట్

సాధారణంగా నగరవాసులకు ఉబర్, ఓలా, ర్యాపిడో లాంటి సర్వీసులు మాత్రమే పరిచయం. కానీ, కొద్ది రోజులుగా సరికొత్త యాప్ ఆధారిత క్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. బెంగళూరులో విశేషంగా ఆదరణ పొందిన 'నమ్మ యాత్రి' క్యాబ్ సర్వీస్ ఇప్పుడు నగరంలో 'మన యాత్రి'గా పరుగులు తీస్తోంది. అలాగే యారీ, ఒల్వా, ఓకే చలో.. వంటి క్యాబ్ అగ్రిగేటర్స్ వచ్చేశాయి. దీంతో నగరవాసులు నచ్చిన క్యాబ్‌ను ఎంపిక చేసుకొనే అవకాశం ఉంది. మరోవైపు డ్రైవర్లకు కూడా అదనపు అవకాశాలు లభించడంతో క్యాబ్‌లు, ఆటోలు, ట్యాక్సీ బైక్‌ల సంఖ్య పెరిగింది. రెండేళ్ల క్రితం కేవలం 50 వేల క్యాబ్‌లు, 45 వేలకు పైగా ట్యాక్సీ బైక్‌లుంటే.. ప్రస్తుతం క్యాబ్‌ల సంఖ్య 70 వేలకు పెరిగినట్లు అంచనా ఉంది. అలాగే ట్యాక్సీ బైక్‌లు కూడా 60 వేలు దాటాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 1.4 లక్షల ఆటోలు నమోదయ్యాయి. వీటిలో 80 వేల ఆటోలు వివిధ క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలతో అనుసంధానమయ్యాయి. మరోవైపు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పిక్‌మీ, ఇన్ డ్రైవ్, హోలో క్యాబ్స్, వేమో, రెడ్‌ట్యాక్సీ



లాంటి క్యాబ్‌లు కూడా భవిష్యత్తులో నగరంలో పరుగులు తీసే అవకాశాలున్నాయి.

కొత్త యాప్‌లలో పెరుగుతున్న బుకింగ్స్..

సాధారణంగా ప్రయాణికులు ఇంటి నుంచి లేదా ఆఫీసు నుంచి బయలుదేరే సమయంలో ఉబర్ లేదా ఓలా సర్వీసుల కోసం ప్రయత్నిస్తారు. కానీ, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ కారణంగా సకాలంలో బండి బుక్ అవ్వడం లేదు. ఒక్కోసారి అరగంటకు పైగా ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకటి, రెండు క్యాబ్ అగ్రిగేటర్‌ల నుంచి సర్వీసులు లభించకపోతే ప్రయాణికులు వెంటనే ఇతర సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన క్యాబ్‌లు, ఆటోలు, బైక్ ట్యాక్సీల చార్జీలు కూడా తక్కువగా ఉంటున్నాయి.

దాదాపు రూ.50 తగ్గుముఖం

పంజగుట్ట నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు రద్దీ వేళల్లో కొన్ని క్యాబ్‌లు రూ.250 నుంచి రూ.270 వరకు చార్జీలు విధిస్తుండగా.. కొత్తగా వచ్చిన మన యాత్రి, యారీ లాంటి సర్వీసుల్లో కేవలం రూ.220 వరకు ఉన్నట్లు అంబర్‌పేట్‌కు చెందిన కార్తీక్ తెలిపారు. ప్రస్తుతం హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్లు, కూకట్‌పల్లి, మియాపూర్, ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్తక్యాబ్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద క్యాబ్‌ల కొరతకు పరిష్కారం కూడా లభించినట్లు అయ్యింది. గతంలో ఓలా, ఉబర్ లాంటి సంస్థల వల్ల గిట్టుబాటు కావడం లేదని చాలామంది డ్రైవర్లు ఎయిర్‌పోర్టు నుంచి వాహనాలు నడిపేందుకు నిరాకరించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలు పెరగడంతో డ్రైవర్‌లు కూడా తమకు గిట్టుబాటుగా భావించే క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలతో అనుసంధానమవుతున్నారు.

యాప్‌లోనే బేరాలు...

కొత్తగా అందుబాటులోకి వచ్చిన కొన్ని క్యాబ్ అగ్రిగేటర్‌లు చార్జీలపై బేరమాడే వెసులుబాటు కూడా కల్పించాయి. ప్రయాణికులు ఎంపిక చేసుకున్న గమ్యస్థానానికి సదరు క్యాబ్ సంస్థ విధించే చార్జీలను తగ్గించమని ప్రయాణికుడు అడిగే అవకాశం సైతం ఉంది. ఇదంతా యాప్‌లోనే జరిగిపోతుంది. 'ఓకే చలో' లాంటి సంస్థలు ఈ తరహా వెసులుబాటును ప్రవేశపెట్టాయి. ఓల్వాస్ లాంటి కొన్ని క్యాబ్‌లు దూర ప్రయాణాలకు కూడా క్యాబ్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు. 'ఉబర్, ఓలా లాంటి సంస్థలు కమీషన్ల రూపంలో డ్రైవర్‌లను దోచుకుంటున్నాయి. దీంతో రోజంతా కష్టపడినా రూ.1000 కూడా మిగలట్లేదు. ఇప్పుడు క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలు ఎక్కువ అందుబాటులోకి రావడంతో డ్రైవర్‌ల ఆదాయం కూడా పెరిగింద'ని ఆయన చెప్పారు. కమీషన్లకు బదులు కొత్త క్యాబ్‌లు రీచార్జ్ సదుపాయాన్ని కూడా ప్రవేశపెట్టాయన్నారు. డ్రైవర్లు రూ.100 నుంచి రూ.150 చెల్లించి 8 గంటల పాటు సదరు యాప్‌ను వినియోగించేలా రీచార్జ్ చేసుకోవచ్చని సలావుద్దీన్ తెలిపారు.

సికింద్రాబాద్‌లో పద్మారావును
గెలిపించుకుంటాం



పద్మారావుకు మద్దతు ప్రకటిస్తున్న తలసాని, మహమూద్‌అలీ, మాగంటి, కాలేరు తదితరులు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ధీమా
- కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రకటించారు. పద్మారావుగౌడ్‌ను ఆదివారం మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్‌అలీ, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు సురేశ్ మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజానాయకుడిగా సికింద్రాబాద్ ప్రాంతంలో గుర్తింపు బలహీనవర్గాల నాయకుడు పద్మారావుకు బీఆర్‌ఎస్ లోక్‌సభ టికెట్ ఖరారు చేయడాన్ని తామంతా స్వాగతిస్తున్నామన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే ఎన్నికల మాదిరి భారీ మెజారిటీని రాబట్టుతామన్నారు. కేంద్ర మంత్రిగా ఐదేళ్లు పనిచేసిన బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏవీలేవన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ తరచూ పార్టీలు మారడంతో ప్రజల్లో నవ్వుల పాలయ్యారని విమర్శించారు. బీఆర్‌ఎస్ అధినేత సికింద్రాబాద్ అభ్యర్థిగా పద్మారావుగౌడ్‌ను ప్రకటించడంతో నగర ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఓ అబద్దాలకోరుగా తయారయ్యారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిననాటి నుంచి ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేకపోయారని ఆరోపించారు. నగరంలో కూడా కరెంటు కోతలు తప్పనిసరి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. నగరంలో తమ పార్టీ నుంచి సమర్థవంతమైన ఎమ్మెల్యేలు ఉన్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రజలంతా తమకు కుటుంబ సభ్యుల్లాంటి వారని అందరి సహకారంతో భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, మన్నె కవిత, కంది శైలజ, రాసూరి సునీత, నాయకులు మన్నె గోవర్ధన్, ముఠా జైసింహా పాల్గొన్నారు.

కొరియర్‌లో డ్రగ్స్‌ ఉన్నాయంటూ..

రూ.98 వేలు వసూలు

వెంగళరావునగర్‌: కొరియర్‌లో డ్రగ్స్‌ ఉన్నాయంటూ ఆన్‌లైన్‌లో దుండగులు నగదు కాజేసిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్‌కి చెందిన షఫాలీ అనే మహిళ ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తుంది. ఈనెల 21న ఆమెకు ఆటోమెటెడ్‌ కాల్‌ వచ్చింది. తాము ఫెడెక్స్‌ నుంచి ఫోన్‌ చేస్తున్నామని, మీరు ముంబై నుంచి ఇరాన్‌కు కొరియర్‌ బుక్‌ చేశారని, అందులో 50 ఎల్‌ఎస్‌డీ స్టిక్స్‌ ఉండటంతో ముంబై నార్కోటిక్‌ వారు దానిని బ్లాక్‌ చేశారని చెప్పారు. తాము ఎలాంటి కొరియర్‌ బుక్‌ చేయలేదని చెప్పినా అవతలి వ్యక్తి వినకుండా ముంబై నార్కోటిక్‌ అధికారులతో మాట్లాడాలని ఫోన్‌ కలిపాడు. ఒక వ్యక్తి తాను పోలీస్‌ అధికారి నంటూ ముంబై రావాలంటూ బెదిరించాడు. తాను హైదరాబాద్‌లో ఉంటానని, ముంబై రాలేనని చెప్పినా వినిపించుకోకుండా స్కైప్‌ ద్వారా మాట్లాడాలని బెదిరించడంతో ఆమె స్కైప్‌ ఆన్‌ చేయగా ఆధార్‌కార్డు చూపాలని అడిగాడు. దానిని చూపగా ఎన్నో టెర్రరిస్ట్‌ అకౌంట్స్‌ ఆధార్‌కార్డుతో లింక్‌ అయి ఉన్నట్లుగా తెలిపాడు. తాను నిజాయితీగా మాట్లాడుతున్నానని పర్సనల్‌ విషయాలు తెలుసుకుని ట్రాన్సాక్షన్స్‌ చూపాలన్నారు. వాటిని చూపగా మీ దగ్గరున్న నగదును తాము చెప్పిన మరో అకౌంట్‌కు వేయాలని, ముందుగా రూ.98 వేలు పంపాలని అన్నాడు. ఆ నగదును ముంబై పోలీసులు మళ్లీ మీకు పంపుతారని చెప్పాడు. దాంతో ఆమె నగదును వారికి బదిలీ చేసింది. వెంటనే దానిని బ్లాక్‌ చేశారు. తాను నగదు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శివకోటయ్య (ఫైల్‌)

కాప్రా: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మేడిపల్లి పంచవటి కాలనీకి చెందిన భద్రాది శివకోటయ్య మాజీ సైనిక ఉద్యోగి. ఆదివారం అతను బైక్‌పై వెళుతుండగా హెచ్‌బీకాలనీ ఇండియన్‌ బ్యాంక్‌ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన శివకోటయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ, కూతుళ్లు అదృశ్యం


స్వాతి, యశ్వీత, ఆరాధ్య (ఫైల్‌)

శంషాబాద్‌ రూరల్‌: ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన శంషాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఊట్‌పల్లికి చెందిన కుమ్మరి స్వాతి(28)కి, చౌదరిగూడకు చెందిన రమేష్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరాధ్య(7), యశ్వీత(5) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడు నెలల క్రితం భర్తతో గొడవపడి స్వాతి కుమార్తెలతో పుట్టింటికి వచ్చింది. అక్కడే కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు నిద్ర లేచి చూసే సరికి స్వాతి ఇద్దరు కూతుళ్లు కనిపించలేదు. వారి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరిట ఘరానా మోసాలు

విదేశాలకు తీసుకెళ్తానని.. అమ్మాయిలను నమ్మించి కుచ్చు టోపీ



- 13 ఏళ్లుగా వీసా ప్రాసెసింగ్‌ పేరుతో దగా
- రూ.2.71 కోట్లు స్వాహా
- ఎట్టకేలకు ఆటకట్టించిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: మ్యాట్రిమోనీ సైట్లలో నకిలీ ప్రొఫైళ్లను సృష్టించి, పెళ్లి చేసుకుని అమెరికా తీసుకెళ్తానని మాయమాటలతో మహిళలను నమ్మించి మోసం చేస్తున్న ఘరానా మోసగాణ్ని సైబరాబాద్‌ సైబర్‌ క్రైమ్‌ పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్‌ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌ రమేష్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన పొట్లూరి శ్రీబాల వంశీకృష్ణ ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. బెట్టింగ్‌ చేసేందుకు చేతిలో తగినంత డబ్బు లేకపోవడంతో మ్యాట్రిమోనీల ద్వారా అమాయకులైన మహిళలను మోసం చేసి డబ్బు దండుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో షాదీ.కామ్‌లో రూ.2,500 చెల్లించి గ్లెన్‌మార్క్‌ ఫార్మాలో అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రిషి కుమార్‌ పేరుతో షాదీ.కామ్‌ నకిలీ ప్రొఫైల్‌ను నమోదు చేశాడు. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్‌లో మదీనాగూడకు చెందిన బాధితురాలికి రిషితో పరిచయం ఏర్పడింది. అమెరికాలో ఆన్‌సైట్‌లో ఉద్యోగం చేస్తున్నాని, పెళ్లయిన తర్వాత తనను కూడా విదేశాలకు తీసుకెళ్తానని బాధితురాలిని నమ్మించాడు. అయితే అమెరికాలో పార్ట్‌నర్‌ వీసా రావాలంటే సిబిల్‌ స్కోర్‌ కనిష్ఠంగా 845 స్కోర్‌ ఉండాలని, తనకి 743 మాత్రమే ఉందని, స్కోర్‌ పెరగాలంటే రుణాలు తీసుకోవాలని మాయమాటలతో బాధితురాలిని నమ్మించాడు. మైక్రోసాఫ్ట్‌లో బోర్డు మెంబర్‌నని చెప్పి బాధితురాలి కజిన్‌ నిర్మలను సైతం ఇదే తరహాలో మోసం చేశాడు. ఇరువురి నుంచి క్రెడిట్‌ కార్డులతో వివిధ బ్యాంకులు, యాప్‌ల నుంచి రూ.2.71 కోట్లు రుణం తీసుకున్నాడు. ఆ తర్వాత వారి ఇంటర్నెట్‌ బ్యాంకు ఖాతా వివరాలను తీసుకుని, ఆయా సొమ్మును తన సొంత ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఈ సొమ్ముతో విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు మార్చి 16న సైబరాబాద్‌ సైబర్‌ క్రైమ్‌లో కేసు నమోదు చేసింది. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితుడు వంశీని అరెస్టు చేశారు. అతడి నుంచి పలు బ్యాంకు ఖాతాల పాస్‌ బుక్‌లు, క్రెడిట్‌, డెబిట్‌ కార్డులు, సెల్‌ఫోన్లు, సిమ్‌ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గత 13 ఏళ్లుగా వంశీ కృష్ణ ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతడిపై ఇప్పటివరకు హైదరాబాద్‌, చైతన్యపురి, సైబరాబాద్‌, విజయవాడ, నార్సింగి, రామగుండం, చెన్నైలలో కేసులు నమోదైనట్లు తెలిపారు.

ఆస్ట్రేలియాలో హత్యకు గురైన శ్వేత అంత్యక్రియలు పూర్తి


శ్వేత భౌతికకాయం వద్ద విలపిస్తున్న తల్లి మాధవి

కాప్రా: ఇటీవల ఆస్ట్రేలియాలో హత్యకు గురైన హైదరాబాదీ మహిళ శ్వేత అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. ఆస్ట్రేలియా నుంచి నగరానికి చేరుకున్న శ్వేత మృతదేహాన్ని ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌ బృందావన్‌ కాలనీలోని ఆమె తల్లిదండ్రుల నివాసానికి తరలించారు. కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. శ్వేత భౌతికాయాన్ని కడసారి చూసేందుకు స్థానిక కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం మల్లాపూర్‌లోని వైకుంఠధామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లి..

ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌, బృందావన్‌ కాలనీకి చెందిన మాధగోని బాలిశెట్టిగౌడ్‌, మాధవి దంపతుల కుమార్తె శ్వేత, 2009లో ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లింది. ఆమె హైదరబాద్‌లో ఉండగానే ఆశోక్‌నగర్‌కు చెందిన అశోక్‌రాజును ప్రేమించి పెళ్లి చేసుకుంది. అనంతరం వారు ఆస్ట్రేలియా విక్టోరియా రాష్ట్రంలోని పియాంట్‌ కుక్‌లో స్థిర పడ్డారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కొద్ది రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అశోక్‌ రాజు ఈ నెల 5న రాత్రి భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని పెద్ద డబ్బాలో కుక్కి కారులో తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో విసిరేశాడు, చెత్త డబ్బాలో శ్వేత మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్న విక్టోరియా పోలీసులు భర్తే చంపినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేయాలి

ఫస్ట్‌ బెటాలియన్‌లో 'ఎర్త్‌ అవర్‌'



వెంగళరావునగర్‌: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేయాలని టీఎస్‌ఎస్‌పీ ఫస్ట్‌ బెటాలియన్‌ కమాండెంట్‌ మురళీకృష్ణ అన్నారు. ఇంటర్నేషనల్‌ వరల్డ్‌ ఎర్త్‌డేను పురస్కరించుకుని ఆదివారం యూసుఫ్‌గూడలోని ఫస్ట్‌ బెటాలియన్‌లో ఎర్త్‌ అవర్‌ను పాటించారు. ఈ మేరకు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఫస్ట్‌ బెటాలియన్‌ సిబ్బంది స్వచ్ఛందంగా గంటసేపు లైట్లు బంద్‌ చేశారు. 15 వేల యూనిట్లు ఆదా చేశామని తద్వారా ప్రభుత్వానికి రూ. 1.1 లక్షలు ఆదా చేశామన్నారు. గంట పాటు ఫస్ట్‌ బెటాలియన్‌ యావత్తు విద్యుత్‌ను నిలిపివేయడం అభినందనీయమన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీఎస్‌ఎస్‌పి అధికారులు పాల్గొన్నారు.

ఆటిజంను ఆరంభంలో గుర్తిస్తే మెరుగైన ఫలితాలు



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల చిన్నారుల్లో కనపడుతున్న ఆటిజం సమస్యను ఆదిలోనే గుర్తిస్తే చికిత్స ఫలితాలు బాగుంటాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల మానసిక స్థితిని ముందుగా పసిగట్టడంలో పేరొందిన సేవలు అందించే రైజింగ్‌ సన్‌ చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ తమ సేవా కేంద్రాన్ని హిమాయత్‌ నగర్‌లో ఏర్పాటు చేసింది. ప్రారంభ సందర్భంగా వ్యవస్థాపకురాలు శ్వేతా దేశిరాజు మాట్లాడుతూ ఆటిజం చిన్నారులపై తల్లిదండ్రులు ఆందోళన చెందనక్కర్లేదని వారిలో సానుకూల మార్పులు తెచ్చే థెరపీలు అనేకం అందుబాటులో ఉన్నాయన్నారు. ఆటిజం చిన్నారులకు చికిత్స విషయంలో కుటుంబ సభ్యుల మధ్య సమన్వయం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో పలువురు ఆటిజం చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తోట దయాకర్‌ మృతి తీరని లోటు

లక్డీకపూల్‌: అసోసియేషన్‌ ఆఫ్‌ హెల్త్‌ అండ్‌ హాస్పిటల్‌ అడ్మినిస్ట్రేటర్స్‌ (ఏహెచ్‌హెచ్‌ఏ) గౌరవ సలహాదారులు డాక్టర్‌ తోట దయాకర్‌ మృతి తీరని లోటని ఏహెచ్‌హెచ్‌ఏ అధ్యక్షులు డాక్టర్‌ మార్తా రమేష్‌ అన్నారు. ఆదివారం ఆయన కూకట్‌పల్లిలోని డాక్టర్‌ రాందేవ్‌ రావు ఆసుపత్రిలో తోట దయాకర్‌ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. సంఘం ఫౌండర్‌ మెంబర్‌గా, అధ్యక్షుడిగా దయాకర్‌ అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ మసూద్‌ అహ్మద్‌, ఉపాధ్యక్షులు డాక్టర్‌ సీ నరేందర్‌ కుమార్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ వెల్దుర్తి తదితరులు పాల్గొన్నారు.

టీ హబ్‌తో వెంచర్‌ బ్లిక్‌ ఒప్పందం



సాక్షి, సిటీ బ్యూరో: హెల్త్‌ కేర్‌ స్టార్టప్స్‌కు అవసరమైన అన్ని రకాల మద్దతును అందించేందుకు నగరంలోని టీ-హబ్‌తో అత్యాధునిక వైద్య ఆవిష్కరణలకు పేరొందిన వెంచర్‌ బ్లిక్‌ చేతులు కలిపింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని ఇరు సంస్థలు టీ హబ్‌లో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ప్రకటించారు. వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు, సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం తదితర మార్గాల్లో మద్దతు అందించడం ద్వారా వైద్య రంగంలోని స్టార్టప్స్‌ను బలోపేతం చేయడమే ఒప్పందం లక్ష్యమని ఈ సందర్భంగా వీరు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఐటీ , పరిశ్రమలు వాణిజ్య శాఖల ప్రధాన కార్యదర్శి జయేష్‌ రంజన్‌, వెంచర్‌ బ్లిక్‌ వ్యవస్థాపక సీఈఓ క్రిస్‌ లీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో సత్తాచాటాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రజని
- మహిళా సాధికారతపై అవగాహన పరుగు


రన్‌లో పాల్గొన్న యువత

ఖైరతాబాద్‌: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రజని అన్నారు. ఆదివారం మహిళా సాధికారతపై నెక్లెస్‌ రోడ్డులో ట్విన్‌ సిటీ 10కే రన్‌ 2024 పేరుతో ఏర్పాటు చేసిన 10కే, 5కే రన్‌లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ టి.రజని జెండా ఊపి ప్రారంభించారు. సంజీవయ్య పార్కు నుంచి పీపుల్స్‌ ప్లాజా వరకు ఈ రన్‌లు కొనసాగాయి. గ్లోబల్‌ ఈవెంట్స్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌, వాక్‌ ఫిట్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సెకండ్‌ ఎడిషనల్‌ రన్‌లో యువతీయువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించి సత్తాచాటాలని జస్టిస్‌ రజని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం తల్లిదండ్రులతో పాటు పిల్లలు కూడా ప్రతి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు.



అలరించిన సంకీర్తనా గానం

ఉప్పల్‌ లోని శిల్పారామంలో వాగ్దేవి సంగీత విద్యాలయం నిర్వాహకులు తాడేపల్లి ఉమాశంకర్‌, సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన త్యాగరాజ ఉత్సవంలో పాల్గొని త్యాగరాజ కీర్తనలను భక్తి శ్రద్ధలతో గానం చేస్తున్న ప్రముఖ సంగీత విద్వాంసులు, విద్యార్థులు, ఔత్సాహికులు. – సాక్షి ,సిటీబ్యూరో

లోన్‌ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్‌ చేసినందుకు..

యువతికి లోన్‌యాప్‌ నిర్వాహకుల బెదిరింపులు

- మార్ఫింగ్‌ వీడియోలతో వేధింపులు
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు



అమీర్‌పేట: లోన్‌ కోసం ఆన్‌లైన్‌లో వెతికిన పాపానికి లోన్‌ యాప్‌ నిర్వాహకులు మార్ఫింగ్‌ చేసిన వీడియోలతో బెదిరింపులకు పాల్పడుతుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఆర్‌నగర్‌ ఎస్సై శ్రావణ్‌ కుమార్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేట ధరం కరం రోడ్డులో ఉంటున్న యువతి గత నెల 24న గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి క్రెడిట్‌ స్పార్క్‌లైన్‌ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుంది. తీసుకున్న రుణానికి 50 శాతం వడ్డీ కట్టాలని,తీసుకున్న మొత్తాన్ని వారం రోజుల్లో చెల్లించాలనే నిబంధనలు ఉండటంతో పాటు కేవలం రూ.4 వేలు మాత్రమే వస్తుందని తెలియడంతో నిబంధనలు నచ్చని ఆమె సదరు యాప్‌ను అన్‌ ఇన్‌స్టాల్‌ చేసింది. కాగా అదే రోజు ఆమె ఖాతాలో రెండు దఫాలుగా రూ.4800 క్రెడిట్‌ అయ్యింది. దీంతో ఆమె మళ్లీ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసి అందులో కనిపించిన నంబర్‌కు ఫోన్‌ చేసి తన అనుమతి లేకుండా రుణం ఎందుకు ఇచ్చారని ప్రశ్నించింది.యాప్‌ నిర్వాహకులు ఓ యూపీఐ ఐడీని పంపగా ఆమెకు వచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లించింది. సదరు వ్యక్తి మళ్లీ ఫోన్‌ చేసి రూ.3200 వడ్డీ కూడా చెల్లించాలని చెప్పడంతో విస్తుపోయిన బాధితురాలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించి కాల్‌ కట్‌ చేసింది. అనంతరం యాప్‌ నిర్వాహకులు వేర్వేరు నంబర్ల నుంచి ఫోన్‌ చేసి వేధిస్తున్నారు. డబ్బులు చెల్లించని పక్షంలో మార్ఫింగ్‌ చేసిన వీడియోలను ఆన్‌లైన్‌లో పోస్ట్‌ చేస్తామని బెదిరించారు. అప్పటికే వీడియోలను యువతి తల్లి, మరో స్నేహితురాలికి పంపారు. బాధితురాలు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసిన పోలీసులు కేసును ఎస్‌ఆర్‌నగర్‌కు బదిలీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్ఫింగ్‌ ఫొటోలతో యువకుడికి వేధింపులు

హిమాయత్‌నగర్‌: తమ యాప్‌లలో లోన్‌ తీసుకున్నారని, తాము అడిగిన డబ్బు వెంటనే చెల్లించాలని లేని పక్షంలో మార్ఫింగ్‌ ఫొటోలను సోషల్‌మీడియాలో పెడతామంటూ ఓ వ్యక్తిని సైబర్‌ నేరగాళ్లు వేధిస్తున్నారు. నగర సైబర్‌ క్రైమ్‌ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి గత నెలలో మనీ ప్లస్‌, గ్రాండ్‌ ఫిన్‌, మనీ అండ్‌ జెనీ యాప్‌ తదితర లోన్‌ యాప్‌ల నుండి గుర్తుతెలియని నంబర్ల నుంచి కాల్స్‌ వచ్చాయి. రుణం తీసుకున్నట్లు బ్లాక్‌ మెయిలర్లు బాధితుడిపై తప్పుడు కేసులు పెట్టి రూ.95,500 ట్రాన్స్‌ఫర్‌ చేయాలని బెదిరించారు. మహిళలతో మార్ఫింగ్‌ చేసిన ఫొటోలను పంపి బ్లాక్‌ మెయిల్‌ చేస్తున్నారు. డబ్బు చెల్లించనని చెప్పడంతో మార్ఫింగ్‌ చేసిన చిత్రాలను బంధువులు, స్నేహితులకు పంపడంతో బాధితుడు నగర సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ శివమారుతి తెలిపారు.

శ్రీనిధి డెక్కన్‌ ఎఫ్‌సీ మ్యాచ్‌ 'డ్రా'

సాక్షి, హైదరాబాద్‌: ఐ-లీగ్‌ జాతీయ ఫుట్‌బాల్‌ లీగ్‌లో గెలవాల్సిన మ్యాచ్‌ను హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్‌ ఫుట్‌బాల్‌ క్లబ్‌ (ఎఫ్‌సీ) జట్టు 'డ్రా' చేసుకుంది. చర్చిల్‌ బ్రదర్స్‌తో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 2-2తో 'డ్రా'గా ముగించింది. మ్యాచ్‌ 83వ నిమిషం వరకు 2-0తో ఆధిక్యంలో నిలిచిన శ్రీనిధి జట్టు ఆరు నిమిషాల వ్యవధిలో ప్రత్యర్థి జట్టుకు రెండు గోల్స్‌ సమర్పించుకుంది. శ్రీనిధి జట్టు తరఫున విలియమ్‌ అల్వెజ్‌ ఒలివియెరా (4వ ని.లో), లాల్‌రోమావియా (39వ ని.లో)... చర్చిల్‌ బ్రదర్స్‌ తరఫున స్టెండ్లీ ఫెర్నాండెజ్‌ (83వ ని.లో), లామ్‌గోలెన్‌ (89వ ని.లో) ఒక్కో గోల్‌ చేశారు. 20 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు ప్రస్తుతం 40 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

మల్కాజ్‌గిరి ఎంపీ సీటు సీఎంకు బహుమతిగా ఇవ్వాలి : మంత్రి తుమ్మల

శామీర్‌పేట్‌: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంపీ సీటు గెలిచి బహుమతిగా ఇవ్వాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ ఇన్‌చార్జి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మేడ్చల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి తుమ్మల, ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రానికి దిక్సూచిలా సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లో గెలుపే ఆయన సీఎం కావడానికి తోడ్పడిందన్నారు. ఆయన సొంత నియోజకవర్గం కొడంగల్‌ కంటే మేడ్చల్‌ నియోజకవర్గం తోనే ఎక్కువ అనుబంధం ఉందన్నారు. రాష్ట్రంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ ప్రత్యేకమైనదని, ప్రతి కార్యకర్త ఎంపీ సీటు గెలుపునకు కృషిచేయాలని మంత్రి తుమ్మల కోరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ వజ్రేష్‌యాదవ్‌, జెడ్పీ చైర్మన్‌ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంత్‌రావు, మండలాల, మున్సిపల్‌, కార్పొరేషన్‌ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతులను బెదిరిస్తున్న వ్యక్తులను అడ్డుకున్నందుకు దాడి

వెంగళరావునగర్‌: ఒంటరిగా ఉన్న యువతులను వేధించడమే కాకుండా అడ్డుకున్న యువకులపై పోకిరీలు దాడి చేసిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 23న తెల్లవారుజామున కూకట్‌పల్లికి చెందిన బలరామకృష్ణ తన స్నేహితుడు పీటర్‌సన్‌తో కలిసి బైక్‌పై కూకట్‌పల్లికి వెళుతున్నారు. అమీర్‌పేట వద్దకు రాగానే అక్కడ ముగ్గురు యువకులు ఇద్దరు యువతులను వేధిస్తున్నారు. వారి చీర లాగుతూ మరీ రెచ్చిపోతున్నారు. దీనిని చూసిన బలరామకృష్ణ, పీటర్‌సన్‌ వారిని అడ్డుకున్నారు. దాంతో సదరు యువకులు వారిపై కత్తితో దాడి చేసి వారి వద్ద ఉన్న రూ. 500 నగదు లాక్కున్నారు. బెదిరించి మరో రూ. 800 ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్‌ చేయించుకుని ఆటో ఎక్కి ఉడాయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మధురానగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య


పులి ప్రణీత్‌ తేజ (ఫైల్‌)

బాలానగర్‌: మద్యం మత్తులో ఓ వ్యక్తి స్నేహితుడిని హత్య చేసిన సంఘటన బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. బాలానగర్‌ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన పులి ప్రణీత్‌ తేజ (20) సమీర్‌ స్నేహితులు. ఆదివారం ఇద్దరు కలిసి కాలనీలో మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో సమీర్‌ ప్రణీత్‌ తేజను కత్తితో కడుపులో పొడవటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు దీనిపై సమాచారం అందంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రణీత్‌ తేజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సమస్య పరిష్కారంలో బస్తీవాసుల ఐక్యత భేష్

రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అభినందిస్తున్న బస్తీవాసులు

రహమత్‌నగర్: బస్తీవాసులు ఐక్యమత్యంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను తామే పరిష్కరించుకోవడం అభినందనీయమని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీ వాసుల ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ... నీటి సమస్యను తొలగించేందుకు బస్తీవాసులు తామే సొంతంగా బోర్ వేసుకోవడం వారి ఐక్యతకు నిదర్శనమన్నారు. బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య, వరప్రసాద్, చెన్నయ్య, ఆదినారాయణ, నబిరసూల్, వెంకటేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘డీహైడ్రేషన్‌కు గురికావద్దు’



గ్లూకోన్‌–డి అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్

బంజారాహిల్స్: వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్ సూచించారు. ఆదివారం పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులకు ఆయన గ్లూకోన్‌–డి ప్యాకెట్లను, మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండాలని గ్లూకోన్‌–డి ద్రావణాన్ని తీసుకోవాలని, ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందికి వీటిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఖైరతాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ఆదివారం ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజేఆర్‌నగర్, మారుతీనగర్, మహాభారత్‌నగర్ కాలనీలలో వివేకానంద సేవా సమితి, లేక్ వ్యూ పార్క్ వాకర్స్ సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు. ఇళ్ల మధ్య చెత్తను వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అంటు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సిబ్బందితో పాటు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు ఉదయ్ భాస్కర్, బాక్సర్ అశోక్, సురేందర్, ప్రేమ్‌కుమార్, పరమేష్, గోవింద్, నర్సింగ్, సంజీవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీబీపీ ఎంపీ అభ్యర్థులకు మద్దతు

మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవేంద్రరావు



డీబీపీకి మద్దతు తెలుపుతున్న మాలమహానాడు నేతలు

హిమాయత్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో దళిత బహుజన పార్టీ (డీబీపీ) అభ్యర్థులకు మాలమహానాడు మద్దతు ఇస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవేంద్రరావు తెలిపారు. ఆదివారం సంస్థ ప్రతినిధి బందం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కష్ణ స్వరూప్‌ని కలిసి మద్దత్తు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా.. దళితుల ఐక్యత కోసం, రాజ్యాంగం రక్షణ, అమలు కోసం మనువాద దోపిడీ మాఫియా పాలకులుపై పోరాటం చేస్తూ.. దళితుల రాజ్యాధికారం సాధన కోసం, రాజకీయ పోరాటం చేస్తున్న డీబీపీ అభ్యర్థులకే మాలమహానాడు మద్దుతు ఇస్తున్నామని సంస్థ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్.రాజు ఆదేశాలు మేరకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాజమే నన్ను ప్రజాకవిని చేసింది

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డి



మాట్లాడుతున్న శివారెడ్డి

హిమాయత్‌నగర్: తెలంగాణ ప్రజల గోస, ఆర్థిక వ్యత్యాసాలు, అణచివేత, తిరుగుబాటు ఉద్యమాలను తాను ఐదు దశాబ్దాలుగా క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ కవిత్వాలు, రచనల వైపు తన కలాన్ని పదునెక్కించడం ద్వారానే ప్రజా కవిగా, రచయితగా గుర్తింపు పొందడం సాధ్యమైందని సుప్రసిద్ధ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగిన తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ వార్షిక సాహిత్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మంజీర రచయితల సంఘం అందించిన స్ఫూర్తితో తెరాసం ఆవిర్భవించి, అదే లక్ష్యం, ఆశయంతో పనిచేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, కవి, రచయిత, శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, జంట నగరాల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్‌లతో పాటు పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

300 గజాల ఇల్లు ఉంటే..
ఇంకుడుగుంత తప్పనిసరి

- సర్వే చేపట్టిన జల మండలి సిబ్బంది
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బృందాలు
- ఇంకుడుగుంత లేకుంటే తగిన చర్యలు
- ముందు అవగాహన.. తర్వాత జరిమానా..



నీటి పంపిణీ వ్యవస్థను పరిశీలిస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: వేసవిలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతోంది. ఇప్పుడే ఇలా ఉంటే నిండు వేసవిలో ఎలా ఉంటుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఎండల తీవ్రత నేపథ్యంలో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్‌వెల్స్‌లో నీరు ఇంకిపోయి ప్రజలు ఎక్కువ శాతం జల మండలి సరఫరా చేస్తున్న నీటినే వినియోగించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవి తీవ్రతకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని జలమండలి గుర్తించింది. ఇటీవలే హైకోర్టు ఇంకుడుగుంతలపై సీరియస్‌గా వ్యాఖ్యలు చేసి వీటిని ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో జలమండలి ఉన్నతాధికారులు ఇందుకోసం ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలని సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసింది.

- జలమండలి–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, తట్టిఖానా, ఎర్రగడ్డ, ఎల్లారెడ్డిగూడ, ఫతేనగర్, ఎస్‌ఆర్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, సోమాజిగూడ, వెంగళరావునగర్ తదితర 12 జలమండలి సెక్షన్ల పరిధిలో 300 గజాల స్థలంలో ఇళ్లు ఉంటే ఆ ఇంటికి తప్పనిసరిగా 2012 జీహెచ్‌ఎంసీ బిల్డింగ్ రూల్స్ చట్టం ప్రకారం ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలి. అయితే చాలా నివాసాల్లో, అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతలు పనిచేయడం లేదు. వర్షపునీటిని ఒడిసి పట్టుకుంటే వేసవిలో నీళ్ల సమస్య ఉండదని భావించిన అధికారులు ఆ మేరకు ఇంకుడు గుంతలపై దృష్టిసారించారు. గత రెండు రోజులుగా 300 గజాల ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12 బృందాలు రంగంలోకి దిగాయి.
- వీరు ప్రతి ఇంటిని సందర్శించి అక్కడ ఇంకుడుగుంత ఉందో లేదో చూస్తారు.
- లేకపోతే ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూచిస్తారు.
- ఇంకుడుగుంత ఉండీ పనిచేయకపోతే వారికి అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- ఆ ఇంకుడుగుంతకు సంబంధించి ఫొటోను తీసుకుని వారికి ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- ఇంకుడుగుంతకు మరమ్మతులు చేపట్టి వచ్చే వర్షాకాలంలో నీళ్లు వృథాపోకుండా చూసుకునేలా అవగాహన కలిగించి నీటి ప్రాధాన్యతను తెలియజేస్తారు.
- తాము చెప్పిన తర్వాత కూడా ఇంకుడుగుంత ఏర్పాటు చేయకున్నా, అప్పటికే ఉంటే దానిని వినియోగంలోకి తేకున్నా వారికి నోటీసులు జారీ చేస్తారు.
- నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్పందించకుంటే జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి సంబంధిత యజమానికి జరిమానా విధిస్తారు. జరిమానా విధించినా ఇంకుడుగుంత వినియోగంలోకి తీసుకురాకుంటే వారి నల్లా కనెక్షన్‌ను కట్ చేయడానికి వెనుకాడరు.
- ఇలా ఇంకుడుగుంతలపై జలమండలి అధికారులు ఫోకస్ పెట్టి 300 గజాల స్థలంలో ఇళ్లు కట్టిన ప్రతిఒక్కరికీ ఈ వానకాలం నాటికి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నీటి సరఫరాపై నిరంతర తనిఖీలు..

వేసవి మూడు నెలల పాటు రోజూ జీఎం, డీజీఎం, మేనేజర్లు, లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరా వేళల్లో పర్యటించి మంచి నీటి సరఫరాను తెలుసుకోవాలి. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధి కిందికి వచ్చే 12 సెక్షన్ల పరిధిలో ఉన్న 90 వేల డొమెస్టిక్ కనెక్షన్లను ఈ మూడు నెలల పాటు రోజూ సంబంధిత అధికారులు పర్యటించి నీటి సరఫరాను సమీక్షిస్తారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఈ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.



ఇంకుడు గుంతల వివరాలు సేకరిస్తున్న జలమండలి సిబ్బంది

నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు



వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించి వాటిని అమలుచేస్తున్నాం. ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మా పరిధి కిందికి వచ్చే 12 సెక్షన్ల పరిధిలో ఒక వైపు ఇంకుడుగుంతలపై సర్వే నిర్వహిస్తుండగా, మరోవైపు నీటి సరఫరాపై క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ఎక్కడైనా సమస్య తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావవచ్చు. మా పరిధిలో 23 రిజర్వాయర్లు ఉండగా 90 వేల కనెక్షన్లు ఉన్నాయి. 250 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.ప్రస్తుతం ఎలాంటి నీటి సమస్యా లేదు. రిజర్వాయర్లలో తగినన్ని నీరు ఉంది. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు. నీటిని వృథా చేయవద్దు.

– హరిశంకర్, జలమండలి జీఎం

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తోనే సాధ్యమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని మళ్లీ గెలుపించుకొని సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి మరింత పాటుపడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన హిమాయత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం కోట్లాది రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిజిటల్ లైటింగ్‌ను, సంజీవయ్య పార్క్‌లో డిజిటల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత కిషన్‌రెడ్డికే సాధ్యమని శ్రీధర్ పేర్కొన్నారు.

అభినందన



ఖైరతాబాద్: బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పద్మరావు గౌడ్‌ను ఆదివారం ఖైరతాబాద్‌కు ఆ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు గజ్జల ఆనంద్, శ్రీనివాస్, రాకేష్‌లు పద్మరావు గౌడ్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. పద్మరావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు.

ఘనంగా ‘మట్టల ఆదివారం’



బంజారాహిల్స్ ఎన్టీటీ నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



రహమత్‌నగర్‌లో మట్టలను ఊరేగిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: జెరూసలేంకు ప్రప్రథమంగా ఏసు క్రీస్తు వచ్చే సమయంలో ఆయనకు స్వాగతం పలికేందుకు నిర్వహించే మట్టల ఆదివారం కార్యక్రమాన్ని బంజారాహిల్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చి, గాస్పెల్ టీవీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రైస్తవులు షారోన్ చర్చి నుంచి బంజారాహిల్స్ మీదుగా పెద్ద ఎత్తున మట్టలు, జెండాలు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని కూడా మట్టల ఆదివారంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చి పాస్టర్ ఎం.ప్రభుదాస్ తెలిపారు. కార్యక్రమంలో గాస్పెల్ టీవీ అధినేత శామ్యూల్, ఎమ్మెల్సీ రాజేష్, పీసీసీ సెక్రటరీ ఎజికల్ తదితరులు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో...

రహమత్‌నగర్: రహమత్‌నగర్ బాప్టిస్ట్ చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రహమత్‌నగర్ వీధుల్లో ఏసు కీర్తనలు ఆలపిస్తూ మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ సుందర్ కుమార్ మాట్లాడుతూ... ప్రభువైన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయం అన్నారు. చర్చి ప్రతినిధులు సి.సాల్మాన్, పీటర్ పాల్, పీఎల్ ప్రకాశం, అలెగ్జాండర్, అరుణ్ కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో...

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని లెమెన్స్ ఎవాంజెలికల్ ఫెలోషిప్ (ఎల్‌ఈఎఫ్) చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. చిన్నారులు తాటి మట్టలు పట్టుకొని వాటిని ఊపుతూ గీతాలు ఆలపించారు. అనంతరం దైవ సేవకులు బ్రదర్ అబ్రహం మట్టల ఆదివారం ప్రత్యేకతను ఆంగ్లంలో బోధించగా బ్రదర్ జేకబ్ రాజ్ తెలుగులో అనువదించారు. వేడుకలో వందలాది మంది చిన్నారులు పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారం.. మాజీ ప్రేమికుడిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా యువకుడిపై దాడి చేసి గాయపరచిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటున్న నితిన్, రహమత్‌నగర్‌లో ఉంటున్న ఓ యువతి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత ఏడాది ఆ యువతి తన ప్రియుడి ఇంటికి వెళ్లి వారి పెళ్లి విషయమై మాట్లాడగా వారు రెండేళ్ల తర్వాత చేస్తామని చెప్పారు. అయితే అక్టోబర్‌లో నిథిన్‌కు రోడ్డు ప్రమాదం జరిగి కంటికి గాయమైంది. దాంతో ఆ యువతి పెళ్లి విరమించుకుంది. ఇదిలా ఉండగా బాబీ అనే మరో యువకుడిని ప్రేమించింది. ఈ నెల 21న బాబీ ఇన్‌స్టాగ్రాంలో నిథిన్‌కు మెసేజ్ పంపాడు. తనతో మాట్లాడాలని చైతన్యపురికి పిలవగా అతను వెళ్లాడు. అక్కడ నిథిన్‌తో గొడవ పడి బాబీ అతనిని కొట్టాడు. మరోసారి 22న మరోసారి ఫోన్‌లో పంజగుట్టకు రమ్మని తెలియజేయగా బాబీ తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. అప్పటికే అక్కడ 30 మందితో సిద్ధంగా ఉన్న బాబీ మరోసారి నిథిన్‌పై దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో గాయపడిన నిథిన్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

భారీగా మద్యం స్వాధీనం

బంజారాహిల్స్: పార్లమెంట్ ఎన్నికల ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగా లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నం.11లో బంజారాహిల్స్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఓ ఆటోలో పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లతో కూడిన డబ్బాలను గుర్తించారు. తనిఖీలు చేయగా ఆ డబ్బాలలో పెద్ద ఎత్తున మద్యం గుర్తించారు. బంజారాహిల్స్ రోడ్ నం.11లోని ఎస్‌వీ లిక్కర్ మార్ట్‌లో రూ. 2,30,000 విలువ చేసే మద్యాన్ని కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నట్లుగా తనిఖీలలో తేలింది. గౌరీశంకర్ కాలనీకి చెందిన ప్రకాశ్ మహంతి అనే వ్యక్తి ఈ మద్యాన్ని కొనుగోలు చేసి నిలువ ఉంచుకొని ఎన్నికల సమయంలో అమ్ముకునేందుకు తీసుకువెళ్తున్నట్లుగా విచారణలో వెల్లడయింది. ప్రకాశ్ మహంతితో పాటు ఎస్‌వీ లిక్కర్ మార్ట్ మేనేజర్, యజమానిపై బంజారాహిల్స్ పోలీసులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యంలో విషాదం

వేడి నీటి తొట్టిలో పడి బాలికకు తీవ్ర గాయాలు

రహమత్‌నగర్: ప్రమాదవశాత్తు వేడి నీటి తొట్టిలో పడి చిన్నారికి గాయాలైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్‌కు చెందిన జహంగీర్ కుటుంబ సభ్యులతో కలిసి హెచ్‌ఎఫ్‌నగర్‌లో జరిగిన ఓ శుభకార్యానికి శనివారం హాజరయ్యాడు. ఈ క్రమంలోనే అతని కుతూరు జోయ ఫాతీమా(7) ఆడుకుంటూ ఇంట్లో వేడి నీటి తొట్టిలో పడింది. దీంతో బాలిక శరీరం కాలి పోయింది. బాలికను హుటాహుటిన రెయిన్‌బో ఆస్పత్రికి తరలించి చికిత్సలను అందిస్తున్నారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత ఈ–సిగరెట్ల స్వాధీనం

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా పోలీసుల కళ్లుగప్పి కస్టమర్లకు నిషేధిత ఈ–సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నం.12లోని రాయల్ కుంజ్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నం–102లో కొంతకాలంగా స్మోక్‌బార్ కొనసాగుతుంది. స్మోక్‌బార్ యజమాని సల్మాన్ జుబేర్ కొంతకాలంగా పోలీసుల కళ్లుగప్పి నిషేధిత ఈ–సిగరెట్లను విక్రయిస్తున్నాడు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు స్మోక్ బార్‌పై దాడులు చేసి వివిధ ఫ్లేవర్లలో విక్రయిస్తున్న నిషేధిత ఈ–సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. యజమాని సల్మాన్ జుబేర్ పెర్విన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ రంగ సంస్థపై కేసు నమోదు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వేళలు పాటించకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేయడమే కాకుండా ఇద్దరు డ్రైవర్లు, నిర్మాణ రంగ సంస్థపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్‌ఎస్‌జీ అవినాష్‌బాబు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లో ఉదయం 11 గంటల సమయంలో వాహన తనిఖీలు చేస్తుండగా నిర్ణీత వేళలను ఉల్లంఘించి రెండు భారీ వాహనాలను ఆపారు. ఈ రెండు లారీలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వస్తుండగా వీటిని సీజ్ చేశారు. ఈ లారీ నడుపుతున్న రఫీక్, జెస్సీముద్దీన్, లారీల యజమాని అబ్దుల్ మొహిజ్, ఈ లారీలు పనిచేస్తున్న వైవో బిల్డర్స్‌పై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 188, 279, 341, ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవినాష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ భవన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా రెండు రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాలు తిరుగుతుండగా వీటిపై కూడా బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ ప్రియురాలిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: ప్రేమించిన యువతితో కొంతకాలం తిరిగి అనంతరం విడిచి పెట్టడమే కాకుండా ఆమెను తీవ్రంగా వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రహమత్‌నగర్‌లో నివసించే ఒక యువతి జూనియర్ ఆర్టిస్టుగా విధులు నిర్వహిస్తుంది. హనుమకొండ ప్రాంతానికి చెందిన దురిశెట్టి నితిన్ అసిస్టెంట్ కెమెరామెన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. గతంలో ఇరువురికి పరిచయమై కొంతకాలం ప్రేమించుకున్నారు. అనంతరం ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. గత ఏడాది డిసెంబర్ 9వ తేదీ ఎవరికి వారు విడిగా ఉంటున్నట్టుగా, ఒకరి పనిలో ఇంకొరు తల దూర్చవద్దని కూడా అగ్రిమెంట్ రాసుకున్నారు. అయితే ఆ అగ్రిమెంట్‌పై కట్టుబడి ఉండకుండా నితిన్ ఆమెను వేధించడం ప్రారంభించాడు. ఈ నెల 19న అర్ధరాత్రి ఫోన్ చేసి దుర్భాషలాడుతూ ఇన్‌స్టాగ్రాంలో అసభ్యంగా ఫొటోలు పెట్టాడు. వాటిని కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులకు సైతం పంపి విమర్శిస్తున్నాడు. ఇది చాలదన్నట్టుగా తన వద్ద రూ. 5 లక్షలు అప్పుగా తీసుకున్నట్టుగా తప్పుడు ఫిర్యాదు చేశాడు. తనను చంపుతానని బెదిరింపులకు గురి చేస్తున్నాడు. అతని వేధింపులకు తాళలేక యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అవినీతి నిర్మూలనకు యువత రాజకీయాల్లోకి రావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహా



బహుమతులు ప్రదానం చేస్తున్న నర్సింహా

హిమాయత్‌నగర్: దేశంలో అవినీతి, అక్రమాలను నిర్మూలించేందుకు ప్రజాసేవే లక్ష్యంగా యువత రాజకీయాలకు రావాలని, చెడు వ్యసనాలను దూరం చేసేందుకు, ఆరోగ్యవంతులుగా ఉండేందుకు క్రీడలు అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నర్సింహా పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడోత్సవాల ముగింపు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహా చెస్, క్యారంబోర్డ్, ఖోఖో, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా అవసరమని, గ్రామీణ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించి అధిక నిధులు కేటాయించాలన్నారు. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైన సమయంలో, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏ ఐ వై ఎఫ్ క్రీడలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని వారు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఆర్.బాలకష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజిద్, అనిల్, మహేష్, భాస్కర్, శరత్, సజ్జద్ పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బంజారాహిల్స్: అపోలో ఆస్పత్రిలో ఆనందవల్లి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న తృతీయ పుష్కరోత్సవం, 36వ వార్షికోత్సవాల్లో చివరి రోజు శ్రీనివాసునికి మహా కుంభప్రోక్షణ, పూర్ణాహుతి–శ్రీ పుష్పయాగాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పద్మభూషణ్ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాన్ని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి దంపతులు తిలకించారు. ముఖ్య అతిథులుగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్ పర్సన్ ప్రీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్పర్సన్ శోభన కామినేని, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునీతారెడ్డి; అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు, సముద్రాల శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా...

మేకా శరణ్ లావాదేవీలపై ప్రశ్నలు

రేపు రౌజ్ అవెన్యూ కోర్టులో కవితను ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విచారణ కొనసాగుతోంది. ఆదివారం ఎనిమిదో రోజూ కవితను ఈడీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా తెరపైకి వచ్చిన మేనల్లుడు మేకా శరణ్ వ్యాపార లావాదేవీలకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. విచారణకు సహకరించాలని వాస్తవాలు వెల్లడించాలని కవితకు సూచించినట్లు సమాచారం. మద్యం విధానానికి సంబంధించిన అంశాలు శరణ్ ఫోనులో ఎందుకున్నాయి? ఈ కుంభకోణంలో శరణ్ ప్రమేయం ఏంటి? అనే అంశాలపై కవిత నుంచి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కస్టడీ అనంతరం ఈ నెల 26న రౌజ్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు కవితను ప్రవేశపెట్టనున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమ్మరిపల్లి జంగయ్య (50)కు కొంత పొలం ఉంది. దాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యక్తిగత అవసరాల కోసం జంగయ్య పొలాన్ని అదే గ్రామానికి చెందిన నర్సింహులుకు ఏజీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేశారు. ఆ భూమిని తిరిగి ఇవ్వాలని జంగయ్య కోరగా ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో దీనిపై చాలాసార్లు పంచాయితీలు పెట్టారు. పంచాయితీలో జంగయ్య పేరు మీదకు మార్చి ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన జంగయ్య శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

గురుకుల బోర్డుకు కొత్త సారథులు!

కన్వీనర్‌గా ఉన్న బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బదిలీతో మార్పులు అనివార్యం

- మల్లయ్య బట్టు స్థానంలో కార్యదర్శిగా బి.సైదులు నియామకం
- సైదులు అందరికంటే సీనియర్ కావడంతో చైర్మన్ మస్రత్ ఖానమ్‌కు స్థానచలనం?
- ఈ నేపథ్యంలోనే చైర్మన్, కన్వీనర్‌గా కొత్తవారికి చాన్స్!
- త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ)లో మార్పులు జరగనున్నాయి. కీలకమైన చైర్మన్, కన్వీనర్ పోస్టుల్లో త్వరలోనే కొత్తవారిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి, టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్‌గా ఉన్న మల్లయ్య బట్టును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీచేసింది. సొసైటీ నూతన కార్యదర్శిగా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులను నియమించింది. దీంతో గత వారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్‌గా వ్యవహరించిన మల్లయ్య బట్టు ఆ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవడంతో కన్వీనర్ సీటు ఖాళీ అయ్యింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అత్యంత కీలకంగా వ్యవహరించే కన్వీనర్ సీటు ఖాళీ కావడంతో బోర్డు పరిధిలో పలు నియామకాలకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో పడిపోయాయి. ఈ క్రమంలో వాటి భర్తీతో పాటు ఇతర కీలక నిర్ణయాలు తీసుకోవాలంటే బోర్డుకు కన్వీనర్ నియామకం అనివార్యం కానుంది.

బోర్డు సభ్యులుగా సొసైటీల కార్యదర్శులు

రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీని వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా టీఆర్ఈఐఆర్‌బీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్)లతో పాటు విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఆర్ఈఐఎస్)ల కార్యదర్శులు బోర్డులో సభ్యులుగా ఉంటారు. గురుకుల సొసైటీల్లో సీనియర్ కార్యదర్శి ఈ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో సభ్యుడు కన్వీనర్‌గా ఉంటారు. బోర్డు సభ్యుల అంగీకారం, ప్రభుత్వ ఆమోదంతో సొసైటీల్లోని అదనపు కార్యదర్శుల్లో ఎవరినైనా కూడా కన్వీనర్/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించుకోవచ్చు.

ప్రస్తుత చైర్మన్‌గా ఆయేషా మస్రత్ ఖానమ్

ప్రస్తుతం బోర్డు చైర్మన్‌గా మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానమ్ ఉన్నారు. కన్వీనర్‌గా కొనసాగిన మల్లయ్య బట్టును టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలోనే ఆయన అక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా బి.సైదులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న గురుకుల సొసైటీ కార్యదర్శుల్లో ఈయనే సీనియర్ అధికారి. బోర్డు చైర్మన్‌గా సీనియర్ అధికారిని నియమించాల్సి ఉండటంతో ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మస్రత్ ఖానమ్‌కు కూడా స్థాన చలనం తప్పదని అధికారులు అంటున్నారు. కన్వీనర్ పోస్టు కూడా ఖాళీ కావడంతో చైర్మన్, కన్వీనర్ రెండు పోస్టుల్లోనూ కొత్త వారినే నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బోర్డు అధికారులు ఒకట్రెండు రోజుల్లో సొసైటీ కార్యదర్శుల సీనియార్టీ, తదితర పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలు పరిశీలించిన తర్వాత చైర్మన్, కన్వీనర్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

పీవీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి

నాగోలు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ఎంతో సంతోషకరమని కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం, మహిళా దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేణు గోపాలచారి మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ పీవీ నరసింహారావు స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా సురభి వాణీదేవి, కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బసవరాజు శ్రీనివాస్, వైష్ణవి ప్రసాద్‌లు మాట్లాడారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించి డాక్టర్ సూరి, అనంతలక్ష్మి, మాందాత, నిప్పాని రుక్మిణిలను సత్కరించారు.



ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

గ్యాంగ్‌స్టర్ నయీం కేసులోనూ తిరుపతన్న

ఫోన్ ట్యాపింగ్ అధికారులిద్దరూ హోం శాఖ మెడల్స్ పొందినవారే..

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు అరెస్టు చేసిన మేకల తిరుపతన్న పేరు 2017లోనూ ఓసారి వివాదాస్పదంగా వార్తల్లోకి ఎక్కింది. షాద్‌నగర్‌లో 2016లో జరిగిన గ్యాంగ్‌స్టర్ నయీం సంబంధిత కేసుల దర్యాప్తు కోసం అప్పట్లో ఓ సిట్‌ను వేశారు. నయీం వ్యవహారాలను అన్ని కోణాల్లోనూ, ఆద్యంతం ఆరా తీసిన సిట్ అధికారులు అతడితో అంటకాగిన దాదాపు 40 మంది పోలీసులను గుర్తించారు. ఈ మేరకు 2017లో అప్పటి డీజీపీ అనురాగ్ శర్మకు సిట్ నివేదిక ఇచ్చింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న డీజీపీ ఐదుగురిని సస్పెండ్ చేస్తూ, మిగిలిన వారిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ 2017 మే 12న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విచారణ ఎదుర్కొన్న అధికారుల్లో అప్పట్లో డీఎస్పీ హోదాలో ఉన్న మేకల తిరుపతన్న కూడా ఉన్నారు. ఈ కేసు నుంచి బయటపడిన తిరుపతన్న పదోన్నతి సైతం పొందారు. ప్రస్తుతం అదనపు ఎస్పీ హోదాలో ఉన్న తిరుపతన్న గతంలో పంజాగుట్ట ఏసీపీగానూ పని చేశారు. ఇటీవలే హైదరాబాద్ నగర భద్రత విభాగానికి (సీఎస్‌డబ్ల్యూ) అదనపు డీసీపీగా బదిలీపై వచ్చారు. తిరుపతన్నకు గత ఏడాది స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి యూనియన్ హోం మినిస్ట్రీ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ లభించింది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి అదనపు ఎస్పీగా పనిచేస్తున్న నాయిని భుజంగరావు గతంలో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఈయనకూ 2021లో యూనియన్ హోం మినిస్ట్రీ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్వెస్టిగేషన్ లభించింది.

ట్యాపింగ్ కేసులో ముగ్గురికి రిమాండ్

▶ మొదటి పేజీ తరువాయి

మందికి సిట్ నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచింది. ఈ కేసులో ప్రధానాంశం ఫోన్ ట్యాపింగ్ కావడంతో 'టెలిగ్రాఫిక్ యాక్ట్'ను కూడా జోడించాలని అధికారులు నిర్ణయించారు.

ముగ్గురి కోసం లుకౌట్ సర్క్యులర్

పంజగుట్టలో నమోదైన ఈ ట్యాపింగ్ కేసులో శనివారం వరకు ప్రణీత్‌రావు మాత్రమే నిందితుడిగా ఉండేవారు. సిట్ దర్యాప్తు, ప్రణీత్‌రావు వెల్లడించిన అంశాల ఆధారంగా భుజంగరావు, తిరుపతన్నలను కూడా నిందితులుగా చేర్చినట్టు సిట్ కోర్టుకు తెలిపింది. వీరితోపాటు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాదాకిషన్‌రావు, ఓ మీడియా సంస్థ అధి పతిని కూడా నిందితులుగా చేర్చినా.. విదేశాల్లో తలదాచుకున్నారు. దీంతో ఆ ముగ్గురి కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులకు అధికారులు లుకౌట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు.

వ్యక్తిగత జీవితాలూ 'ట్యాప్'..

విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్లతో ల్యాండ్‌లైన్లు, సెల్‌ఫోన్ కాల్స్‌తోపాటు సోషల్‌మీడియాను ట్యాప్ చేసిన 'ప్రభాకర్‌రావు టీమ్'.. బెదిరింపు వసూళ్లకు పాల్పడటంతోపాటు కొందరి వ్యక్తిగత జీవితాలపైనా నిఘా పెట్టినట్టు తెలిసింది. హైప్రొఫైల్ వ్యక్తుల అంతర్గత వ్యవహారాలను ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని.. వారికి ఆ వాయిస్‌లు, సందేశాలు చూపి, భారీ డిమాండ్లు నెరవేర్చుకున్నట్టు సమాచారం. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులతోపాటు కొందరు పోలీసు ఉన్నతాధికారులు, బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు, కీలక వ్యక్తులపైనా ట్యాపింగ్ నిఘా పెట్టినట్టు తెలిసింది.

ప్రభాకర్‌రావుకు ఊహించిన షాక్..

ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్ రావు నుంచి ఇక్కడి ఓ పోలీసు ఉన్నతాధికారికి కాల్ వచ్చినట్టు తెలిసింది. ఇప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు మీరు ఎలా ట్యాపింగ్ కేసులో దూకుడుగా వెళ్తున్నారో.. అప్పటి ప్రభుత్వ ఒత్తిడితోనే తాను ట్యాపింగ్‌లో జోక్యం చేసుకున్నానని ఆయన చెప్పినట్టు సమాచారం. మనం మనం పోలీసులమేనని, కేసు దర్యాప్తు పేరుతో ఇళ్లలో సోదాలు చేయడమేంటని కూడా ప్రభాకర్‌రావు పేర్కొన్నట్టు తెలిసింది. తాను వైద్యం కోసమే అమెరికా వచ్చానని, జూన్ లేదా జూలైలో తిరిగి వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పినట్టు సమాచారం. ఇదంతా విన్న సదరు ఉన్నతాధికారి.. ''మీరు ఏం చెప్పాలనుకున్నా, ప్రశ్నించాలనుకున్నా నా అధికారిక మెయిల్ ఐడీకి ఈ–మెయిల్ పంపండి. అప్పుడే నేను ఎలాంటి సమాధానం ఇవ్వాలో అలాంటి సమాధానం ఇస్తా..'' అని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీనితో ప్రభాకర్ రావు మౌనంగా ఫోన్ కట్ చేసినట్టు సమాచారం.

ట్యాపింగ్ కేసులో ఇద్దరు కీలక నేతలు?

భుజంగరావును శనివారం అరెస్టు చేసిన సిట్ అధికారులు.. ఆయన నుంచి ఫోన్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆయనను విచారించిన సమయంలో, ఉపకరణాల విశ్లేషణలో సిట్ అధికారులకు కీలక సమాచారం లభించినట్టు తెలిసింది. ట్యాపింగ్ చేయాల్సిన టార్గెట్ల వివరాలు ఆయనకు నేరుగా ఓ ముఖ్య నేత నుంచి వచ్చినట్టు తేలింది. డీఎస్పీ ప్రణీత్‌రావుకు మరో కీలక నేత నుంచి ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఆ నేతల పాత్రకు సంబంధించి పలు ఆధారాలు లభించిన నేపథ్యంలో.. కేసులో వారి పేర్లను చేర్చాలని సిట్ నిర్ణయించినట్టు తెలిసింది. తొలుత సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయాలని, వారి స్పందన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం.

సిట్ దర్యాప్తునకు కొన్ని ఆటంకాలు!

అక్రమ ట్యాపింగ్ వ్యవహారం మూలాలు బయటపడాలన్నా, సూత్రధారులను తేల్చాలన్నా సాంకేతిక ఆధారాలు కీలకం. అందుకే వాటిని సేకరించడానికి సిట్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే ఓ నిఘా విభాగం నుంచి నగర పోలీసులకు సరైన సహకారం అందట్లేదని తెలిసింది. అందుకే దర్యాప్తు జాప్యం అవుతోందని సమాచారం. కేసు దర్యాప్తు కోసం అధికారులు అడిగిన పలు సున్నిత అంశాలు తెలపడానికి, ఉపకరణాల విశ్లేషణ కోసం సదరు నిఘా విభాగం అధికారి అనుమతించట్లేదని తెలిసింది. పోలీసులు వచ్చి తమ విభాగంలో అంశాలన్నీ పరిశీలిస్తే.. బయటి ప్రపంచానికి తెలిసిపోతాయని, తద్వారా వ్యూహాలు దెబ్బతింటాయని చెప్తున్నట్టు సమాచారం. భవిష్యత్తులో జాతీయ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాము కీలక ఆపరేషన్లు చేపట్టలేమని సదరు అధికారి పేర్కొంటున్నట్టు తెలిసింది. దీంతో సిట్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

నగర వార్తలు


ఏప్రిల్ 28న అఖిల భారత సగర మహాసభ ఎన్నికలు



అడ్‌హక్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అఖిల భారత సగర మహాసభ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్లు నూతనంగా ఏర్పాటు చేసిన అడ్‌హక్ కమిటీ నిర్ణయించింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్ గణపతి ప్రకాష్‌రావు సగర, వైస్ చైర్మన్ శ్రీరాల శ్రీరాములు సగర, సభ్యులు ముత్యాల హరికిషన్ సగర, శాగబండ ప్రకాష్‌సగర, కమటం వేణుగోపాల్ సగర, మామిడి విద్యాసాగర్ సగర, రాచకొండ గణేష్ సగర తదితరులు పాల్గొన్నారు. ఎన్నికలు ఏప్రిల్ 28న నగరంలోని బడిచౌడి వద్ద ఉన్న సగర విద్యానిధి ఆవరణలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అడ్‌హక్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ప్రతి ఒక్క సభ్యుడు కట్టుబడి ఉండాలన్నారు. సగర సంఘానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారి పట్ల నియమ నిబంధనలను అనుసరించిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఏఐడీఎస్‌ఓ మేనిఫెస్టో విడుదల



లక్డికపూల్: లక్డికపూల్‌లోని సామ్రాట్ హాల్‌లో ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో «స్టూడెంట్స్ వాయిస్» పేరుతో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. విద్యా బడ్జెట్ పెంచాలని, ప్రభుత్వ విద్యా సంస్థల సంఖ్యను పెంచాలని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఈ సందర్భంగా ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ రాజ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేష్, స్వాతి, నితీష్, ప్రతిభ, వినోద్, నాగరాజు, ప్రణవ, నరేష్, మధు, చక్రి, రేణుక, కిరణ్, ప్రణీత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే

- మల్కాజిగిరి ప్రచార వ్యూహంలో ప్రధాన పార్టీలు
- ఎమ్మెల్యేల పై భరోసాతోనే ప్రజల్లోకి బీఆర్ఎస్
- సిట్టింగ్ స్థానాన్ని నిలుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు
- మోదీ చరిష్మాతో బీజేపీ దూకుడు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ప్రచారం వ్యూహంపై దృష్టి సారించాయి. బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థిగా వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిలను ఆయా పార్టీలు ప్రకటించాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఎత్తులకు పై ఎత్తులతో ప్రచారం రంగంలోకి దూసుకెళ్లేందుకు వ్యూహాత్మకంగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్యనేతలు ,కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ముందున్నారు. బీఆర్ఎస్ కూడా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖరారు విషయంలో కొంత ఆలస్యం జరగడంతో ఆదివారం నుంచి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తల సమావేశంతో ఎన్నికల ప్రచారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ప్రధానంగా కాంగ్రెస్,బీజేపీ పార్టీల మధ్యనే నువ్వా,, నేనా అన్నట్లుగా ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. బీఆర్ఎస్ మాత్రం ఎమ్మెల్యేలపై నమ్మకంతోనే ప్రజల ముంగిటికి వెళుతోంది.

కాంగ్రెస్‌లో ఆధిపత్య ధోరణి..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆశిస్తున్న దానికి భిన్నంగా స్థానిక నాయకులు ఒకరిపై మరొకరు ఆధిపత్యం సాధించాలన్న ధోరణితో ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. దీంతో ఎవరి గోల వారిదే అన్నట్లుగా వ్యవహారం నడుస్తోంది. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ఎవరికి వారే చేపట్టడమే కాకుండా ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు యత్నిస్తున్నారు. నేతల మధ్య సమన్వయ లోపం, అంతర్గత విభేదాలు కార్యకర్తలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంపై ఈ ప్రభావం పడుతుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ గెలిచి తీరాలన్న లక్ష్యానికి నేతల మధ్య కొనసాగుతున్న అంతరుద్ధ్యం గండి కొట్టగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ముఖ్యనేతల మధ్య మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. కూకట్‌పల్లిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.
- ఉప్పల్‌లోనూ పాత , కొత్త నేతల మధ్య సమన్వయం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాజిగిరి, ఎల్బీనగర్, కంటోన్మెంట్‌లోనూ అదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యేలపైనే బీఆర్ఎస్ ఆశలు...

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ పెద్దలు గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు పని చేయాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు బాధ్యతలను పార్లమెంట్ పరిధిలోని ఆరుగురు పార్టీ ఎమ్మెల్యేలపై పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు మాజీ మంత్రి మల్లారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో సహా పార్టీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి విజయం కోసం ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేసిన దాఖలాలు కనిపించటం లేదు. బీఆర్ఎస్‌లో నెలకొన్న రాజకీయ పరిణామాలు, కవిత ఆరెస్టు తదితర అంశాలు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని పార్టీ ముఖ్యనాయకులతో సహా కేడర్‌లో గుసగుసలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పిలుపునిచ్చేలా ..అధినేత ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు కోరుతున్నారు.

ప్రచారంలో 'ఈటల' ముందంజ

మొదటి జాబితాలోనే మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేరు ఖరారు కావటంతో ఇతర పార్టీల అభ్యర్థుల కంటే ఆయన ప్రచారంలో ముందంజలో ఉన్నారు. రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తూ పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ శ్రేణులతో మమేకమవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొంది తీరాలని బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వివిధ పొలిటికల్ ఏజెన్సీలతో ఎప్పటిప్పుడు సర్వేలు చేయించుకుంటున్నారు. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలు, అక్కడ బలమైన నేతలను గుర్తించి, వారిని తన వైపు తిప్పుకుంటున్నారు. బీజేపీ ఆశావహులు అధికసంఖ్యలో ఉన్నప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలను ఆశ్చర్యపరిచేలా బీజేపీ అభ్యర్థిగా రాజేందర్‌ను ఎంపిక చేయటంతోపాటు అసంతృప్తులను చల్లపరిచారు. గెలుపు గుర్రాలకు టికెట్ లక్ష్యంగా పార్టీ అధిష్టాం మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను అభ్యర్థిగా ప్రకటించటంతోఎన్నికల ప్రచారాన్ని పరిగెత్తించేందుకు బీజేపీ తీవ్రంగా కృషి చేస్తోంది. ఇప్పటికే ఈటల గెలుపు కోసం భారత ప్రధాని మోదీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించగా, కంటోన్మెంట్ నియోజకవర్గంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సోషల్ మీడియా వారియర్స్ సమావేశాన్ని నిర్వహించి కేడర్‌ను అప్రమత్తం చేశారు.

నాణ్యమైన సేవలతోనే గుర్తింపు

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- వనస్థలిపురంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రారంభం

వనస్థలిపురం: అంతర్జాతీయ ఆభరణాల వ్యాపారంలో గుర్తింపు పొందిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ సరికొత్త షో రూమ్‌ను ఆదివారం వనస్థలిపురంలో ప్రారంభించింది. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ షోరూంను వర్చువల్‌గా ప్రారంభించగా, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుడూ స్వచ్ఛమైన బంగారు ఆభరణాలు, నాణ్యమైన సేవలు అందించడం ద్వారానే వినియోగదారుల మన్ననలు పొంద వచ్చన్నారు. గ్రూప్ చైర్మన్ అహమ్మద్ మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 13 దేశాల్లో 340కి పైగా షోరూంలతో విస్తరించిందని, హైదరాబాద్‌లో ఇది 13వ షోరూమ్‌గా తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్న, తులసి శ్రీనివాస్, గ్రూప్ మేనేజ్‌మెంట్ బృందం పాల్గొన్నారు.



షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

బసవ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

పంజగుట్ట: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న వీర శైవ లింగాయత్ లింగ బలిజల కోసం రాష్ట్ర ప్రభుత్వం లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం హర్షం వ్యక్తం చేసింది. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి తమ సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. తమకు ఎలాంటి వృత్తి లేదని, పలువురు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారన్నారు. లింగాయత్ కార్పొరేషన్‌కు ఏటా రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ ఆరాధ్యదైవం బసవ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, కోశాధికారి రాచప్పా, కేంద్ర కమిటీ సభ్యుడు శెట్టి శివకుమార్, నాయకులు ఎ.మధుసూదన్, శివకుమార్, శ్రావణి, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న సంఘం ప్రతినిధులు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఉద్యోగులు

ముషీరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీల్లో పని చేస్తున్న 1.50 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం బీసీ భవన్‌లో విద్యాశాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, వ్యవసాయ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ, మున్సిపల్, సంక్షేమ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత రెండు నెలలుగా యూనివర్సిటీ, మున్సిపల్, వైద్య, ఆరోగ్య శాఖల్లోని ఏఎన్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాత్కాలిక ఉద్యోగులకు కూడా రెగ్యులర్ ఉద్యోగులకు ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే ఉద్యోగం చేస్తూ అపార అనుభవం సంపాదించారని వేరే ఉద్యోగానికి వెళ్లడానికి ఉద్యోగ గరిష్ఠ వయో పరిమితి దాటిపోయిందని అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోని వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రమేష్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గవ్వల భరత్‌కుమార్, నీల వెంకటేష్, పి.సుధాకర్, ఈ.వెంకటేష్, నందగోపాల్, జెఆర్ రాంమోహన్, జి.ఉదయ్‌నేత, మోదీ రాందేవ్, నిఖిల్, వంశీ, రాజ్‌కుమార్, మణెమ్మ, జ్యోతి, వాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

యూపీఎస్‌ఈ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు ఒత్తిడి లేకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని యూపీఎస్‌ఈ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్ అన్నారు. ఆదివారం కృష్ణ ప్రదీప్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో యూపీఎస్‌ఈ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో చెప్పే అంశాలను మనస్సుకు ఎక్కించుకుని ఆస్వాదిస్తు నేర్చుకోవాలని, మూస పద్ధతిలో కష్టపడడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. యూనివర్సిటీ పరీక్షలకు, పోటీ పరీక్షలకు తేడా ఉంటుందని యూనివర్సిటీ పరీక్షలల్లో ఆయా సబ్జెక్టులలో పరిజ్ఞానాన్ని మాత్రమే చూస్తారని, అదే పోటీ పరీక్షలు అయితే అన్ని రకాలుగా పరీక్షిస్తారన్నారు. అఖిల భారత సర్వీస్‌కు వెళ్లాలంటే క్రమ శిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమని అంతకంటే ముందు కార్యదీక్ష ఉండాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ అగర్వాల్‌ను సంస్థ తరఫున ఘనంగా సన్మానించారు. అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రదీప్, డాక్టర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



డీపీ అగర్వాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నేడు హోలీ పండగ



సన్నిధి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ధర్మం-ఆచరణ

నరజన్మకూ, మిగిలిన ప్రాణులకూ ఒక ప్రత్యేకమైన భేదం ఉంది. ఇతర ప్రాణులకు ఒకే ధర్మం-పశుధర్మం. ఆకలి, నిద్ర, ప్రత్యుత్పత్తి...అంతకుమించి వాటికి ధర్మం అని ప్రత్యేకంగా ఏమీ ఉండదు. కానీ ఒక్క మనిషికి మాత్రం అత్యంత ప్రధానమైనది - ధర్మాచరణ. అయితే దీనిలో ఒక సంక్లిష్టత ఉంది. ఇదే ధర్మము... అని చెప్పడం ఎప్పుడూ సాధ్యం కాదు. ధర్మం నిరంతరం మారి పోతుంటుంది. భార్యముందు నిలబడితే-భర్త ధర్మం. తల్లి ముందు నిలబడితే-పుత్ర ధర్మం. సోదర ధర్మం... ఉద్యోగ ధర్మం.. అలా నిరంతరం మారిపోతుంటుంది. దేశాన్నిబట్టి, కాలాన్నిబట్టి మారిపోతుంది. ఉత్తర భారత దేశంలో చలి కారణం చేత వీలయినంతగా శరీరాన్ని కప్పుకుని పూజాదులు చేయడం అక్కడి ధర్మం. దక్షిణ భారతదేశంలో.. కేవలం ఉత్తరీయం పైన వేసుకుని అభిషేకాలు, పూజలు చేయడం ఇక్కడి ధర్మం.



అలాగే ఆశ్రమాన్ని బట్టి ధర్మం మారిపోతుంటుంది. బ్రహ్మచారికి ఒక ధర్మం, గృహస్థుకు ఒక ధర్మం, వానప్రస్థుకు, సన్యాసికి .. ఇలా ధర్మం మారుతుంటుంది. బ్రహ్మచారి ఏదీ కూడబెట్టకూడదు. విద్యార్థిగా గురువుగారు చెప్పింది శ్రద్ధగా విని మననం చేసుకోవడం ఒకటే ధర్మం. అదే గృహస్థాశ్రమంలో భోగం అనుభవించవచ్చు. భార్యాబిడ్డలతో సుఖసంతోషాలతో గడపవచ్చు. రేపటి అవసరాలకోసం సంపాదించి దాచుకోవచ్చు. వానప్రస్థు భార్యతో కలిసి ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ఆత్మవిచారం చేస్తూ గడపవచ్చు. చిట్టచివరన అన్నీ పరిత్యజించి ఏకాకిగా వైరాగ్యంలో ఉండడం ధర్మం. అలా ధర్మం మారిపోతున్నా ఎక్కడికక్కడ ధర్మం నియమాలకు కట్టుబడి ఉంటుంది. అసలు ధర్మం లేకుండా ఉండడం, దానిని పాటించకుండా జీవించడం సాధ్యం కాదు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ధర్మాచరణతోనే మనుష్య ప్రాణి ఉత్తమగతులు పొందగలదు. శాస్త్రం చెప్పినట్టుగా ధర్మాచరణ చేస్తూ శరీరం పతనమయిన తరువాత స్వర్గలోకం వెళ్ళవచ్చు. పుణ్యఫలితం అయిపోయిన తరువాత తిరిగి భూలోకానికి చేరుకోవచ్చు.'నాకు శాస్త్రం మీద నమ్మకం లేదు. ఈ పుణ్యకర్మలు నేను చేయను. నాకు ఏది సంతోషం అనిపిస్తే, నా ఇంద్రియాలకు ఏది సుఖం అనిపిస్తే, నా మనసుకు ఏ భోగం అనుభవించాలనుకుంటే దానిని అనుభవిస్తూ శాస్త్రాన్ని పక్కనబెట్టి ప్రవర్తిస్తే.. ఆ పాటిదానికి నరజన్మ అవసరం లేదని తిర్యక్కుగా (వెన్నుపూసలేని జీవిగా) జన్మ లభిస్తుంది. అలా కాదు, నాకు పాపమూ వద్దు, పుణ్యమూ వద్దు. నేను ఈ మంచిపని చేసి పుణ్యం కావాలనుకోవడం లేదు, నేను కేవలం భగవంతుడు చెప్పినట్లు బతకడం నాకు సంతోషం. నేను చేయవలసినవి కాబట్టి చేస్తున్నా.. దానినుంచి నేను ఏ ప్రయోజనమూ ఆశించడం లేదనుకున్నప్పుడు అది చిత్తశుద్ధిని సూచిస్తుంది. ఇది ఏదో ఒకనాడు భగవంతుని అనుగ్రహానికి కారణమయి, జ్ఞానాన్ని తద్వారా మోక్షాన్ని ఇస్తుంది. అంటే ధర్మాన్ని అనుష్ఠానం చేసి దేవతాపదవిని అధిష్ఠించగలడు. ధర్మాచరణను పక్కనబెట్టి పతనమమై తిర్యక్కు అయిపోగలడు. ఏ ఫలితాన్ని ఆశించకుండా ధర్మాచరణచేసి మోక్షాన్ని పొందగలడు. కాబట్టి ధర్మం కన్నా గొప్పది మరొకటి లేదు.

మంచిమాట

జీవితం వర్ణమయం

మానవ జీవితం రంగుల మయం. ఆ మాటకొస్తే అసలీ ప్రపంచమే రంగులమయం. ఎందుకంటే మన జీవన విధానమే రకరకాల రంగులతో మమేకమై ఉంది. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉంటే ప్రకృతిలో వేనవేల రంగులున్నాయి. ఈ ప్రకృతిలోని రంగులన్నీ జీవన తత్వాన్ని బోధిస్తాయి. ఆ రంగులతో చేసుకునే సంబరమే హోలీ. అందుకే హోలీని ఆలయాలలో కూడా ఒక వేడుకగా... ఉత్సవంగా నిర్వహిస్తారు.

చిగురించే మోదుగులు. పూసే గురువిందలు. పరిమళించే మల్లెలు. మొగ్గలు తొడిగే మొల్లలు... రాలే పొగడ పుప్పొడి రేణువులు. చిందే గోగు తేనెలు. గుబాళించే గోరింట పూలు. ఎర్రని చివుళ్లతో మామిళ్లు... తెల్లని పూతాపుందెతో వేప చెట్లు... ఇందుకే కదా కవులు కీర్తించేది... వసంతాన్ని రుతువులకే రారాజని! మధుమాస వేళలో జరిగే వసంతోత్సవాన్ని భారతదేశమంతటా ఘనంగా జరుపుకుంటుంది.

గతంలో రాజు, పేద, ధనిక, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఈ రంగునీళ్లను ఒకరిపై ఒకరు చల్లుకొని సంతోషించేవారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని హోలీ జరుపుకుంటారు. ఫాల్గుణ మాసం పూర్ణిమనాడు జరుపుకునే పండుగ కనుక ఫాల్గుణోత్సవమని... వసంత రుతువును స్వాగతించే వేడుక కాబట్టి వసంతోత్సవమని పిలుచుకుంటాం.

హోలీ పర్వదినం వెనుక చాలా పురాణ కథలు ఉన్నాయి. యోగనిష్ఠలో ఉన్న పరమేశ్వరుడికి తపోభంగం కలిగించమని దేవతలందరూ మన్మథుడిని కోరడంతో ఆయన శివుడి మీదకు తన పూలబాణాలను ప్రయోగిస్తాడు. ఆ బాణాల తాకిడికి ధ్యాన భంగం అయిన శివుడు ఆగ్రహంతో తన మూడో కంటిని తెరచి మన్మథుడిని మసి చేస్తాడు. మదనుడి భార్య రతీదేవి తనకు పతి భిక్ష పెట్టవలసిందిగా ప్రాధేయపడటంతో భోళా శంకరుడు కరిగిపోయి మన్మథుడు.. రతీదేవికి మాత్రమే శరీరంతో కనిపించేలా వరమిచ్చాడు. అలా మళ్లీ మన్మథుడు రతీదేవికి దక్కాడు. ఈ పండుగ జరుపుకోవడానికి ఈ కథ ఓ కారణమైందని విశ్వసిస్తారు.

అన్నింటికీ మించి హోలీ పండుగ పుట్టుకకు మరో కథను చెబుతారు.

శ్రీకృష్ణుడు నల్లనివాడు, రాధ మేలిమి బంగారం. ఓరోజున వారిద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వనవిహారం చేస్తుండగా రాధ చేతిపక్కన ఉన్న తన చేయి నల్లగా ఉండటం చూసి దిగులు పడ్డాడట కృష్ణుడు. కన్నయ్య విచారానికి కారణం తెలుసుకున్న యశోదమ్మ 'నాయనా! రాధమ్మ అసలు రంగు తెలియకుండా నువ్వు ఆమె ఒంటినిండా రంగులు కలిపిన నీళ్లు పోయి' అని సలహా ఇచ్చిందట. అమ్మ మాట మేరకు నల్లనయ్య రాధమీద రంగునీళ్లు పోశాడట. ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయిన రాధ తను కూడా కృష్ణుని మీద రంగులు కలిపిన నీరు చిలకరిస్తూ కృష్ణునికి అందకుండా ఉద్యానవనం నుంచి బయటకు పరుగులు తీసిందట. రాధాకృష్ణులిద్దరూ ఇలా ఒకరి మీద ఒకరు రంగునీళ్లు పోసుకోవడం చూసిన పురజనులు... ఆనందోత్సాహాలతో రంగుల పండుగ చేసుకున్నారట. ఆనాడు ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ. నాటినుంచి ప్రతి ఫాల్గుణ పున్నమినాడు ప్రజలందరూ ఒకరినొకరు రంగులతో ముంచెత్తుకోవడం, పెద్దఎత్తున పండుగలా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

పైన చెప్పుకున్న కథల నుంచి మనం గ్రహించవలసినది ఏమిటంటే... మనందరమూ మనుషులమే కాబట్టి ఏదో ఒక లోపం ఉండితీరుతుంది. అలాంటి లోపాలను తీసుకు వచ్చే దుర్గుణాలను దూరం చేసుకోవడం అవసరం. అన్ని రంగులు ఉంటేనే.. ప్రకృతికి అందం. అందరిని కలుపుకుంటేనే మనసుకి అందం. అన్ని ఆలోచనలను పరిగణించి, చక్కని దారిన కలిసి నడిస్తేనే మనిషికి అందం. హోలీ రోజున ఒకరిపై ఒకరు చల్లుకునేవి రంగులు కావు. అనురాగ ఆప్యాయతలు కలసిన పన్నీటి పరిమళ జల్లులు.

హోలీ పండుగను వసంత రుతువు వస్తోందనడానికి సంకేతంగా భావిస్తారు. వసంతకాలం అంటే చెట్లు చిగిర్చి పూలు పూసే కాలం కదా! అంటే మనలో ఉన్న దుర్గుణాలనే ఎండుటాకులను రాల్చేసి, వాటి స్థానంలో ఉల్లాసం, ఉత్సాహం, ప్రేమ, అనే సుగుణాలతో కూడిన ఆకులను చిగురింప చేసుకోవాలి.

మన్మథుడు అంటే మనస్సును మథించేవాడని అర్థం. మనిషిలో దాగి ఉన్న కామక్రోధలోభమోహమదమాత్సర్యాలనే ఆరు అంతః శత్రువులు మనస్సును మథిస్తాయి. వాటినే అరిషడ్వర్గాలు అంటారు. మనిషిని పతనం చేసే ఈ ఆరుగుణాలనూ అదుపులో ఉంచుకోవాలని చెప్పేందుకే పరమేశ్వరుడు కామదేవుడిని భస్మం చేశాడు. రూపం కోల్పోయిన మన్మథుడు ఆనాటి నుంచి మనుషుల మనస్సులలో దాగి ఉండి అసలు పని నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకునేందుకే, ఈశ్వరుడు కాముణ్ణి భస్మం చేసిన రోజైన ఫాల్గుణ శుద్ధపూర్ణిమకు ముందురోజు, గ్రామాలలో కామదేవుని ప్రతిమను తయారుచేసి, ఊరేగింపుగా తీసుకెళతారు. యువకులంతా కలిసి కామదహనం చేస్తారు. ఇది ఆనవాయితీగా వస్తోంది.

మన జీవితాలలో అనేక విధాలైన అలకలు, కినుకలు, అసంతృప్తులు, కోపాలు, తాపాలు, ఆవేశకావేశాలు, అలజడులు, అపశ్రుతులు, తడబాట్లు, ఎడబాట్లు ఉండొచ్చు. అందువల్ల ఈ హోలీ రోజు మనకు దగ్గరగా ఉన్న వారితోనే మాట, ఆట కాకుండా.... మనసుకు దగ్గర అయిన బంధు మిత్రులతో, మనవల్లో, వారి వల్లో ఏర్పడిన మానసిక దూరాన్ని తగ్గించుకుని, మనమే ముందుగా ఒక అడుగు వేసి అందరినీ దగ్గర చేసుకుని జీవితాలను వర్ణమయం... రాగ రంజితం చేసుకుందాం. హోలీ పర్వదినాన్ని అందరూ ఆప్యాయతతో కలిసే రంగుల రోజుగా మార్చుకుందాం.

- డి.వి.ఆర్. భాస్కర్

సినిమా

సమయంతో ప్రయాణం

వెండితెరపై కాలచక్రం తిరుగుతోంది. ప్రేక్షకలను విభిన్న కాలాలకు తీసుకుని వెళ్లేందుకు కొందరు హీరోలు సిద్ధం అవుతున్నారు... కాలాన్ని కదిలిస్తున్నారు. టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్ సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. ఇలా వెండితెరపై సమయంతో ప్రయాణం చేస్తున్న కొందరు హీరోల గురించి తెలుసుకుందాం.

ఆరువేల సంవత్సరాలు...



● ప్రభాస్

ఆరువేల సంవత్సరాల టైమ్ లైన్‌తో సోషియో ఫ్యాంటసీ అండ్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ మూవీ 'కల్కి 2898ఏడీ' కథనం సాగుతుందని తెలుస్తోంది. ''ఈ సినిమా కథ మహాభారతం కాలంలో మొదలై, 2898తో పూర్తవుతుంది. అందుకే 'కల్కి 2898ఏడీ' అనే టైటిల్‌ను ఖరారు చేశాం'' అని ఈ చిత్రదర్శకుడు నాగ్ అశ్విన్ ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. దీంతో 'కల్కి 2898 ఏడీ' టైమ్ ట్రావెల్ ఫిల్మ్ అని కన్ఫార్మ్ చేసుకోవచ్చు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో దీపికా పదుకోన్, దిశా పటానీ, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ ఇతర లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. రాజమౌళి, మలయాళ నటి అన్నా బెన్, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ అతిథి పాత్రల్లో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్ కనిపిస్తారని తెలిసింది. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. 'కల్కి 2898ఏడీ' సినిమాను మే 9న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఈ చిత్రం విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్‌నగర్ సమాచారం.

మూడు తరాల నేపథ్యంలో...



● టొవినో థామస్

మలయాళ నటుడు టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. ఈ సినిమాలో మణియన్, అజయన్, కుంజికేలు.. ఇలా మూడు పాత్రల్లో నటిస్తున్నారు టొవినో థామస్. పాత్రలకు తగ్గట్లే కథ కూడా మూడు తరాల హీరోల నేపథ్యంలో సాగుతుంది. కథ రీత్యా మూడు తరాల్లోనూ హీరోగా టొవినో థామస్‌నే కనిపిస్తారని తెలుస్తోంది. ఇలా మూడు డిఫరెంట్ టైమ్ లైన్స్‌లో టైమ్ ట్రావెల్‌గా ఈ సినిమా కథనం సాగుతుంది. కృతీ శెట్టి, ఐశ్వర్యా రాజేష్, సురభిలక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా కృతీ శెట్టికి ఇది తొలి మలయాళ చిత్రం. మ్యాజిక్ ఫ్రేమ్స్, యూజీఎమ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. తెలుగులోనూ విడుదల చేయాలనుకుంటున్నారు. త్రీడీలోనూ రిలీజ్ చేయాలని ఈ చిత్రం మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని మాలీవుడ్ సమాచారం.

ఆధునిక అశ్వత్థామ

మహాభారతంలో అమరవీరుడిగా చెప్పుకునే అశ్వత్థామ ఇప్పటి ఆధునిక యుగంలోకి వస్తే ఎలా ఉంటుందనే ఇతివృత్తంతో తెరకెక్కుతున్న సినిమా'అశ్వత్థామ: ది సాగా కంటిన్యూస్'. బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్ టైటిల్ రోల్ చేస్తున్నారు. కన్నడ దర్శకుడు సచిన్ రవి ఈ సినిమాకు దర్శకుడు. కాగా ఈ సినిమా టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌తోనే ఉంటుందని బాలీవుడ్ సమాచారం. జాకీ భగ్నానీ, వసుభగ్నాని, దీప్షికా దేశ్‌ముఖ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే విడుదల కానుంది.



● సూర్య

ఐదువందల సంవత్సరాలు...


టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో సూర్య కెరీర్‌లో రూపొందిన చిత్రం '24'. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ 2016లో విడుదలై హిట్ సాధించింది. ఈ జానర్‌లోనే తాజాగా సూర్య నటించిన చిత్రంగా 'కంగువ'ను చెప్పుకోవచ్చు. ఐదువందల (1700 - 2023) సంవత్సరాల టైమ్ పీరియడ్‌లో ఈ చిత్ర కథనం సాగుతుంది. పద్దెనిమిదో శతాబ్దంలో తాను మొదలుపెట్టిన ఓ పనిని పూర్తి చేయలేక మరణించిన ఓ వీరుడు... పునర్జన్మలో ఆ పనిని ఏ విధంగా పూర్తి చేస్తాడు? అన్నదే 'కంగువ' సినిమా కథనం అని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో సూర్య హీరోగా నటించగా, హీరోయిన్‌గా దిశా పటానీ, ఓ కీలక పాత్రలో యోగిబాబు, విలన్‌గా బాబీ డియోల్ కనిపిస్తారు. స్టూడియోగ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం ఈ ఏడాదిలోనే విడుదల కానుందని తెలిసింది.



● షాహిద్ కపూర్

ఇలా టైమ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

మిస్టర్ బచ్చన్ వస్తున్నాడు




● రవితేజ

ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'షాక్', 'మిరపకాయ్' వంటి సినిమాల తర్వాత రవితేజ, హరీష్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రం ఇది. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఇందులో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ బచ్చన్ పాత్రలో రవితేజ కనిపిస్తారని ఫిల్మ్‌నగర్ సమాచారం. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'మిస్టర్ బచ్చన్' చిత్రాన్ని జులైలో రిలీజ్ చేసేలా చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త. మరోవైపు అజయ్ దేవగన్ హీరోగా నటించిన హిందీ హిట్ ఫిల్మ్ 'రైడ్' (2018) చిత్రానికి 'మిస్టర్ బచ్చన్' తెలుగు రీమేక్‌గా తెరకెక్కుతోందనే టాక్ వినిపిస్తోంది.

నెవర్!


ఓవెన్ టీగ్, ఫ్రెయా అల్లన్, కెవిన్ డురాండ్, పీటర్ మకాన్, విలియమ్ హెచ్. మేసీ ప్రధాన పాత్రల్లో నటించిన హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్'. వెస్ బాల్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మే 10న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన కొత్త టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'వెల్‌కమ్ టు మై కింగ్‌డమ్', 'బెండ్ ఫర్ యువర్ కింగ్', '..నెవర్' అనే డైలాగ్స్ ఈ టీజర్‌లో ఉన్నాయి. 'ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' రీ బూట్ సిరీస్‌లో వస్తోన్న నాలుగో చిత్రం ఇది. ఈ సిరీస్ నుంచి గతంలో వచ్చిన 'రైజ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ (2011)', 'డ్వాన్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ (2014), 'వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' (2017) చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి.



'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' పోస్టర్

ఇక ఉచితంగా మాట్లాడను! - దర్శకుడు అనురాగ్ కశ్యప్

కొందరు వ్యక్తులు తన సమయాన్ని అనవసరంగా వృథా చేస్తున్నారని, అలాంటి వ్యక్తులతో ఇక ఉచితంగా మాట్లాడననీ అంటున్నారు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్. అందుకే ఇక నుంచి ఎవరికైనా సమయం కేటాయించాలనుకుంటే అందుకు తగ్గట్టుగా 'చార్జ్' చేస్తానని అంటున్నారాయన. ఈ విషయంపై అనురాగ్ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయగా, బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ''కొంతమంది కొత్త వ్యక్తులకు సహాయం చేయాలనుకుని వారితో సమావేశమై నేను నా సమయాన్ని చాలా కోల్పోయాను. ఆ సమావేశాలు నాకు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు కూడా. చెప్పాలంటే ఇలా చాలామందితో మాట్లాడి నేను అలసిపోయాను. ఈ విధంగా జీవితంలో చాలా సమయాన్ని కోల్పోయాను. సక్సెస్‌కు షార్ట్ కట్స్ వెతికేవారితో, తాము క్రియేటివ్ జీనియస్‌లా ఫీలయ్యే కొందరు వ్యక్తులతో ఇకపై నేను ఉచితంగా మాట్లాలనుకోవడం లేదు. నేను ఓ స్వచ్ఛంద సేవా సంస్థను కాదలచుకోలేదు. ఇకపై ఎవరైనా నన్ను కలవాలనుకుంటే పది నుంచి పదిహేను నిమిషాలు అయితే లక్ష రూపాయలు, 30 నిమిషాలకు రెండు లక్షలు, గంట అయితే ఐదు లక్షలు చెల్లించాలి. ఒకవేళ ఎవరైనా ఇలా డబ్బులు చెల్లించలేని పక్షంలో వారు నన్ను కలవడానికి ప్రయత్నించవద్దు'' అని ఆ నోట్‌లో పేర్కొన్నారు అనురాగ్ కశ్యప్. ఇక బాలీవుడ్‌లో వచ్చిన 'బ్లాక్ ఫ్రైడే', 'ముంబై కటింగ్', 'బాంబే టాకీస్' వంటి సినిమాలకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే.





చాంపియన్ ఆకుల శ్రీజ


లెబనాన్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ రెండో టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ చాంపియన్‌గా అవతరించింది. బీరుట్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 47వ ర్యాంకర్ శ్రీజ 6-11, 12-10, 11-5, 11-9తో సారా డి నుట్టె (లక్సెంబర్గ్)పై గెలిచింది. విజేతగా నిలిచిన శ్రీజకు 550 డాలర్ల (రూ. 46 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. డబుల్స్ విభాగంలో శ్రీజ-దియా చిటాలె (భారత్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది.

సెమీస్‌లో శ్రీకాంత్ పరాజయం



స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. బాసెల్‌లో జరిగిన ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ శ్రీకాంత్ 65 నిమిషాల్లో 21-15, 9-21, 18-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. 16 నెలల తర్వాత ఓ టోర్నీలో శ్రీకాంత్ సెమీఫైనల్ చేరడం గమనార్హం. సెమీఫైనల్లో ఓడిన శ్రీకాంత్‌కు 3,045 డాలర్ల (రూ. 2 లక్షల 54 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

విజేత కార్లోస్ సెయింజ్



మెల్‌బోర్న్: ఫార్ములా వన్ సీజన్‌లో వరుసగా మూడో విజయం సాధించాలని ఆశించిన వరల్డ్ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్)కు నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి రేసును 'పోల్ పొజిషన్'తో ఆరంభించిన వెర్‌స్టాపెన్ కారు ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో నాలుగో ల్యాప్‌లోనే వైదొలిగాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఫెరారీ జట్టు డ్రైవర్ కార్లోస్ సెయింజ్ జూనియర్ విజేతగా అవతరించాడు. నిర్ణీత 58 ల్యాప్‌ల రేసును సెయింజ్ అందరి కంటే వేగంగా ఒక గంటా 20 నిమిషాల 26.843 సెకన్లలో ముగించి ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకున్నాడు. ఫెరారీకే చెందిన చార్లెస్ లెక్‌లెర్క్ రెండో స్థానంలో నిలిచాడు. 2022 బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి తర్వాత ఇద్దరు ఫెరారీ డ్రైవర్లు టాప్-2లో నిలిచారు. సీజన్‌లోని నాలుగో రేసు జపాన్ గ్రాండ్‌ప్రి ఏప్రిల్ 7న జరుగుతుంది.

ఒకరు 6 సెకన్లలో... మరొకరు 7 సెకన్లలో....



క్రిస్టోఫ్ బామ్‌గార్ట్‌నర్



ఫ్లోరియన్ విట్జ్

బ్రాటిస్లావా (స్లొవేకియా): అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఆదివారం అద్భుతం జరిగింది. వేర్వేరు వేదికల్లో జరిగిన రెండు అధికారిక ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో రెండు ఫాస్టెస్ట్ గోల్స్ నమోదయ్యాయి. బ్రాటిస్లావాలో స్లొవేకియాతో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రియా 2-0తో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఆట మొదలైన 6 సెకన్లకే ఆస్ట్రియా ప్లేయర్ క్రిస్టోఫ్ బామ్‌గార్ట్‌నర్ గోల్ చేశాడు. మిడ్ ఫీల్డ్ నుంచి క్షణాల్లో ముగ్గురు డిఫెండర్లను తప్పించుకొని ముందుకు దూసుకెళ్లిన క్రిస్టోఫ్ లాంగ్‌షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. మరోవైపు లియోన్‌లో ఫ్రాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జర్మనీ జట్టు 2-0తో నెగ్గింది. ఈ మ్యాచ్‌లో ఆట మొదలైన 7 సెకన్లకే జర్మనీ ప్లేయర్ ఫ్లోరియన్ విట్జ్ గోల్ చేశాడు. ఇన్నాళ్లూ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఫాస్టెస్ట్ గోల్ చేసిన రికార్డు లుకాస్ పొడోల్‌స్కీ పేరిట ఉంది. 2013లో ఈక్వెడార్‌తో జరిగిన మ్యాచ్‌లో పొడోల్‌స్కీ 9వ సెకనులో గోల్ సాధించాడు. పొడోల్‌స్కీ 11 ఏళ్ల రికార్డు ఒకేరోజు బద్దలు కావడం విశేషం.

ముంబై మరో 'సారీ'

వరుసగా 12వ ఏడాది ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఓటమి

- 6 పరుగులతో గుజరాత్ గెలుపు
- రాణించిన సుదర్శన్, ఉమేశ్, మోహిత్



రోహిత్



ఉమేశ్, గిల్

అహ్మదాబాద్: కొత్త కెప్టెన్ వచ్చినా... వరుసగా 12వ ఏడాది ముంబై ఇండియన్స్ జట్టుకు ఐపీఎల్ తొలి మ్యాచ్ కలిసి రాలేదు. వరుసగా 12వ సారి ముంబై ఐపీఎల్ సీజన్‌ను ఓటమితో ప్రారంభించింది. 2012 ఐపీఎల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో నెగ్గిన ముంబై జట్టు ఆ తర్వాత ఇప్పటి వరకు తొలి మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టలేకపోయింది. కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ సారథ్యంలో ఈ మ్యాచ్‌లో ఆడిన గుజరాత్ టైటాన్స్ జట్టు బౌలర్ల సమష్టి రాణింపుతో ఆఖరిదాకా పోరాడి 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఓపెనర్లు సాహా (19), శుబ్‌మన్ గిల్ (22 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు నిలువలేదు. వన్‌డౌన్ బ్యాటర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ (39 బంతుల్లో 45; 3 ఫోర్లు, 1 సిక్స్) పటిష్టమైన ముంబై బౌలింగ్‌కు ఎదురునిలిచి జట్టును నడిపించాడు. అయితే బుమ్రా ఒకే ఓవర్లో మిల్లర్ (17), సుదర్శన్‌లను అవుట్ చేయగా... ఆఖర్లో రాహుల్ తెవాటియా (15 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిని ప్రదర్శించాడు. తర్వాత ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 162 పరుగులే చేయగలిగింది. ఇషాన్ కిషన్ (0), నమన్ ధీర్ (20)లను అవుట్ చేసిన ఒమర్జాయ్ ముంబై ఆరంభాన్ని దెబ్బకొట్టగా, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (29 బంతుల్లో 43; 7 ఫోర్లు, 1 సిక్స్), డెవాల్డ్ బ్రెవిస్ (38 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) జట్టును నడిపించారు. స్వల్పవ్యవధిలో వాళ్లిద్దరు అవుటయ్యాక ఒక్క తిలక్ వర్మే (19 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగైన స్కోరు చేశాడు. టిమ్ డేవిడ్ (11), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (11)లాంటి హిట్టర్లు కూడా తేలిపోవడంతో ముంబై ఓడింది. ఒమర్జాయ్, ఉమేశ్, మోహిత్ శర్మ, స్పెన్సర్ జాన్సన్ తలా 2 వికెట్లు తీశారు. గుజరాత్ మాజీ సారథి పాండ్యా తాజాగా ముంబై కెప్టెన్‌గా టాస్‌కు రాగానే స్టేడియంలోని ప్రేక్షకులు అరచి గోల చేశారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (బి) బుమ్రా 19; శుబ్‌మన్ (సి) రోహిత్ (బి) చావ్లా 31; సాయి సుదర్శన్ (సి) తిలక్‌వర్మ (బి) బుమ్రా 45; అజ్మతుల్లా (సి) తిలక్‌వర్మ (బి) కొయెట్జీ 17; మిల్లర్ (సి) పాండ్యా (బి) బుమ్రా 12; విజయ్ శంకర్ (నాటౌట్) 6; తెవాటియా (సి) నమన్ ధీర్ (బి) కొయెట్జీ 22; రషీద్ ఖాన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 168. వికెట్ల పతనం:** 1-31, 2-64, 3-104, 4-133, 5-134, 6-161. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 3-0-30-0, ల్యూక్ వుడ్ 2-0-25-0, బుమ్రా 4-0-14-3, ములానీ 3-0-24-0, పియూశ్ చావ్లా 3-0-31-1, నమన్ ధీర్ 1-0-13-0, కొయెట్జీ 4-0-27-2.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) సాహా (బి) అజ్మతుల్లా 0; రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సాయి కిషోర్ 43; నమన్ ధీర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అజ్మతుల్లా 20; బ్రెవిస్ (సి) అండ్ (బి) మోహిత్ 46; తిలక్ వర్మ (సి) సబ్-మనోహర్ (బి) జాన్సన్ 25; డేవిడ్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 11; హార్దిక్ (సి) తెవాటియా (బి) ఉమేశ్ 11; కొయెట్జీ (సి అండ్ బి) జాన్సన్ 1; ములానీ (నాటౌట్) 1; చావ్లా (సి) రషీద్ ఖాన్ (బి) ఉమేశ్ 0; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-0, 2-30, 3-107, 4-129, 5-142, 6-148, 7-150, 8-160, 9-160. **బౌలింగ్:** ఒమర్జాయ్ 3-0-27-2, ఉమేశ్ 3-0-31-2, రషీద్ 4-0-23-0; సాయి కిషోర్ 4-0-24-1, జాన్సన్ 2-0-25-2, మోహిత్ శర్మ 4-0-32-2.

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X పంజాబ్

వేదిక: బెంగళూరు

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

గెలుపు దిశగా శ్రీలంక

రెండో ఇన్నింగ్స్‌లోనూ ధనంజయ, మెండిస్ సెంచరీలు



మెండిస్, ధనంజయ

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక జట్టు విజయం దిశగా పయనిస్తోంది. లంక నిర్దేశించిన 511 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బంగ్లాదేశ్... మూడో రోజు ఆట ముగిసే సమయానికి 47 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 119/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 110.4 ఓవర్లలో 418 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేసిన ధనంజయ డిసిల్వా (108; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కామిందు మెండిస్ (164; 16 ఫోర్లు, 6 సిక్స్‌లు) అనూహ్యంగా రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకాలు బాది చరిత్ర పుటల్లోకి ఎక్కారు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే టెస్టులో ఇద్దరు బ్యాటర్లు రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు చేయడం ఇది మూడోసారి. గతంలో 1974లో న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఇయాన్ చాపెల్ (145, 121), గ్రెగ్ చాపెల్ (247 నాటౌట్, 133)...2014లో అబుదాబిలో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ బ్యాటర్లు మిస్బా ఉల్ హక్ (101, 101 నాటౌట్), అజహర్ అలీ (109, 100 నాటౌట్) ఈ ఘనత సాధించారు.

రాజస్తాన్ గెలుపు బోణీ...

- సామ్సన్ కెప్టెన్ ఇన్నింగ్స్
- 20 పరుగులతో లక్నో ఓటమి
- కేఎల్ రాహుల్, పూరన్ శ్రమ వృథా



సామ్సన్

జైపూర్: ఈ ఐపీఎల్‌లో చెన్నై, పంజాబ్, కోల్‌కతా లాగే సొంతగడ్డపై రాజస్తాన్ రాయల్స్ కూడా విజయంతో సీజన్‌కు శ్రీకారం చుట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సంజూ సామ్సన్ (52 బంతుల్లో 82 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగడంతో రాయల్స్ 20 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలిచింది. టాస్ నెగ్గిన రాజస్తాన్ ముందుగా 20 ఓవర్లలో 4 వికెట్లకు 193 పరుగులు చేసింది. తర్వాత లక్నో 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులే చేసి ఓడిపోయింది. నికోలస్ పూరన్ ((41 బంతుల్లో 64 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (44 బంతుల్లో 58; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

సంజూ... ఓ రేంజ్‌లో!

ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (12 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (11; 2 ఫోర్లు)ల వేగానికి ఆదిలోనే సీమర్లు మోసిన్, నవీనుల్ కళ్లెం వేశారు. మూడో ఓవర్లో క్రీజులోకి వచ్చిన సామ్సన్‌కు ఆరో ఓవర్లో రియాన్ పరాగ్ (29 బంతుల్లో 43; 1 ఫోర్, 3 సిక్స్) జతయ్యాక రాజస్తాన్ ఆట మారిపోయింది. ఇద్దరు కలిసికట్టుగా లక్నో బౌలర్లపై వేగంగా పరుగులు రాబట్టారు. యశ్ ఠాకూర్, రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో చూడచక్కని సిక్సర్లతో అలరించారు. 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న సామ్సన్ ఆఖరిదాకా క్రీజ్ వీడలేదు, వేగం మానలేదు. మూడో వికెట్‌కు సామ్సన్, పరాగ్ 93 పరుగులు జోడించాక పరాగ్ అవుటయ్యాడు. హెట్‌మైర్ (5) నిరాశపరచగా, డెత్ ఓవర్లలో కెప్టెన్‌తో కలిసి ధ్రువ్ జురెల్ (12 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడాడు.

ఆరంభంలోనే...

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన సూపర్ జెయింట్స్ ఆరంభంలోనే కష్టాల పాలైంది. ఓపెనర్ డికాక్ (4), దేవదత్ పడిక్కల్ (0), ఆయుశ్ బదోని (1)లను బౌల్ట్, బర్గర్ పడగొట్టేశారు. అప్పుడు లక్నో స్కోరు 11/3. ఈ దశలో ఓపెనర్, కెప్టెన్ రాహుల్ అడపాదడపా షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపిస్తుంటే... దీపక్ హుడా (13 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేసే పనిలో చహల్ మ్యాజిక్‌కు బోల్తా పడ్డాడు. రాహుల్, పూరన్ చాలాసేపు క్రీజులో నిలవడంతో 16వ ఓవర్ వరకు 145/4 స్కోరు వద్ద లక్నోకు గెలిచే చాన్స్ కనిపించింది. 24 బంతుల్లో 49 పరుగుల సమీకరణం వద్ద రాహుల్‌ను సందీప్... మరుసటి ఓవర్లో హిట్టర్ స్టొయినిస్ (3)ను అశ్విన్ అవుట్ చేయడంతో సూపర్ జెయింట్స్ లక్ష్యానికి దూరమైంది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) కృనాల్ (బి) మోసిన్ 24; బట్లర్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 11; సామ్సన్ (నాటౌట్) 82; పరాగ్ (సి) సబ్-హుడా (బి) నవీనుల్ 43; హెట్‌మైర్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 5; జురెల్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 193. వికెట్ల పతనం:** 1-13, 2-49, 3-142, 4-150. **బౌలింగ్:** మోసిన్ 4-0-45-1, నవీనుల్ 4-0-41-2, కృనాల్ పాండ్యా 4-0-19-0, రవి బిష్ణోయ్ 4-0-38-1, యశ్ ఠాకూర్ 3-0-43-0, ఆయుశ్ 1-0-6-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 4; రాహుల్ (సి) జురెల్ (బి) సందీప్ 58; పడిక్కల్ (బి) బౌల్ట్ 0; బదోని (సి) బట్లర్ (బి) బర్గర్ 1; హుడా (సి) జురెల్ (బి) చహల్ 26; పూరన్ (నాటౌట్) 64; స్టొయినిస్ (సి) జురెల్ (బి) అశ్విన్ 3; కృనాల్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1-4, 2-10, 3-11, 4-60, 5-145, 6-154. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-35-2, బర్గర్ 3-0-30-1, అశ్విన్ 4-0-35-1, అవేశ్ ఖాన్ 3-0-21-0, చహల్ 3-0-25-1, సందీప్ శర్మ 3-0-22-1.

విద్య, ఉద్యోగ సమాచారం

సెబీలో 97 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ).. వివిధ విభాగాల్లో ఆఫీసర్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97
» **పోస్టుల వివరాలు:** జనరల్-62, లీగల్-05, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-24, ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్)-02, రీసెర్చ్-02, అఫీషియల్ లాంగ్వేజ్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి అభ్యర్థుల వయసు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.44,500 నుంచి రూ.89,150.
» **ఎంపిక విధానం:** ఫేజ్-1, ఫేజ్-2 ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **గమనిక:** పూర్తి వివరాలు 13.04.2024న వెల్లడి కానున్నాయి.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.sebi.gov.in

ఏపీ ఈసెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ).. ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్-2024) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ /బీటెక్ /బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఈ పరీక్షను జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహించనుంది.

» **అర్హత:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు, బీఎస్సీ మ్యాథ్స్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ఏపీఈసెట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నాపత్రం 200 ప్రశ్నలతో మొత్తం 200 మార్కులకు ఉంటుంది. కోర్సుకు అనుగుణంగా ప్రశ్నాపత్రాలు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది:** 15.04.2024.
» **పరీక్ష తేది:** 08.05.2024
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

ఇండియన్ బ్యాంక్, చెన్నైలో 146 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న ఐబీ శాఖల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 146
» **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్,మేనేజర్.
» **విభాగాలు:** క్రెడిట్, ఎన్ఆర్ బిజినెస్ రిలేషన్‌షిప్, సెక్యూరిటీ, ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈవో అండ్ వెబ్‌సైట్ స్పెషలిస్ట్, సోషల్ మీడియా స్పెషలిస్ట్, క్రియేటివ్స్ ఎక్స్‌పర్ట్, ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్, ట్రెజరీ డీలర్, ట్రేడింగ్/ఆర్బిట్రేజ్ ఇన్ కరెన్సీ ఫ్యూచర్స్, ట్రేడింగ్ ఇన్ ఇంటర్ బ్యాంక్, మేనేజర్-డీబీఏ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ/సీడబ్ల్యూఏ /ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష/ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.04.2024
» **వెబ్‌సైట్:** www.indianbank.in

యూపీఎస్సీలో 28 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **పోస్టుల వివరాలు:** ఆంత్రోపాలజిస్ట్(ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా)-08, అసిస్టెంట్ కీపర్(ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా)-01, సైంటిస్ట్ బి(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)-03, రీసెర్చ్ ఆఫీసర్/ప్లానింగ్ ఆఫీసర్(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్)-01, అసిస్టెంట్ మైనింగ్ జియాలజిస్ట్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)-01, అసిస్టెంట్ మినరల్ ఎకనామిస్ట్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)-01, ఎకనామిక్ ఆఫీసర్(రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్)-09, సీనియర్ లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్(అనెస్థీషియాలజీ)-03, సీనియర్ లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్(రేడియో-డయాగ్నోసిస్)-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.03.2024
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

మేటి సంస్థల్లో ఎంసీఏ

పీజీ స్థాయిలో కంప్యూటర్ స్పెషలైజేషన్‌తో.. సాఫ్ట్‌వేర్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్ నిట్‌ల్లో ఎంసీఏలో అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. నిట్‌లు నిర్వహించే నిమ్‌సెట్‌లో స్కోర్‌తో ప్రవేశం సొంతం చేసుకోవచ్చు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి నిమ్‌సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నిమ్‌సెట్ ప్రత్యేకత, ఎంపిక విధానం, పరీక్ష ప్యాట్రన్, సిలబస్ విశ్లేషణ, ఎంసీఏతో కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

» నిట్ క్యాంపస్‌ల్లో ఎంసీఏ ప్రవేశాలకు నిమ్‌సెట్
» నిట్‌ల్లో ఎంసీఏతో ఐటీలో దీటైన కెరీర్ అవకాశాలు
» నిమ్‌సెట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం



మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్.. సంక్షిప్తంగా ఎంసీఏ. ఈ కోర్సు బ్యాచిలర్ డిగ్రీ తర్వాత కంప్యూటర్ పీజీకి చక్కటి మార్గం. ఎంసీఏను బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదివేందుకు అవకాశం కల్పిస్తుంది నిమ్‌సెట్. దేశంలో ఇంజనీరింగ్ కోర్సులను అందించడంలో మంచి పేరున్న నిట్‌లు.. పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సును అందిస్తున్నాయి. ఈ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షనే.. నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (నిమ్‌సెట్).

11 క్యాంపస్‌లు.. 1,033 సీట్లు

నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా ప్రస్తుతం 11 నిట్ క్యాంపస్‌ల్లో ఎంసీఏలో ప్రవేశం కల్పిస్తున్నారు. అగర్తల-30 సీట్లు, అలహాబాద్-116 సీట్లు, భోపాల్-115, జంషెడ్‌పూర్- 115, కురుక్షేత్ర-64, కురుక్షేత్ర (సెల్ఫ్ ఫైనాన్సింగ్) 32, రాయ్‌పూర్ 110, సూరత్‌కల్-58, తిరుచిరాపల్లి-115, వరంగల్-58, భోపాల్ -60, పాట్నా (డేటా సైన్స్, ఇన్ఫర్మాటిక్స్- 40, పాట్నా (ఏఐ అండ్ ఐఓటీ)-40 సీట్లు ఉన్నాయి. వీటితోపాటు నిట్ పాట్నాలో డేటా సైన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్‌లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో 40; అదే విధంగా ఏఐ అండ్ ఐఓటీలోనూ సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో మరో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నిట్ సూరత్‌కల్, నిట్-వరంగల్ క్యాంపస్‌లు మూడేళ్ల వ్యవధిలో ఎంసీఏ ప్రోగ్రామ్‌ను అందిస్తూ.. రెండో ఏడాది తర్వాత ఎగ్జిట్ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. రెండేళ్ల తర్వాత మానేయాలనుకునే వారికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు.

అర్హతలు

మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లలో ఏదో ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా 60 శాతం మార్కులు/ 6.5 సీజీపీఏతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 55 శాతం మార్కులు లేదా 6 జీపీఏ పొందాలి) ఉండాలి. (లేదా) బీఈ/బీటెక్ చదివిన వారు కూడా నిమ్‌సెట్-2024కు దరఖాస్తు చేసుకోవచ్చు. బీసీఏ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సు ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే. అదే విధంగా అర్హత కోర్సు చివరి సంవత్సరం/సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు సెప్టెంబర్ 30 లోపు సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.

3 విభాగాలు.. 1000 మార్కులు

నిమ్‌సెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో మొత్తం మూడు విభాగాల్లో వేయి మార్కులకు ఉంటుంది. మొదటి విభాగంలో మ్యాథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు-600 మార్కులకు అడుగుతారు. రెండో విభాగంలో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు-240 మార్కులకు ఉంటాయి. మూడో విభాగంలో కంప్యూటర్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు-120 మార్కులకు; జనరల్ ఇంగ్లిష్ 10 ప్రశ్నలు-40 మార్కులకు అడుగుతారు. నెగెటివ్ మార్కుల విధానం ఉంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

ఉమ్మడి కౌన్సెలింగ్ అడ్మిషన్

నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పించే 11 నిట్‌లు ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తాయి. అభ్యర్థులు నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా నిమ్‌సెట్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఇలా అప్లికేషన్ పూర్తి చేసే సమయంలోనే ప్రాధాన్యతా క్రమంలో తమకు ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లను పేర్కొనాలి. ఆ తర్వాత అభ్యర్థులకు వచ్చిన ర్యాంకు, ఎంచుకున్న ఇన్‌స్టిట్యూట్‌లు, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ చేస్తారు.

ఉజ్వల అవకాశాలు

నిమ్‌సెట్ ద్వారా నిట్‌ల్లో ఎంసీఏలో ప్రవేశం పొందితే ఉజ్వల భవిష్యత్తుకు మార్గం ఏర్పడినట్లే!. ఈ కోర్సు బోధనలో నిట్‌లు అనుసరిస్తున్న ప్రమాణాలు, నాణ్యత కారణంగా విద్యార్థులకు కంప్యూటర్ అప్లికేషన్స్, ఇతర సాఫ్ట్‌వేర్ అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. దీంతో వీరికి సీఎస్ఈ అభ్యర్థులకు దీటుగా అవకాశాలు లభిస్తున్నాయి. గత మూడేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. సదరు నిట్‌ల్లో ఎంసీఏ పూర్తి చేసుకున్న వారిలో నూటికి తొంభై శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఖరారవుతున్నాయి. అదే విధంగా వేతనాలు కూడా సగటున రూ.ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల వరకు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 2024, ఏప్రిల్ 20.
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2024, ఏప్రిల్ 24-ఏప్రిల్ 26.
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 28 - జూన్ 8.
- **నిమ్‌సెట్ పరీక్ష తేదీ:** 2024,జూన్ 8
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nimcet.in

బెస్ట్ స్కోర్‌కు మార్గాలు

మ్యాథమెటిక్స్

ఈ విభాగానికి సంబంధించి విద్యార్థులు తమ బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలోని మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా సెట్ థియరీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, అల్జీబ్రా, కో ఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగ్నోమెట్రీలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలి. వీటిలో సంబంధిత అంశాల కాన్సెప్టులు, అప్లికేషన్స్‌పై పట్టు సాధించాలి.ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా సైంటిఫిక్ కంప్యూటర్ కాలిక్యులేటర్‌పై అవగాహన పెంచుకోవాలి.

అనలిటికల్ ఎబిలిటీ,లాజికల్ రీజనింగ్

అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్.. నిమ్‌సెట్‌లో మరో కీలక విభాగం. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. అభ్యర్థులు విశ్లేషణ నైపుణ్యాలను, అదే విధంగా తార్కిక ఆలోచనను పెంచుకోవాలి.

ఇందుకోసం ప్రామాణిక పుస్తకాలను చదువుతూ ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా నిమ్‌సెట్ గత ప్రశ్న పత్రాల సాధన కూడా ఉపకరిస్తుంది.

కంప్యూటర్ అవేర్‌నెస్

అభ్యర్థుల్లోని కంప్యూటర్ బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌కు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా డేటా రిప్రజెంటేషన్ అంశాలపైనా పట్టు సాధించాలి.

జనరల్ ఇంగ్లిష్

అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి మార్కులు పొందడానికి కాంప్రెహెన్షన్, వొకాబ్యులరీ, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం కాంపిటీటివ్ ఇంగ్లిష్ టెస్ట్ బుక్స్‌ను అధ్యయనం చేయాలి. వీటితోపాటు కాంప్రెహెన్షన్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను చదవడం మంచిది.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

అభ్యర్థులు రీడింగ్‌తో పాటు ప్రాక్టీస్‌కు కూడా ప్రిపరేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజు తాము చదివిన అంశాలకు సంబంధించి ప్రశ్నార్థమైన వాటిని గుర్తించి సెల్ఫ్ టెస్ట్‌లు రాసుకోవాలి. అదే విధంగా మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు రాయడం కూడా ఎంతో మేలు చేస్తుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
191	83
72,832	22,097

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	16,429	▲	27
డోజోన్స్	39,476	▼	305
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,931	▲	48
డాక్స్	18,213	▲	33
షాంఘై	3,048	▼	29
నికాయ్	40,897	▲	62


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎటుకు	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఎటుకు	104.10	106.66
€	యూరో	ఎటుకు	89.19	91.57
¥	జపాన్ ఎన్ (100)	ఎటుకు	54.43	55.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎటుకు	53.52	55.42
S$	సింగపూర్ డాలర్	ఫారెక్స్	59.46	64.27
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.31	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.79	23.64
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.41	12.51

మీ పెట్టుబడులకు రక్షణ ఉందా?


స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు స్ట్రెస్ టెస్ట్ • ప్రతి నెలా డేటా విడుదల • పెట్టుబడుల్లో రిస్కులు తెలుసుకునే చాన్స్



రిటైల్ ఇన్వెస్టర్లకు చిన్న కంపెనీలంటే చెప్పలేనంత ఆకర్షణ. అందుకే నేరుగా స్టాక్స్‌లో లేదంటే మ్యూచువల్ ఫండ్స్ రూపంలో స్మాల్, మిడ్‌క్యాప్ కంపెనీల్లోనే ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తుంటారు. పెద్ద కంపెనీలతో పోల్చి చూస్తే, దీర్ఘకాలంలో చిన్న, మధ్యస్థాయి కంపెనీల్లో అధిక రాబడులు వారిని ఆకట్టుకుంటున్నాయి. కానీ, పెద్ద కంపెనీలతో పోలిస్తే వీటిల్లో రిస్క్ పాళ్లు అధికం. ఈ రిస్క్‌ను రిటైల్ ఇన్వెస్టర్లలో అధిక శాతం మంది పట్టించుకోవడం లేదు. ఫలితం మార్కెట్ దిద్దుబాట్లలో తప్పటడుగుల కారణంగా భారీగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ రిస్క్‌ను ఇన్వెస్టర్లు అర్థం చేసుకునేందుకు తీసుకొచ్చిందే స్ట్రెస్ టెస్ట్.

గడిచిన మూడేళ్ల డేటాను గమనించినట్టయితే స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి భారీ మొత్తంలో పెట్టుబడులు వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్క 2023 సంవత్సరంలోనే మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.23,000 కోట్లు వస్తే.. చిన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే స్మాల్ క్యాప్ పథకాలు రూ.41,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2022లోనూ మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.20,500 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.19,795 కోట్ల చొప్పున వచ్చాయి. కానీ, అస్థిరతలు తక్కువగా ఉండే లార్జ్‌క్యాప్ పథకాల నుంచి 2023లో ఇన్వెస్టర్లు రూ.3,000 కోట్లను ఉపసంహరించుకోవడం గమనార్హం. మూడేళ్ల కాలంలో స్మాల్ క్యాప్ ఫండ్స్ ఏటా 24 శాతం చొప్పున రాబడిని ఇవ్వగా, మిడ్‌క్యాప్ ఫండ్స్ ఏటా 22 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించాయి. ఈ స్థాయి రాబడిని చూసి ఇన్వెస్టర్లు మరింతగా పెట్టుబడులను ఈ పథకాల్లోకి కుమ్మరిస్తున్నారు. వచ్చే పెట్టుబడుల ప్రవాహానికి తగ్గట్టు ఫండ్స్ సంస్థలు చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో ఆ మేరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. ఇవన్నీ కలసి స్టాక్స్ వ్యాల్యుయేషన్లు ఓ బుడగ మాదిరి తయారవుతున్నట్టు క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఆందోళన చెందింది. ఫలితంగా కొన్ని అసాధారణ నిర్ణయాలు తీసుకుంది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో ఉండే రిస్క్ నుంచి ఇన్వెస్టర్ల ప్రయోజనాల రక్షణకు కార్యాచరణ రూపొందించుకోవాలని, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి పెట్టుబడులను నియంత్రించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు, అన్ని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు సంబంధించి 'స్ట్రెస్ టెస్ట్' నిర్వహించాలని ఫండ్స్ సంస్థలను (ఏఎంసీలు) ఆదేశించింది. లిక్విడిటీ స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ప్రకటిస్తున్నాయి. వీటి గురించి తెలుసుకోవడం అవసరం.

ఏమిటీ ఈ స్ట్రెస్ టెస్ట్?



పైకి ఎలాంటి అనారోగ్య సమస్యలూ కనిపించకపోవచ్చు. మరి అనూహ్యంగా హార్ట్ ఎటాక్‌తో చిన్న వయసులోనే కొందరు ఎందుకు మరణిస్తున్నట్టు? గుండె సామర్థ్యాన్ని, సమీప కాలంలో వచ్చే ముప్పును తెలుసుకునేందుకు వైద్యులు ట్రెడ్ మిల్ టెస్ట్ (టీఎంటీ) నిర్వహిస్తుంటారు. మెషిన్‌పై శ్రమతో నడుస్తున్న సమయంలో గుండె స్పందనలు ఎలా ఉన్నాయనే దాని ఆధారంగా భవిష్యత్ రిస్క్‌లను వైద్యులు అంచనా వేస్తారు. మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన స్ట్రెస్ టెస్ట్ కూడా ఇదే మాదిరి అనుకోవచ్చు. 2020 కరోనా సమయంలో స్టాక్ మార్కెట్ క్రాష్ గుర్తుండే ఉంటుంది. ఈ తరహా పతనాల్లో మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తమ నిర్వహణలోని పెట్టుబడుల (ఏయూఎం)ను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తాయి? రిస్క్‌ను ఎలా ఎదుర్కొంటాయి? ఇన్వెస్టర్ల ప్రయోజనాలను ఎంత మేరకు కాపాడగలవు? ఇన్వెస్టర్లు ఒక్కసారిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తే తిరిగిచ్చే సామర్థ్యం ఫండ్స్ సంస్థలకు ఉంటుందా? ఇత్యాది అంశాలన్నీ తెలుసుకోవడానికి ఈ స్ట్రెస్ టెస్ట్ ఉపకరిస్తుంది.

మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఇది కొత్తగా విని ఉండొచ్చేమో..! కానీ ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి బ్యాంక్‌లకు సంబంధించి లిక్విడిటీ స్ట్రెస్ టెస్ట్‌ను నిర్వహిస్తుంటుంది. బ్యాంకుల్లో నగదు లభ్యత ఎలా ఉంది? కొరతను ఎదుర్కొంటున్నాయా? అన్నది ఆర్‌బీఐ మదింపు చేస్తుంటుంది.

దీని అవసరం..?



బాండ్ల మార్కెట్లలో మాదిరే ప్రతికూల సమయాల్లో స్మాల్, మిడ్‌క్యాప్ పథకాలకు సంబంధించి కూడా లిక్విడిటీ సమస్య ఏర్పడుతుంటుంది. ఒక మోస్తరు ఆస్తులను (పెట్టుబడులు/ఏయూఎం) నిర్వహిస్తున్నంత వరకు ఈ లిక్విడిటీ అనేది మ్యూచువల్ ఫండ్స్‌కు పెద్ద సమస్య కాబోదు. కానీ, గడిచిన ఏడాది రెండేళ్లలో స్మాల్, మిడ్ క్యాప్ పథకాల్లోకి వస్తున్న భారీ పెట్టుబడులు లిక్విడిటీ పరంగా కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. 2024 ఫిబ్రవరి నాటికి అన్ని స్మాల్‌క్యాప్ ఫండ్స్ నిర్వహణలోని ఏయూఎం రూ.2.49 లక్షల కోట్లకు చేరితే, మిడ్‌క్యాప్ ఫండ్స్ ఏయూఎం రూ.2.95 లక్షల కోట్లకు చేరుకోవడాన్ని ఇక్కడ గమనించాలి. ఇప్పుడు ఈ విభాగాల్లోని పెద్ద పథకాలు ఒక్కో దాని నిర్వహణలోని ఆస్తులు రూ.25,000–60,000 కోట్లకు చేరాయంటే ఏ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. రూ.60,000 కోట్ల ఆస్తులు నిర్వహించే పథకం ఒక శాతం (రూ.600 కోట్లు) మేర స్టాక్స్‌ను విక్రయించినా దాన్ని మార్కెట్ సర్దుబాటు చేసుకోవడం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా లిక్విడిటీ తక్కువగా ఉండే స్టాక్స్‌లో (తక్కువ వ్యాల్యూమ్ ట్రేడ్ అయ్యేవి) ఈ రిస్క్ ఇంకా ఎక్కువ. కొద్ది అమ్మకాలకే స్టాక్ ధరలు నేలచూపులు చూస్తాయి. దీంతో ఆయా పథకాల యూనిట్ నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్‌ఏవీ) అదే స్థాయిలో పడిపోతుంది.

స్ట్రెస్ టెస్ట్ ఎలా నిర్వహిస్తారు?

పథకాల పోర్ట్‌ఫోలియోలో 50, 25 శాతం మేర స్టాక్స్‌ను విక్రయించేందుకు వీలుగా మ్యూచువల్ ఫండ్స్ సంస్థల మేనేజర్లు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. తమ స్టాక్స్‌కు సంబంధించి గడిచిన మూడు నెలల్లో సగటు ట్రేడింగ్ వ్యాల్యూమ్‌ను పరిశీలిస్తారు. లిక్విడిటీ (వ్యాల్యూమ్) చాలా తక్కువగా ఉన్న దిగువ స్థాయి 20 శాతం స్టాక్స్‌ను మినహాయిస్తారు. మిగిలిన స్టాక్స్ వాల్యూమ్ మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కొనే సమయంలో ఏ మేరకు పెరుగుతుందన్నది ఊహాత్మక గణాంకాల ఆధారంగా అంచనా వేస్తారు. ఈ గణాంకాల ఆధారంగా పోర్ట్‌ఫోలియోలోని స్టాక్స్ (హోల్డింగ్స్)ను ఎన్ని రోజుల్లో విక్రయించగలమనే అంచనాకు వస్తాయి. ఒక పథకం తన పెట్టుబడుల్లో 25 శాతాన్ని, 50 శాతాన్ని ఎన్ని రోజుల్లో విక్రయించగలదన్నది దీని ద్వారా తెలుస్తుంది. సెబీ ఆదేశాల ప్రకారం ఫండ్స్ ప్రతి నెలా ఈ విధమైన స్ట్రెస్ టెస్ట్ నిర్వహించి, ఫలితాలను తర్వాతి 15 రోజుల్లోపు ఆన్‌లైన్ పోర్టల్‌పై వెల్లడించాలి. ఆయా పథకాల్లో పెట్టుబడులు పెట్టిన టాప్–10 ఇన్వెస్టర్ల వివరాలను కూడా ఫండ్స్ వెల్లడించాల్సి ఉంటుంది.

వర్రీ అక్కర్లేదు..

ఒక పథకం తన నిర్వహణ పెట్టుబడుల్లో 50 శాతం విక్రయించేందుకు 60 రోజుల సమయం పడుతుందని వెల్లడించిన సందర్భాల్లో.. ఇన్వెస్టర్ల ఉపసంహరణ క్లెయిమ్‌లు ఒకే సారి ఎక్కువ మొత్తంలో వస్తే ఆమోదిస్తుందా? అన్న సందేహం అక్కర్లేదు. ఈ స్ట్రెస్ టెస్ట్ ఫలితాలు అన్నీ కూడా వాస్తవంగా మార్కెట్లో విక్రయించి, వెల్లడించిన డేటా కాదు. మార్కెట్ పతనాల్లో ఎన్ని రోజుల్లో విక్రయించగలమో ఊహాత్మకంగా వేసిన అంచనాలే. ఆయా సమయంలో ఫండ్స్ పెట్టుబడుల్లో ఉండే రిస్క్‌ల గురించి తెలుసుకునేందుకు ఈ డేటా ఇన్వెస్టర్లకు సాయంగా ఉంటుంది. ముఖ్యంగా పెట్టుబడుల్లో 25 శాతం నుంచి 50 శాతం మేర ఉపసంహరణ ఒత్తిళ్లు రావడం అన్నది చాలా అరుదుగానే ఉంటుంది. ఎక్కువ సందర్భాల్లో పెట్టుబడుల ఉపసంహరణ ఒత్తిళ్లు 10 శాతం మించవు. దీనికంటే కూడా మార్కెట్లు పడడం మొదలైన తర్వాత ఇన్వెస్టర్లు తాజా పెట్టుబడులు నిలిపివేయడం మన దేశంలో ఎక్కువగా కనిపిస్తుంది. అంతే కానీ అప్పటికే చేసిన ఫండ్స్ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం అరుదు. నష్టభయమే దీనికి కారణం. నిజానికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలైన అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు) లిక్విడిటీ రిస్క్ విషయంలో తగిన సన్నద్ధంగానే ఉంటాయి. అందుకే స్మాల్‌క్యాప్ అయినా, మిడ్‌క్యాప్ అయినా పెట్టుబడుల్లో 35 శాతం వరకు తీసుకెళ్లి లార్జ్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ఎదురైతే ముందుగా లార్జ్‌క్యాప్ పెట్టుబడులనే నగదుగా మార్చుకుంటాయి. దీనికి తోడు పథకంలో కొంత మేర నగదు నిల్వలు కూడా ఉంటాయి. వీటికి అదనంగా పథకం మొత్తం పెట్టుబడుల విలువలో 20 శాతం మేర రుణం తీసుకుని స్వల్పకాల అమ్మకాల ఒత్తిడిని అధిగమించేందుకు సెబీ నిబంధనలు అనుమతిస్తున్నాయి.

విశ్లేషణకు కీలక డేటా

స్ట్రెస్ టెస్ట్ డేటాతో ఇన్వెస్టర్లకు తాము ఇన్వెస్ట్ చేసిన పథకాల్లో ఉండే రిస్క్ ఎంతన్నది తెలుస్తుంది. ఎన్ని రోజుల్లో పెట్టుబడులను ఫండ్ మేనేజర్లు నగదుగా మార్చుకుంటున్నారన్నది ఇందులో కీలకమైన అంశం. ఇప్పటి వరకు విడుదలైన స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను ఒక్కసారి తప్పకుండా గమనించాలి. స్మాల్‌క్యాప్ పథకాలు తమ పెట్టుబడుల్లో 50 శాతాన్ని విక్రయించి నగదుగా మార్చుకునేందుకు సగటున 22 నుంచి 60 రోజులు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. అదే 25 శాతం పెట్టుబడులను విక్రయించేందుకు 11–30 రోజుల సమయం పడుతోంది. మొత్తం ఒకే రోజు విక్రయించేందుకు ఇక్కడ అవకాశాలు పరిమితం. ఎందుకంటే ఆయా స్టాక్స్‌లో లిక్విడిటీ (ట్రేడింగ్ వ్యాల్యూమ్) చాలా తక్కువగా ఉంటుందన్న అంశాన్ని గుర్తు పెట్టుకోవాలి. సాధారణంగా స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ పథకాల వద్ద నగదు నిల్వలు 4.5 శాతం నుంచి 11 శాతం మధ్య ఉన్నాయి. ఒకేసారి అమ్మకాల ఒత్తిడి ఎదురైతే తొలుత ఈ నగదు నిల్వలతో ఫండ్స్ గట్టెక్కగలవు. అప్పటికీ రిడెంప్షన్ (ఉపసంహరణ) ఒత్తిడి ఆగకపోతే పెట్టుబడులను విక్రయించాల్సి వస్తుంది.

ఆయా పథకంలో కేవలం కొద్ది మంది ఇన్వెస్టర్లే ఎక్కువ పెట్టుబడులు కలిగి ఉన్నారా? లేదా అన్నది తెలుస్తుంది. ఉదాహరణకు ఒక పథకం నిర్వహణలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు ఉన్నాయని అనుకుందాం. కేవలం ఐదు, పది మంది ఇన్వెస్టర్లకు సంబంధించే రూ.500 కోట్ల పెట్టుబడులు ఉంటే, అది రిస్క్‌కు దారితీస్తుంది. ఆ స్థాయిలో పెట్టుబడులు కలిగి ఉన్నవారు స్మార్ట్ ఇన్వెస్టర్ల కిందకే వస్తారు. మార్కెట్ పతనం మొదలైన వెంటనే, ముందుగా వారు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నిస్తే పథకం ఎన్‌ఏవీ దారుణంగా పడిపోతుంది. ఇది మిగిలిన ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అయితే, తాజా స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను గమనిస్తే ఈ రిస్క్ దాదాపు లేనట్టేనని తెలుస్తోంది. ఒక పథకం పెట్టుబడుల విలువలో టాప్–10 ఇన్వెస్టర్లకు సంబంధించి పెట్టుబడుల విలువ 0.61–2.1 శాతం మించి లేదు.

స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాలు అయినప్పటికీ లార్జ్‌క్యాప్ కంపెనీలకు సైతం చెప్పుకోతగ్గ మేర కేటాయింపులు చేసిన పథకాల్లో లిక్విడిటీ రిస్క్ చాలా తక్కువ. ఎందుకంటే లార్జ్‌క్యాప్‌లో లిక్విడిటీ సమస్య ఉండదు. కావాలంటే ఒకే రోజు మొత్తం పెట్టుబడులను విక్రయించుకోగలవు. ఇక స్మాల్‌క్యాప్ ఫండ్స్‌తో పోలిస్తే మిడ్‌క్యాప్ ఫండ్స్ లిక్విడిటీ మెరుగ్గా ఉంది. స్మాల్‌క్యాప్ పథకాలతో పోలిస్తే సగం వ్యవధిలోనే మిడ్‌క్యాప్ ఫండ్స్ తమ పెట్టుబడులను విక్రయించుకోగలవని స్ట్రెస్ టెస్ట్ డేటా తెలియజేస్తోంది. కాకపోతే మిడ్‌క్యాప్ పథకాల్లో టాప్–10 ఇన్వెస్టర్లకు సంబంధించిన పెట్టుబడులు 1.3–4.9 శాతం మధ్య ఉన్నాయి. అంటే కొంచెం కాన్సన్‌ట్రేషన్ రిస్క్ ఉన్నట్టు. అవసరమైతే డేటా విశ్లేషణకు నిపుణుల సలహాలు తీసుకోవచ్చు.

సంక్షోభాల్లో ఎలా..?

తీవ్ర ప్రపంచ ప్రతికూల పరిణామాల్లో మార్కెట్లు కుప్పకూలితే, ఫండ్స్ పథకాలు లిక్విడిటీ రిస్క్‌ను గట్టెక్కుతాయా? అంటే అవుననే చెప్పుకోవాలి. కానీ, వాస్తవ పరిస్థితుల్లో ఫలితాలు ఇలానే ఉండాలని లేదు. అప్పుడు ఇన్వెస్టర్లు ఎలా ప్రతిస్పందిస్తారు..? ప్రతికూల పరిణామాలు స్వల్ప కాలమా? లేక దీర్ఘకాలమా? తదితర అంశాలు అప్పటి వాస్తవ లిక్విడిటీ రిస్క్‌ను ప్రభావితం చేస్తాయి. ఎలాంటి ప్రతికూల పరిణామాలు అయినా సరే తమ పెట్టుబడులను వెనక్కి ఇవ్వాలని ఇన్వెస్టర్లు కోరితే.. ఫండ్స్ సంస్థలు తప్పకుండా అనుసరించాల్సిందే. నష్టానికి అయినా అవి అమ్మి చెల్లింపులు చేస్తాయి.

మార్గం ఏంటి?

స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్ లిక్విడిటీ తక్కువగా ఉండే స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అంతేకానీ, పెట్టుబడుల ఉపసంహరణకు ఇది సంకేతం కాదు. రిస్క్‌లను అర్థం చేసుకోలేని వారు, ఎన్‌ఏవీలు గణనీయంగా పడిపోయినప్పుడు ఓపిక పట్టలేని వారు ఈ తరహా పెట్టుబడులను తగ్గించుకోవాలి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులను స్వల్పకాలిక ఆటుపోట్లను చూసి విక్రయించుకోవడం సరైన నిర్ణయం అనిపించుకోదు. అంత రిస్క్ వద్దనుకుంటే లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేసుకోవాలి. ఒకేసారి ఒక పథకం నుంచి 25–50 శాతం పెట్టుబడులు బయటకు వెళ్లిపోవడం సాధారణంగా జరగదు. కనుక స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పెట్టుబడులకు దూరంగా ఉండాల్సిన అవసరం ఏమీ లేదు.

ఇవీ ఉదాహరణలు

- రూ.46,000 కోట్ల పెట్టుబడులను నిర్వహించే నిప్పన్ ఇండియా స్మాల్‌క్యాప్ ఫండ్. తన పెట్టుబడుల్లో 50 శాతాన్ని నగదుగా మార్చుకునేందుకు 27 రోజులు, 25 శాతం పెట్టుబడుల విక్రయానికి 13 రోజులు పడుతుందని స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను విడుదల చేసింది.
- రూ.17,193 కోట్ల పెట్టుబడులను నిర్వహించే క్వాంట్ స్మాల్‌క్యాప్ ఫండ్ తన పెట్టుబడుల్లో 50 శాతం విక్రయించేందుకు 22 రోజులు, 25 శాతాన్ని విక్రయించేందుకు 11 రోజులు తీసుకుంటుందని తెలిపింది.
- రూ.25,500 కోట్లు నిర్వహించే ఎస్‌బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ 50 శాతం పెట్టుబడుల విక్రయానికి 60 రోజులు పడుతుందని వెల్లడించింది.
- క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్ 100% పెట్టుబడుల విక్రయానికి 10 రోజులు, 25% పెట్టుబడుల అమ్మకానికి 5 రోజులు చాలని ప్రకటించింది.
- అదే యాక్సిస్ మిడ్‌క్యాప్ ఫండ్ 50 % పెట్టుబడులను 12 రోజుల్లో, 25% పెట్టుబడులను 6 రోజుల్లో నగదుగా మార్చుకోగలనని పేర్కొంది.



సీజీ కన్జూమర్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 269 **టార్గెట్: రూ. 325**

ఎందుకంటే: ఎలక్ట్రికల్ అప్లయెన్సెస్ దిగ్గజం క్రాంప్టన్ గ్రీవ్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో స్టాండెలోన్ ఆదాయం వార్షికంగా 15 శాతం ఎగసి రూ. 1,460 కోట్లకు చేరింది. ఇది మా అంచనాలకంటే 6 శాతం అధికంకాగా.. కొత్త ప్రొడక్టుల విడుదల, ఊపందుకున్న డిమాండ్ ఇందుకు దోహదపడ్డాయి. విభాగాలవారీగా చూస్తే ఎలక్ట్రికల్ కన్జూమర్ డ్యూరబుల్స్ అమ్మకాలు 19 శాతం పుంజుకున్నాయి. ప్రత్యర్థి కంపెనీలలో హావెల్స్ 3 శాతం, వీగార్డ్ 11 శాతం వృద్ధి చూపగా.. కొన్ని త్రైమాసికాల వెనకడుగు తదుపరి కంపెనీ(సీజీ) లైటింగ్ విభాగం 1 శాతం మెరుగుపడింది. హావెల్స్ లైటింగ్ విభాగం 2 శాతం బలపడింది. క్యూ3లో ఆల్టర్నేట్ చానల్స్ విక్రయాలు 38 శాతం జంప్‌చేశాయి. ప్రధానంగా ఈకామర్స్ అమ్మకాలు రెట్టింపయ్యాయి. బటర్‌ఫ్లై గంధిమతి ఆర్థిక పనితీరును సైతం కంపెనీకి జత చేసి మదింపు చేస్తే ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాలు 7 శాతం తగ్గవచ్చని భావిస్తున్నాం. ఇదేవిధంగా వచ్చే ఏడాది(2024–25)లో ఈపీఎస్ 4 శాతం నీరసించే వీలుంది. గంధిమతి బ్రేక్‌ఈవెన్ ఆలస్యం కావడం, వ్యయాలు కొనసాగడం మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. అయితే డిమాండ్ పరిస్థితులు మెరుగుపడితే కంపెనీకున్న బ్రాండ్ విలువ లబ్దిని చేకూర్చగలదు. పరిశ్రమలోనే అత్యధిక నిర్వహణ లాభ మార్జిన్లు సాధించే కంపెనీకి బటర్‌ఫ్లై కొనుగోలు అదనపు బలాన్నివ్వనుంది. ఈపీఎస్ మెరుగుపడే వీలుంది. వెరసి 2023–26 కాలంలో ఆర్జన 17 శాతం చొప్పున వృద్ధి నమోదుకాగలదని అంచనా వేస్తున్నాం. సగటున ఆర్‌ఓఈ 30 శాతం, ఆర్‌ఓసీఈ 28 శాతానికి చేరే వీలుంది.

సన్ టీవీ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 587 **టార్గెట్: రూ. 750**

ఎందుకంటే: ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో మీడియా దిగ్గజం సన్ టీవీ నెట్‌వర్క్ లిమిటెడ్ నిర్వహణ లాభం(ఇబిటా) వార్షిక ప్రాతిపదికన పెద్దగా వృద్ధిలేకుండా రూ. 570 కోట్లుగా నమోదైంది. ఇది అంచనాలకు అనుగుణంగానే ఉన్నప్పటికీ మార్జిన్లు 2% క్షీణించాయి. ఇందుకు ఆదాయం నెమ్మదించడంతోపాటు.. అధిక నిర్వహణ వ్యయాలు కారణమయ్యాయి. అయితే ఆదాయం వార్షికంగా అంచనాలకు తగ్గట్లుగా 3.3 శాతం బలపడి రూ. 890 కోట్లను తాకింది. క్రికెట్ వరల్డ్ కప్ నేపథ్యంలో ప్రకటనల ఆదాయం నీరసించడం టర్నోవర్‌పై ప్రభావం చూపింది. కొంతకాలంగా ప్రకటనల ఆదాయంలో మందగమనం కొనసాగడంతో టర్నోవర్‌సైతం ప్రభావితమవుతోంది. ప్రకటనల వ్యయాలు పుంజుకోవడం.. ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ విభాగం నుంచి రికవరీ కనిపించడం కంపెనీకి కొంతమేర ప్రోత్సాహాన్నివ్వనుంది. ఓటీటీ విభాగంలో పెట్టుబడుల విషయంలో కంపెనీ ఆచితూచి వ్యవహరించడం, సినిమాల నిర్మాణానికే ప్రాధాన్యత ఇవ్వడం, కంపెనీకిగల ప్రస్తుత లైబ్రరీని ఆదాయ వనరుగా(మానిటైజింగ్) మార్చుకోవడం వంటి అంశాల నేపథ్యంలో వేగంగా విస్తరిస్తున్న ఓటీటీ విభాగంతో రిస్కులు తలెత్తే అవకాశముంది. అయితే కంపెనీకిగల పటిష్ట లిక్విడిటీ పరిస్థితులు, 2023 మార్చికల్లా కంపెనీ చేతిలోగల రూ. 490 కోట్ల నగదు నిల్వలు.. అత్యధిక సంస్థలతో, అత్యంత పోటీగల ఓటీటీ విభాగంలో తగినన్ని పెట్టుబడులు చేపట్టేందుకు దన్నుగా నిలవనున్నాయి. అధిక డివిడెండ్ చెల్లింపులు, సహేతుక విలువ.. కంపెనీ షేరుకి మద్దతిస్తున్నాయి. 2023–25లో ఆదాయం, లాభాల్లో 8% వృద్ధి అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పెళ్లి కోసం పెట్టుబడి ఎక్కడ?





ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా సోదరి వివాహం కోసం ప్రతి నెలా రూ.45,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లేదా డెట్ మ్యూచువల్ ఫండ్స్ లేదా సార్వభౌమ బంగారం బాండ్లలో ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? – జ్యోతి

మన దేశంలో వివాహాలు సాధారణంగా చూస్తే తక్కువ ఖర్చుతో ముగిసేవి కావు. మీరు అనుకుంటున్నట్టు ప్రతి నెలా రూ.45,000 చొప్పున వచ్చే ఆరేళ్ల పాటు ఇన్వెస్ట్ చేసినట్టయితే గణనీయమైన మొత్తమే సమకూరుతుంది. వివాహం లక్ష్యం విషయంలో రాజీపడలేం. అనుకున్న సమయానికి కావాల్సినంత చేతికి అందాల్సిందే. వాయిదా వేయడానికి ఉండదు. తక్కువ రిస్క్ కోరుకునే వారు మధ్యే మార్గాన్ని అనుసరించాలి. 50 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీని వల్ల పెట్టుబడికి రిస్క్ ఉండదు. మిగిలిన 50 శాతాన్ని వృద్ధి కోసం ఈక్విటీలకు కేటాయించుకోవాలి. డెట్ విషయంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ లేదా టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులకు లార్జ్‌క్యాప్ ఫండ్స్ లేదా లో కాస్ట్ ఇండెక్స్ ఫండ్స్ నుంచి ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉంటే.. అప్పుడు కాస్త దూకుడుగా పెట్టుబడుల సాధనాలను ఎంపిక చేసుకోవచ్చు. ఆటుపోట్లను తట్టుకునేట్టు అయితే ఈక్విటీలకు 65 శాతం నుంచి 80 శాతాన్ని కేటాయించుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని డెట్ సాధనాలకు కేటాయించుకోవాలి. బంగారం కోసమే అయితే సార్వభౌమ బంగారం బాండ్లలో (ఎస్‌జీబీలు) కొంత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బంగారం విలువ పెరుగుదలకు తోడు, పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. ఈ బంగారంతో సోదరి పెళ్లి కోసం కావాల్సిన ఆభరణాలు చేయించొచ్చు.

డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు అనుకూల సమయం అంటూ ఉంటుందా? – వికాస్ రాజ్

డెట్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు సరైన సమయం అంటూ ఏదీ ఉండదు. డెట్ ఫండ్స్‌లో మీ పెట్టుబడుల కాల వ్యవధికి అనుకూలమైన పథకాన్ని ఎంపిక చేసుకోవడం కీలకమవుతుంది. చాలా మంది ఇన్వెస్టర్లు దీర్ఘకాలం కోసం డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. మీరు ఎంపిక చేసుకునే పథకం భద్రత ఎక్కువగా ఉండే సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసేలా ఉండాలి. ఈక్విటీ మార్కెట్లు పడినప్పుడు కొనుగోలు చేసే మాదిరి అని అన్నారు. కానీ, అదేమంత సులభం కాదు. ఎందుకంటే ఈక్విటీ మార్కెట్లు పడిపోతున్నప్పుడు దిద్దుబాటు చివరికి వచ్చిందా.. ఇంకా కరెక్షన్ మిగిలి ఉందా అన్నది ఎవరికీ తెలియదు. అందుకని ఇన్వెస్టర్లు క్రమశిక్షణతో కూడిన విధానాన్ని ఆచరించాలని చెబుతుంటాను. మీరు ప్రతి నెలా నిర్ణీత మొత్తం ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే కొంత మొత్తాన్ని మార్కెట్లు పడినప్పుడు పెట్టే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవచ్చు. కనిష్ఠ స్థాయిల్లో పెట్టుబడి పెట్టాలన్న దానిపై దృష్టి పెట్టడం వల్ల మంచిగా పెరిగే వాటిల్లో పెట్టుబడుల అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-3-2024	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	400–00
రిటైల్ ధర (డజను)	72.00
24-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395–00
వరంగల్	397–00
రిటైల్ ధర	4.25

క్లుప్తంగా...

ఐక్యతను చాటే పవిత్రబంధం హోలీ: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: హోలీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. రంగులు, ఉత్సాహంతో జరుపుకొనే హోలీ పండుగ మనందరి మధ్య ఐక్యతను బలపరిచే పవిత్ర బంధంగా పనిచేస్తుందన్నారు. విభిన్న సంస్కృతుల నిలయమైన తెలంగాణ సమాజం అన్ని పండుగలను ఐకమత్యంతో జరుపుకొంటుందని తెలిపారు. జాతీయ ఐక్యత పట్ల మనకున్న అచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

సంతోషాల హరివిల్లు హోలీ



తెలంగాణ ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ ఆప్యాయత, సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా పాలనలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి ఫలాలు అందరి కుటుంబాల్లో సప్తవర్ణ రంగుల శోభను నింపుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే కొత్త ప్రజాస్వామ్య వాతావరణం వెల్లివిరిస్తుందని రేవంత్ వెల్లడించారు.

ఆరు గ్యారంటీలతో నిత్య వసంతం: భట్టి



రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హోలీ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో సకల జనుల జీవితాల్లో నిత్య వసంతం నిండిందని భట్టి తెలిపారు. అలాగే మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి పండుగ హోలీ



సాక్షి, హైదరాబాద్: హోలీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. నిత్య జీవనంలోని కష్టాలను కాసేపు మరిచి, వయోభేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి కేరింతలతో ఆనందోత్సాహాల నడుమ రంగులతో జరుపుకొనే ప్రకృతి పండుగ హోలీ అని పేర్కొన్నారు. హోలీ పండుగ భారతీయ సామాజిక సాంస్కృతిక జీవన ప్రత్యేకతను చాటుతుందని చెప్పారు. వసంతాన్ని తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తూ జరుపుకొనే హోలీ పర్వదినం సందర్భంగా ఆ ప్రకృతి మాత ప్రజలందరినీ చల్లగా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు.

ఆన్‌లైన్‌లో రామయ్య కల్యాణం టికెట్లు

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 17న జరగ నున్న రామయ్య కల్యాణం (శ్రీరామ నవమి), 18న స్వామివారి మహా పట్టాభిషేకం కార్యక్రమాలకు సెక్టార్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా భక్తులు పొందే అవకాశం కల్పించినట్లు ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవానికి రూ.7,500 (దంపతులు), రూ.2,500, రూ.2 వేలు, రూ.1000, రూ.300, రూ.150, పట్టాభిషేకం టికెట్లు రూ.1,500, రూ.500, రూ.100గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులు భద్రాద్రి దేవస్థానం వెబ్‌సైట్ https:// bhadradritemple. telangana. gov.in ద్వారా సోమవారం నుంచి బుక్ చేసుకోవచ్చని వివరించారు. దేవస్థానంలో నేరుగా టికెట్లు పొందాలనే భక్తులకు ఆలయం వద్ద, తానీషా కల్యాణ మండపం, బ్రిడ్జి పాయింట్ సీఆర్‌వో కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. భక్తులు గుర్తింపు కార్డు సిబ్బందికి చూపించి టికెట్లు పొందవచ్చని ఈవో సూచించారు.

ముగిసిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో 5 రోజులపాటు జరిగిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు రాత్రి శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తెప్పపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. రాత్రి 7 గంటలకు విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షించారు. మంగళవాయిద్యాలు, వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది.

మనల్నీ మోసుకెళ్తుంది!

'న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్' అనే మరో రాకెట్ తయారీకి ఇస్రో శ్రీకారం

భవిష్యత్‌లో చేపట్టే భారీ ప్రయోగాలకు వీలుగా రూపకల్పన	2028 నాటికి ప్రయోగాత్మక పరీక్ష..	2035 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి..	మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకూ ఎన్‌జీఎల్‌వీనే..

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)

భవిష్యత్‌లో భారీ ప్రయోగాలకు తెర తీస్తున్న ఇస్రో.. అందుకు తగ్గట్లుగా అత్యాధునిక రాకెట్ తయారీకి శ్రీకారం చుట్టింది. ఈ రాకెట్‌కు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్(ఎన్‌జీఎల్‌వీ) అని నామకరణం చేసింది. ఇస్రో తొలినాళ్లలో చేపట్టిన రోహిణి సౌండింగ్ రాకెట్ల ప్రయోగాల తర్వాత.. 40 కిలోల నుంచి 5,000 కిలోల బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లే ఎస్‌ఎల్‌వీ, ఏఎస్‌ఎల్‌వీ, పీఎస్‌ఎల్‌వీ, జీఎస్‌ఎల్‌వీ, ఎల్‌వీఎం3, ఎస్‌ఎస్‌ఎల్‌వీ అనే ఆరు రకాల రాకెట్లను ఇప్పటివరకు అభివృద్ధి చేసింది. త్వరలో మానవ సహిత ప్రయోగంతో పాటు వ్యోమగాముల్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లి.. తిరిగి సురక్షితంగా తీసుకొచ్చే ప్రయోగాన్ని కూడా చేపట్టాలని ఇస్రో భావిస్తోంది. వీటితో పాటు అత్యంత బరువుండే సమాచార ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి పంపేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటోంది. ఈ నేపథ్యంలో న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ 20 వేల కిలోల బరువుండే ఉపగ్రహాలను భూమికి సమీపంలోని లియో ఆర్బిట్‌లోకి, 10 వేల కిలోల బరువుండే ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టే సామర్థ్యంతో ఎన్‌జీఎల్‌వీ తయారీని ఇస్రో చేపట్టింది. రూ.1,798 కోట్ల అంచనా వ్యయంతో



కూడిన ఈ ప్రాజెక్టును 2008 డిసెంబర్ 22న అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. సెమీ క్రయోజనిక్ దశ అభివృద్ధితో పాటు రాకెట్ భాగాలను రూపొందించేందుకు ఇస్రో కృషి చేస్తోంది. ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌లోని అన్ని దశలను విడివిడిగా ప్రయోగించి.. పరీక్షించనుంది. 2028 నాటికల్లా మొదటి టెస్ట్ వెహికల్‌ను, దాని సామర్థ్యాన్ని పరీక్షించి.. 2035 నాటికి పూర్తి స్థాయిలో ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

ఎన్‌జీఎల్‌వీ విశేషాలు..

ఎన్‌జీఎల్‌వీ రాకెట్ ఎత్తు	రాకెట్ వెడల్పు	3
75 మీటర్లు	5 మీటర్లు	దశల్లోనే రాకెట్ ప్రయోగం

- పీఎస్‌ఎల్‌వీ ఎక్స్‌ఎల్ తరహాలో ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌కు ఆరు స్ట్రాపాన్ బూస్టర్లుంటాయి. కోర్ అలోన్ దశలో 160 టన్నుల సెమీ క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగిస్తారు
- క్రయోజనిక్ దశలో 30 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగిస్తారు
- ఇది ఫాల్కన్ రాకెట్, అట్లాస్-వీ, ప్రోటాన్-ఎం, లాంగ్ మార్చ్-58 రాకెట్‌లకు దీటుగా ఉంటుంది. ఇటీవల ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. 2030-35 నాటికి మానవ సహిత అంతరిక్షయానం, అత్యంత బరువైన సమాచార ఉపగ్రహాల ప్రయోగాలకు ఇది వీలుగా ఉంటుందని వివరించారు.

షార్‌లో మూడో లాంచ్‌ప్యాడ్

షార్ కేంద్రంలో మూడో ప్రయోగ వేదికను నిర్మించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. ఇప్పటికే శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో రెండు ప్రయోగ వేదికలు, 4 వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగులు అందుబాటులో ఉన్నాయి. ఎన్‌జీఎల్వీ కోసం మూడో ప్రయోగ వేదిక అవసరమని ఇస్రో గుర్తించింది. ఇప్పటికే శ్రీహరికోటలో స్థలాన్ని కూడా ఎంపిక చేసినట్టు సమాచారం. భవిష్యత్‌లో మ్యాన్ ఆన్ ద మూన్ ప్రయోగంతో పాటు అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపించి.. సురక్షితంగా తీసుకువచ్చే ప్రయోగాలు, చంద్రయాన్-4లో చంద్రుడి మీదకు రోబోను పంపించే ప్రయత్నాలు వంటి ప్రయోగాల కోసం మూడో ప్రయోగ వేదికను నిర్మించేందుకు ఇస్రో సిద్ధమైంది.



కనుల పండువగా నృసింహుడి తెప్పోత్సవం

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం సాయంత్రం బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో తెప్పోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బ్రహ్మపుష్కరిణి వరకు మేళతాళాల మధ్య తీసుకెళ్లారు. కోనేరులో హంసవాహనంపై ఐదు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం భోగ మండపంలోని ఊయలపై స్వామివార్లను ఆసీనులు చేసి డోలోత్సవం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్ష మంది వరకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

కర్ణాటకలో కొని.. తెలంగాణలో అమ్మి

- డీజిల్ స్మగ్లింగ్ ముఠా పట్టివేత
- 15,000 లీటర్ల డీజిల్ స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక నుంచి డీజిల్ కొనుగోలు చేసి తెలంగాణలోని పెట్రోల్ బంకుల్లో తక్కువ ధరకు విక్రయిస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్న ముఠాను సైబరాబాద్ ఎస్‌వోటీ, పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ బృందం నిఘా వేసి పట్టుకుంది. వివరాలివి. ఆదివారం తెల్లవారుజామున సైబరాబాద్ ఎస్‌వోటీకి చెందిన శంషాబాద్ బృందం, తెలంగాణ పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ బృందం సంయుక్తంగా గచ్చిబౌలిలోని శంకర్‌హిల్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్లపై నిఘా పెట్టింది. ఈ సమయంలో అటు వస్తున్న పెద్ద ట్యాంకర్ నుండి చిన్న ట్యాంకర్లలోకి డీజిల్‌ను మార్చడాన్ని అధికారులు గమనించారు. ఈ మేరకు దాడి చేసి టాంకర్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని చించోలిలో రూ.85.75కు కొనుగోలు చేసిన డీజిల్‌ను హైదరాబాద్ లోని పెట్రోల్ బంకుల్లో విక్రయించే ధర కంటే తక్కువ ధరకు స్థానిక దళారులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక దళారులు స్మగ్లర్ల నుంచి కొనుగోలు చేసి క్రషర్ యజమానులు, ఇసుక లారీ యజమానులకు రూ.92 నుంచి రూ.94 వరకు ఎలాంటి బిల్లులు లేకుండా అమ్ముతున్నట్టు తేలింది. ఈ సందర్భంగా టాంకర్ల నుంచి సుమారు రూ.14,36,250 విలువైన 15,000 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ 43.2%

వేతన సవరణ ప్రక్రియలో భాగంగా ఖరారు • హెచ్‌ఆర్‌ఏ కోతతో నిరాశలో ఉన్న ఉద్యోగులకు ఊరట

సాక్షి, హైదరాబాద్: వేతన సవరణలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు 43.2 శాతం కరువు భత్యం(డీఏ) ఖరారైంది. వేతన సవరణ అనంతరం ఉండే మూలవేతనంపై అంతమేర కరువు భత్యాన్ని లెక్కించి జీతంలో భాగంగా చెల్లించనున్నారు. ప్రభుత్వం సవరించిన ఇంటిఅద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) తాజా వేతన సవరణతో ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వర్తించనున్న విషయం తెలిసిందే. హెచ్‌ఆర్‌ఏ భారీగా తగ్గిపోవటంతో ఉద్యోగుల వేతనంపై పెద్ద ప్రభావమే చూపనుంది. హెచ్‌ఆర్‌ఏలో కోత వల్ల, కొత్త జీతం ఆశించిన స్థాయిలో పెరగలేదని ఉద్యోగులు కొంత ఆందోళనతో ఉన్నారు. కానీ, ఇప్పుడు మెరుగైన కరువు భత్యం అందనుండటంతో.. ఆ వెలితి కొంత తీరినట్టేనని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 82.6 శాతం ఉంది. ఇప్పుడు 2017 ఏప్రిల్ నాటి వేతన సవరణను అమలులోకి తెస్తున్నందున, అప్పటికి ఉన్న 31.1 శాతం డీఏ ఉద్యోగుల మూల వేతనంలో కలిసి పోతుంది. అది పోయిన తర్వాత 51.5 శాతం డీఏ ఉంటుంది. దాన్ని ఉన్నది ఉన్నట్టుగా మూలవేతనంపై లెక్కించరని తెలుస్తోంది. వేతన సవరణ పద్ధతిలో భాగంగా దాన్ని న్యూట్రలైజ్ చేసి కొత్త డీఏను ఖరారు చేస్తారు. ఆ లెక్క ప్రకారం.. తాజా డీఏ 43.2 శాతంగా తేలింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికీ నాలుగు విడతల డీఏ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. కానీ ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం అన్ని విడతల డీఏలు చెల్లించటం విశేషం. 2024 జనవరి విడతకు సంబంధించి 3.9 శాతాన్ని తాజా వేతన సవరణలో భాగంగా చెల్లించనుండటం విశేషం. గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఏకంగా ఏడు విడతల డీఏ బకాయిలు పేరుకుపోయి ఉండేవి. అయితే కార్మిక సంఘాల ఒత్తిడి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కృషి ఫలితంగా తక్కువ సమయంలోనే ప్రభుత్వం డీఏ బకాయిలను చెల్లించింది. కొన్ని విడతలు మిగిలి ఉండగా, గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం వాటిని కూడా ప్రకటించింది. దీంతో మొత్తం బకాయిలు క్లియర్ అయి ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగులకు తాజా విడత కరువు భత్యం కూడా అందబోతోంది.

కరువు భత్యం లెక్కింపు ఇలా.. 2017 ఏప్రిల్ నాటికి ఉన్న 31.1 శాతం డీఏ మూల వేతనంలో విలీనం

విడత	డీఏ	మొత్తం	విడత	డీఏ	మొత్తం	విడత	డీఏ	మొత్తం
2017 జూలై	0.9	0.9	2020 జనవరి	4.1	15.7	2022 జూలై	3.7	31.8
2018 జనవరి	1.6	2.5	2020 జూలై	3.4	19.1	2023 జనవరి	3.9	35.7
2018 జూలై	2.2	4.7	2021 జనవరి	3.0	22.1	2023 జూలై	3.6	39.3
2019 జనవరి	2.8	7.5	2021 జూలై	3.0	25.1	2024 జనవరి	3.9	43.2
2019 జూలై	4.1	11.6	2022 జనవరి	3.0	28.1	(అంకెలు శాతాల్లో)		

ఎదురుచూపులే...

వేసవి సెలవులకు అరకొర రైళ్లే.. అన్ని రైళ్లలో వందల్లో వెయిటింగ్ లిస్ట్

సెలవుల్లో భారీగా పెరగనున్న ప్రయాణాలు

ఇప్పటివరకు ప్రత్యేక రైళ్లు ప్రకటించని దక్షిణమధ్య రైల్వే

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవుల్లో పర్యాటక ప్రదేశాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకునే నగర వాసులకు ఈసారి ఎదురుచూపులు తప్పేలా లేవు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలోనే వెయిటింగ్ లిస్టు ఇప్పటికే వందల్లోకి చేరింది. ఏటా పిల్లలకు పరీక్షలు ముగియగానే ఇంటిల్లిపాది నచ్చిన ప్రదేశాలకు వెళ్తుంటారు. సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ కూడా బాగానే ఉంటుంది. ఇందుకనుగుణంగా దక్షిణమధ్య రైల్వే వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, బెంగళూరు, ఢిల్లీ, జైపూర్, పాట్నా తదితర ప్రాంతాలకు నగర వాసులు తరలి వెళ్తుంటారు. టూర్లతో పాటు పెళ్లిళ్లు, వేడుకలకు రాకపోకలు సాగించే వారి సంఖ్యా ఎక్కువ గానే ఉంటుంది. మార్చి నుంచి జూన్ తొలివారం వరకు సాధారణ రోజుల్లో కంటే ప్రయాణికుల సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటుంది. అయితే ఈసారి ఎన్నికలు కూడా తోడుకావడంతో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా.

వందల్లో వెయిటింగ్: హైదరాబాద్ నుంచి విశాఖకు రాకపోకలు సాగించే అన్ని ప్రధాన రైళ్లలో వెయిటింగ్ లిస్టు భారీగా నమోదవుతోంది. అలాగే తిరుపతి, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ తదితర నగరాలకు రాకపోకలు సాగించే రైళ్లన్నీ నిండిపోయాయి. ఏటా ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని మార్చి మొదటివారం నాటికే కనీసం 50 నుంచి 100 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే



ఏర్పాట్లు చేసేది. కానీ, కొంతకాలంగా ముందస్తుగా ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించడం లేదు. ప్రయాణికుల రద్దీ మేరకు అప్పటికప్పుడు రైళ్లను నడుపు తున్నారు.

ఇక వివాహ వేడుకలకు, పర్యాటకానికి కేరాఫ్‌గా భావించే జైపూర్‌కు కూడా నగరవాసులు భారీగా తరలి వెళ్తుంటారు. కానీ హైదరాబాద్ నుంచి జైపూర్ వరకు డిమాండ్‌కు సరిపడా రైళ్లు అందుబాటులో లేవు. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వెదుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రైల్వే అధికారులు మేల్కొని వేసవి రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అయోధ్య, ఆగ్రా వెళ్లాలనుకున్నాం

'ఈ సారి అయోధ్యతో పాటు ఆగ్రా, ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో పర్యటించాలనుకుంటున్నాం. కానీ ఏప్రిల్‌లో మేం బయల్దేరవలసిన తేదీల్లో వెయిటింగ్ జాబితా ఉంది. వెయిటింగ్ లిస్ట్‌లో టికెట్ బుక్ చేసుకుని చివరి నిమిషం వరకు ఎదురు చూడలేం. ఆర్థికంగా భారమే అయినా ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది.'

– ఆనంద్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి

ఎన్నికల రద్దీ..

ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్తాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం లక్షలాది మంది నగరానికి వలస వచ్చారు. వీరిలో చాలామంది నిర్మాణ రంగంలో పని చేస్తున్నారు. వీరంతా ఈసారి ఎన్నికల కోసం సొంత ఊళ్లకు వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే సికింద్రాబాద్-దానాపూర్, సికింద్రాబాద్-వారణాసి, సికింద్రాబాద్-పాట్నా తదితర రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఎన్నికల నాటికి ఈ రద్దీ మరింత పెరగనుంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ఇప్పటివరకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

ఇన్ ఫ్రంట్ క్రొకడైల్ ఫెస్టివల్

కాకపోతే మొసలికి...



నీ ఇంటికొచ్చా.. నీ నట్టింటికొచ్చా టైపులో ఈ జాగ్వార్ ఏకంగా మొసలి సామ్రాజ్యంలోకి అడుగుపెట్టి మరీ దాని పని పట్టింది. మడుగులోకి దిగి.. మొసలిని తన పళ్లతో పట్టుకుని ఇచ్చిన ఆ లుక్ చూడండి. ఈ చిత్రం సోనీ వరల్డ్ ఫొటోగ్రఫీ అవార్డ్-2024లో నాచురల్ వరల్డ్ అండ్ వైల్డ్ లైఫ్ విభాగంలో విజేతగా నిలిచింది. బ్రెజిల్‌లోని పంటనల్ ప్రాంతంలో ఇయాన్ ఫోర్డ్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

మొసలి ఎముకలైనా..

30 సెకన్లలో మటాష్!



ప్రమాదకరమైన చేపలు అనగానే.. షార్క్‌లు, ఫిరానాలు గుర్తుకురావడం కామనే. కానీ వాటికన్నా ప్రమాదకరమైన ఓ చేప గురించి తెలుసా? పెద్ద పెద్ద కోరల్లాంటి పదునైన పళ్లతో, దొరికితే చాలు చీల్చిపడేసే ఆ చేపలు 'టైగర్ ఫిష్'లు. ఆఫ్రికా ఖండంలోని సరస్సులు, నదుల్లో కనిపించే ఈ చేపలు టార్గెట్ చేశాయంటే.. ఎంత పెద్ద చేప అయినా నిమిషాల్లో మటాష్ అవ్వాల్సిందే. ఈ చేపలు మరీ క్రూరంగా, దూకుడుగా వ్యవహరిస్తాయి. కేవలం 30 సెకన్లలో మొసళ్ల ఎముకలను కూడా కొరికి పడేయగలవు. చూడటానికి కూడా కాస్త భయం గొలిపేలా ఉన్న ఈ చేపలు.. మందలు మందలుగా వేటాడుతాయి.

నీటి కోసం వచ్చే పక్షులను పట్టేసి..

ప్రపంచంలో అత్యంత క్రూర ప్రవృత్తి ఉన్న చేపలుగా టైగర్ ఫిష్‌లకు పేరుంది. అడుగు నుంచి మూడు అడుగుల వరకు ఉండే ఈ చేపలు సరస్సులు, నదుల్లో ఉపరితలానికి కాస్త కింద మాటు వేస్తాయి. నీళ్లు తాగడానికి వచ్చే పక్షులు, చిన్నపాటి జంతువులను చటుక్కున పట్టేసి కొరికి తినేస్తాయి.

పిడుగెప్పుడు

పడుతుంది?



చెప్పడం కష్టం కదా.. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మాత్రం మరీ అంత కష్టం కాదని చెబుతోంది. మీ తల వెనకాల, మెడకు పైభాగంలో వెంట్రుకలు కాస్త నిక్కబొడిచినట్లు పైకి లేచినట్టు అయిందంటే.. మీకు అతి దగ్గరలో పిడుగు పడే అవకాశం ఉందని అర్థమట. అలాగే వాన రాకడ.. ప్రాణం పోకడ కూడా ఎవరికీ తెలియదనేది సామెత. అయితే ఉరుములు మెరుపులతో జడి వాన కురిసే పరిస్థితిని కొన్ని అంశాలతో ముందే గుర్తించవచ్చని ఐఎండీ పేర్కొంది. ఈ మేరకు 'ఎక్స్'లో సూచనలు చేసింది. ఈ సమయంలో ఆకాశంలో బాగా ఎత్తుగా కాలీఫ్లవర్ వంటి ఆకృతిలోని దట్టమైన నల్లటి మేఘాలు.. అలాగే నిలువుగా మేఘాలు కమ్ముకుంటాయట. అప్పటికప్పుడు చల్లటి గాలి వీయడం మొదలవుతుందని ఐఎండీ తెలిపింది.

సాక్షి సెంట్రల్‌డెస్క్

వల్లకాటిలో కన్నీటి రాత్రి

మృతదేహాన్ని అనుమతించని అద్దె ఇంటి యజమాని

రాత్రంతా మృతదేహంతో శ్మశాన వాటికలో జాగారం

నాడు కొడుకు.. నేడు తల్లికి ఇదే దుస్థితి



కేసముద్రం శ్మశానవాటికలో రుక్కమ్మ మృతదేహంతో కుటుంబ సభ్యులు

కేసముద్రం: అద్దె ఇంట్లో ఉంటున్న ఒక వృద్ధురాలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా.. మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకొచ్చేందుకు యజమాని నిరాకరించాడు. దీంతో చేసేది లేక రాత్రంతా శ్మశానవాటికలోనే మృతదేహంతో కుటుంబ సభ్యులు గడిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. కేసముద్రం గ్రామానికి చెందిన రంగోజు రుక్కమ్మ (85) కుటుంబంతో అద్దె ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురికాగా.. వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆరోగ్యం విషమించి శనివారం రాత్రి మృతి చెందింది. దహన సంస్కారాల నిమిత్తం మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా.. అద్దె ఇంటి యజమాని అడ్డుకున్నాడు. దీంతో మృతదేహాన్ని ఎటు తీసుకెళ్లాలో తెలియక.. నేరుగా శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజాము వరకు అక్కడ ఓ గదిలో మృతదేహాన్ని ఉంచి కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. గ్రామానికి చెందిన అంతర్యామి స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు అందజేసిన రూ.8 వేల ఆర్థిక సాయంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా మృతురాలు రుక్కమ్మ కుమారుడు సమ్మయ్య ఏడాది క్రితం మృతి చెందగా, సొంతిల్లు లేకపోవడంతో ఇదే గ్రామంలో ఓ చెట్టు కింద అతని మృతదేహాన్ని ఉంచి, దాతల సహకారంతో అంత్యక్రియలను నిర్వహించారు.

ఇంటిపట్టా ఇచ్చి.. స్థలం మరిచి..: గత ప్రభుత్వం భుక్యారాంతండా జీపీ శివారు కాలనీ తండాలో ఇంటి నిర్మాణానికి పట్టా ఇచ్చినా స్థలం కేటాయించలేదని మృతురాలి కోడలు ఉపేంద్ర వాపోయింది. గతంలో తన భర్త అంత్యక్రియలు చెట్టు కింద చేశామని, ప్రస్తుతం తన అత్త దహన సంస్కారాలు శ్మశానవాటికలో చేశామని విలపించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.